


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★



ఉగ్రవాదులకంటే మేధావులే ప్రమాదం

ఎర్రకోట పేలుడు కేసు.. కస్టడీలోకి వైద్యులు, మత బోధకుడు

అమెరికాను నిలదీస్తారా? లేదా?

05



సంపుటి 08, సంచిక: 350 | శుక్రవారం | 21-11-2025 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## బిల్లుల ఆమోదానికి కాలపరిమితి లేదు

స్పష్టం చేసిన సుప్రీం కోర్టు

రాజ్యాంగ బద్ధంగా నడుచుకోవాలని గవర్నర్లకు హితవు

**న్యూఢిల్లీ :** రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులకు గవర్నర్లు, రాష్ట్రపతి ఆమోదం తెలిపేందుకు నిర్దిష్టమైన కాలపరిమితి లేదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. అయితే, రాజ్యాంగ బద్ధంగా నడుచుకోవాలని గవర్నర్లకు హితవు పలికింది. నిర్ణీత వకాల పరిమితి పూర్తయిన తర్వాత, గవర్నర్ల వద్ద ఉన్న ఆయా బిల్లులకు ఆమోదం లభించినట్టుగా భావించాల్సిగా ఆదేశించే అధికారం సుప్రీం కోర్టుకు లేదని, ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న కీలక తీర్పులో, ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయి అధ్యక్షతన, జస్టిస్ సూర్యకాంత్, విక్రమ్ నాథ్, పిఎస్ నరసింహా, ఎఎస్ చందుర్కర్‌లతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. ఆర్టికల్ 200 ద్వారా కల్పించిన అధికారాలకు మించి బిల్లులను తమ వద్ద ఉంచుకోలేరని కూడా ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం తన ఏకగ్రీవ తీర్పులో వ్యాఖ్యానించింది. రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులను నిరవధికంగా అడ్డుకునే అపరమితమైన అధికారం గవర్నర్లకు ఉందని తాము భావించడం లేదని పేర్కొంది. అయితే, భారత్ వంటి ప్రజాస్వామ్య దేశంలో గవర్నర్లపై కాల పరిమితులు విధించడం రాజ్యాంగంలో బిల్లుల ఆమోదానికి ఇచ్చిన సౌలభ్యానికి విరుద్ధమని కూడా సుప్రీం కోర్టు ధర్మాసనం వివరించింది. తీర్పులోని ప్రధాన అంశాలను వెల్లడిస్తూ, బిల్లులను ఆమోదించడం లేదా రాష్ట్రపతి పరిశీలనకు పంపడం లేదా ఆమోదించకుండా తిరిగి అసెంబ్లీకి పంపడం అనే మూడు ఎంపికలు మాత్రమే రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 కింద గవర్నర్లకు ఉంటాయని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. గవర్నర్ బిల్లులను ఆమోదించడంలో జాప్యం చేయడాన్ని ప్రశ్నిస్తూ సుప్రీం కోర్టులో తమిళనాడు ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దానిపై విచారణ జరిపిన తరువాయి 2లో



న్యాయం సమానత్వం కోసం సిపిఐ

## నిరంతర పోరాటాలు

పార్టీ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి

పేదల మౌలిక సమస్యలు అలాగే ఉన్నాయ్ : బాలనర్సింహ, సత్యం

ప్రజాపక్షం/హుజూర్‌నగర్

దేశంలోని అట్టడుగు వర్గాలకు న్యాయం, సమానత్వం కోసం సిపిఐ నిరంతరం పోరాటాలు చేస్తుందని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. గద్వాలలో ప్రారంభమైన ప్రచార జాత గురువారం సూర్యాపేట జిల్లాలో నేరేడుచర్ల, గరిడేపల్లి, హుజూర్‌నగర్, చిలుకూరు, కోదాడలో కొనసాగింది. హుజూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం. బాలనర్సింహ, ఎమ్మెల్సీ సత్యంతో కలిసి పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ అధికారం లేకున్నా తరువాయి 12లో



ఎర్రజెండాలో చీలికలు వచ్చేలా

## పాలకుల కుట్రలు

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు

కమ్యూనిస్టులు బలంగా ఉంటేనే ప్రజలకు రక్షణ : చాడ

ప్రజాపక్షం/గూడూరు

మతోన్మాద పార్టీలను ప్రజలు పారద్రోలాలని నిరుపేద ప్రజల సమస్యల పరిష్కారానికి సిపిఐ అహర్నిశలు అలుపెరగని కృషి చేస్తున్నదని రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. మోదీ ప్రభుత్వంలో శాంతి భద్రతలు క్షీణించాయని, ఎర్రజెండాల్లో చీలికలు వచ్చేలా పాలకులు కుట్రలు చేస్తున్నారని అందరూ ఏకమై ప్రజా ప్రయోజనాల కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తరువాయి 12లో



## నేటికీ అందని ఉచిత విద్య, వైద్యం

వాటి సాధనకు యువత, విద్యార్థులు ముందుకురావాలి

సిపిఐ జాతీయ కార్యవర్గసభ్యురాలు పశ్య పద్మ

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి

స్వాతంత్రం సిద్ధించి 8 దశాబ్దాలు గడుస్తున్నా రాజ్యాగ పీఠికలో సూచించిన విధంగా ఉచిత విద్య, ఉచిత వైద్యం నేటికీ దక్కటం లేదని, వీటిని సాధించుకునేందుకు యువత, విద్యార్థులు ముందుకు రావాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ పిలుపిచ్చారు. ప్రభుత్వ విద్యా సంస్థల కంటే అనేక రెట్లుగా ఉన్న ప్రైవేటు విద్యా సంస్థల్లో సామాన్య జనం లక్షల్లో ఫీజులు చెల్లించాల్సి వస్తోందని విమర్శించారు. నేటికీ దేశంలో 83 శాతం ప్రజలు కేవలం ఐదో తరగతి వరకు మాత్రమే చదువుకోగలుగుతున్నారని, 17 శాతం మాత్రమే ఉన్నత విద్య పొందగలుగుతున్నారని ఆవేదన వక్తం చేస్తూ ఇలాంటి తరువాయి 12లో



ఫార్ములా ఇ-కార్ రేస్ కేసు

## కెటిఆర్ విచారణకు గవర్నర్ అనుమతి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్టంలో సంచలనం సృష్టించిన ఫార్ములా ఈకార్ రేస్ కేసులో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు బిగ్ షాక్ తగిలింది. ఫార్ములా ఇ– కార్ రేస్ కేసులో విచారణకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గురువారం ఎసిబి అధికారులకు అనుమతి ఇచ్చారు. దీంతో, ఇ–కారు రేస్ కేసులో కెటిఆర్‌పై ఛార్జ్ షీట్ వేసేందుకు ఎసిబికి గవర్నర్ అనుమతి లభించినట్లయిందని అధికారులు చెబుతున్నారు. అయితే, కెటిఆర్‌పై విచారణకు గవర్నర్ అనుమతి కోరుతూ ఇటీవల తెలంగాణ ప్రభుత్వం లేఖ రాయడంతో, న్యాయ నిపుణుల సలహా అనంతరం గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఫార్ములా ఇ కార్ రేస్‌లో క్విడ్‌ప్రొకొ జరిగినట్టు ఎసిబి నివేదిక సమర్పించిన విషయం తెలిసిందే. రూ.54.88 కోట్ల నిధులు దారి మళ్లింపుపై ఆరోపణలు చేసింది. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే రెండు సార్లు ఎసిబి విచారణకు, ఒకసారి ఈడి విచారణకు కెటిఆర్ హాజరయ్యారు. ఫార్ములా ఈకార్ రేసింగ్ వ్యవహారంపై 2024 డిసెంబర్ 18న ఎసిబి కేసు నమోదు చేసింది. ఎ1గా కెటిఆర్, ఎ2గా ఐఎఎస్ అధికారి అర్వింద్‌కుమార్, ఎ3గా హెచ్‌ఎండిఎ చీఫ్ ఇంజనీర్ బిఎల్‌ఎన్ రెడ్డిపై కేసు నమోదైంది. తాజా పరిణామంతో త్వరలోనే కెటిఆర్‌పై అభియోగాలు తరువాయి 2లో

మావోయిస్టుల హత్యాకాండను నిరసిస్తూ

## నేడు అఖిలపక్షం ధర్నా




- సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం నిర్ణయం
- పాక్ ఉగ్రవాదులకు చర్చలకు అవకాశం ఇచ్చి మావోయిస్టులకు ఎందుకివ్వడంలేదని కేంద్రాన్ని నిలదీత
- బూటకపు ఎన్‌కౌంటర్లపై పౌర సమాజం స్పందించకుంటే భవిష్యత్తులో ప్రమాదకర పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరిక

ప్రజాపక్షం/హైదరాబాద్

బూటకపు ఎన్‌కౌంటర్ల పేరుతో మావోయిస్టు నాయకులను హత్య చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఉదయం హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద 'అఖిల పక్ష పార్టీల ధర్నా' నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా సంతకాల సేకరణను చేపట్టాలని సమావేశం తీర్మానించింది. పాకిస్తాన్ ఉగ్రవాదులకు చర్చలకు అవకాశం కల్పిస్తున్న కేంద్ర ప్రభుత్వం, దేశ పౌరులైన, పేదల కోసం పనిచేస్తున్న మావోయిస్టులతో ఎందుకు చర్చలు జరపడంలేదని నిలదీసింది. బూటకపు ఎన్‌కౌంటర్లపై పౌర సమాజం స్పందిచకపోతే భవిష్యత్‌లో మరింత ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొవాల్సి ఉంటుందని సమావేశం హెచ్చరించింది. 'బిజెపి ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్ల ద్వారా మావోయిస్టులను చంపడాన్ని' నిరసిస్తూ సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో గురువారం 'రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివ రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వామపక్ష, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, పౌర హక్కుల నాయకులు, మేధావులు తదితరులు హాజరయ్యారు. అభివృద్ధి నమూనా పేరుతో అటవీ ప్రాంతాల్లోని ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు అడ్డంకిగా మారిన మావోయిస్టులను ఎన్‌కౌంటర్ పేరుతో కేంద్రం హత్య చేస్తోందని వక్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. 2026 మార్చి నాటికి అడవిలోని ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు ఇస్తామని కేంద్రం మాట ఇచ్చిందని, అందుకే ఆ గడువులోపు మావోయిస్టులను హత్య చేస్తుందని ధ్వజమెత్తారు. లొంగిపోయేందుకు ప్రయత్నించిన వారిని, కాల్పులు విరమించి షెల్టర్ తీసుకున్న మావోయిస్టులను చుట్టుముట్టి, వారిపై తరువాయి 2లో

డిసెంబర్‌లో పంచాయతీ

## ఎన్నికలు

16వ తేదీలోపు మూడువిడతల్లో పూర్తిచేసేందుకు ఎన్నికల కమిషన్ కసరత్తు

రిజర్వేషన్లపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన డెడికేటెడ్ కమిషన్

50 శాతం మించకుండా ఎన్నికలు నిర్వహించాలని సిఫారసు

ఈనెల 24న హైకోర్టు విచారణకు ముందే ప్రక్రియను పూర్తిచేయనున్న రాష్ట్ర సర్కార్




ప్రజాపక్షం/హైదరాబాద్

గ్రామ పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లకు సంబంధించిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి డెడికేటెడ్ కమిషన్ గురువారం సమర్పించింది. పంచాయతీలు, వార్డుల వారీగా ఎస్‌సి,ఎస్‌టి,బిసి రిజర్వేషన్లు 50 శాతం మించకుండా డెడికేటెడ్ కమిషన్ సిఫారసు చేసింది. గ్రామపంచాయతీ ఎన్నికలను వెంటనే నిర్వహించాలని, 50 శాతం రిజర్వేషన్లకు మించకుండా ముందుకు వెళ్లాలని రాష్ట్ర మంత్రి వర్గం ఇటీవల తీర్మానించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే 50 శాతం రిజర్వేషన్లకు అనుగుణంగా నివేదికను ఇవ్వాలని డెడికేటెడ్ కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం కోరింది. దీంతో కమిషన్ నివేదికను సమర్పించింది.ఈ నెల 24న హైకోర్టు విచారణకు ముందే రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రక్రియను పూర్తి చేయనుంది. రాష్ట్రంలోని 12,733 పంచాయతీ, 1,12,288 వార్డులల్లో డిసెంబరు 16 వరకు మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు పూర్తి చేసేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ కసరత్తు చేస్తోంది.

**ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి : రాణి కుముదిని**

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు (ఎన్నికల అధికారులు), పోలీసు ఉన్నతాధికారులు, అదనపు కలెక్టర్లు, పంచాయతీ అధికారులతో గురువారం రాణి కుముదిని వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, తరువాయి 2లో


భార్య, పిల్లల హత్యకేసులో నిందితుడికి ఉరిశిక్ష

03

రూ.161 కోట్లు వెంటనే విడుదల చేయండి


## 10వసారి సిఎంగా నితీశ్ ప్రమాణం

ముఖ్యమంత్రితో సహా 27 మంది ప్రమాణ స్వీకారం

బిజెపి నుంచి 14, జెడియు నుంచి 8, ఎల్‌జెపి(ఆర్‌వి) నుంచి ఇద్దరు, హెచ్‌ఎఎం, ఆర్‌ఎల్‌ఎం నుంచి ఒక్కొక్కరికి చోటు




**పాట్నా :** బిహార్‌లో కొత్త ప్రభుత్వ కొలువుదీరింది. రాష్ట్రంలో అత్యంత ఎక్కువ కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన నితీష్ కుమార్ రికార్డు స్థాయిలో 10వ సారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. గురువారం గాంధీ మైదానంలో జరిగిన కార్యక్రమంలో నితీశ్‌తో గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ ప్రమాణం చేయించారు. నితీశ్ కుమార్‌తో పాటు 26 మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. అందులో బిజెపి నుంచి 14 మంది, జెడియు నుండి 8 మంది, తరువాయి 12లో


రష్యా—ఉక్రేన్ శాంతికి

## 28 అంశాలతో ట్రంప్ ప్రణాళిక?


ఉక్రేన్ సైన్యాన్ని తగ్గించుకోవాలి

ఆక్రమిత రష్యా భూభాగాన్ని అప్పగించాలి

జెలెన్‌స్కీతో 'పెంటగాన్' అధికారుల భేటీ



**కీవ్:** ఉక్రేన్‌లో రష్యా యుద్ధం ముగించేందుకు అమెరికా ఒక ముసాయిదా ప్రణాళిక రూపొందించింది! పెంటగాన్‌లోని అమెరికా రక్షణశాఖాధికారుల బృందం 28 అంశాలతో కూడిన ఈ ముసాయిదా ప్రణాళికపై ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో చర్చించేందుకు కీవ్ నగరానికి వెళ్ళింది. ఈ ముసాయిదా ఇప్పటికే జెలెన్‌స్కీ చేతికి అందింది. అమెరికా ఆర్మీ సెక్రటరీ డాన్ డ్రిస్కోల్ – జెలెన్‌స్కీ గురువారం పొద్దుపోయాక దీనిపై సంభాషణలు జరిపారు. పశ్చిమ ఆసియాలో గాజా ప్రణాళిక విజయవంతం కావడంతో అదే తరహాలో ట్రంప్ శాంతి ఒప్పంద ముసాయిదాను ముందుకు తెచ్చారని భావిస్తున్నారు. ట్రంప్ సహాయంతో అమెరికా ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్, రష్యా తరపున ప్రత్యేక దూత కిరిల్ ద్రీత్రియేవ్ ఈ ముసాయిదా రూపొందించారన్నది బిబిసి కథనం. ఈ నేపథ్యంలో అమెరికా రక్షణమంత్రి మార్కో రుబియో ఎక్స్ వేదికగా ఒక పోస్టింగ్ పెడుతూ, ఉక్రేన్–రష్యాలమధ్య దీర్ఘకాలం నిలిచి ఉండే మన్నికైన శాంతి ఒప్పందం సాధించాలంటే, ఇరు దేశాలూ సానుకూల అంగీకారం కష్టమే అవుతుందని, ఐతే కొన్ని రాయితీలతో తరువాయి 2లో



## ఫిజికల్ ఇంటెలిజెన్స్ సిటీగా హైదరాబాద్

8 వారాల పైలెట్ ప్రోగ్రామ్ అమలుకు నిర్ణయం

సిఎం రేవంత్ రెడ్డితో అనలాగ్ ఎఐ సిఇఒ కిప్మన్ భేటీ

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్‌ను దేశంలోనే అత్యంత నివాసయోగ్య నగరంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం వీలైనంత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటుందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చెప్పారు. హైదరాబాద్‌లోని సిఎం నివాసంలో గురువారం అనలాగ్ ఎఐ తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## బంగ్లాదేశ్‌లో కేర్‌టేకర్ ప్రభుత్వ విధానం పునరుద్ధరణ

**ఢాకా:** బంగ్లాదేశ్ పార్లమెంటుకు ఎన్నికలు జరిగే సమయంలో పోలింగ్ జరిగేందుకు వీలుగా ఏ పార్టీకీ చెందని తాత్కాలిక ప్రభుత్వం(కేర్ ప్రభుత్వ వ్యవస్థ)90 రోజులపాటు అమలులో ఉండేవిధంగా పాతకాలపు నిబంధనలను ఆదేశసుప్రీంకోర్టుపునరుద్ధరించింది. ఐతే ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో ఉన్నది తాత్కాలిక ప్రభుత్వమే గనుక మమ్మద్ యూనుస్ నాయకత్వంలో ఉన్న ప్రభుత్వ హయాంలోనే 2026 ఫిబ్రవరిలో ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుంది.పార్లమెంటుకుజరిగే ఎన్నికల సమయంలోఅప్పటివరకూ ఉన్న ప్రభుత్వం రద్దుఅవుతుంది.తాత్కాలిక ప్రభుత్వం 90రోజులు అధికారంలో ఉంటుంది. కొత్త ప్రభుత్వం ఏర్పడేవరకూ తాత్కాలిక ప్రభుత్వం ఉంటుంది.2011లో ఈ విధానాన్ని రద్దుచేస్తూ ఆనాటి సుప్రీంకోర్టు తీర్పుచెప్పింది. ఇప్పుడు బంగ్లాదేశ్ సుప్రీంప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రెఫాత్ అహ్మద్ నాయకత్వంలో విస్తృత ధర్మాసనం 2011నాటిధర్మాసనంతీర్పు చట్టవిరుద్ధమని తెలిపింది.

# గాజాలో ఐడిఎఫ్ దాడులు : 32 మంది మృతి

**జెరూసలెం:** ఇజ్రాయెల్ సైన్యం బరిదెగించి గాజావ్యాప్తంగా ప్రాణాంతక దాడులు చేసింది. గడచిన 24 గంటలుగా దాడుల్లో 32 మంది పాలస్తీనియన్లుమరణించారు. మరో 88 మంది గాయపడ్డారు. గాజాలో రెండు సంవత్సరాల యుద్ధాన్ని నిలిపివేసేవిధంగా అధికారికంగా ఐక్యరాజ్యసమితి భద్రతామండలి ట్రంప్ ప్రతిపాదించిన 20 సూత్రాల శాంతి ప్రణాళికను ఆమోదించిన తర్వాత ఇజ్రాయెల్ సైన్యం కాల్పుల విరమణ ఉల్లంఘన ప్రారంభించింది. బుధవారం జరిపిన దాడుల్లో 27 మంది పాలస్తీనియన్లు మరణించారు. వరుసగా రెండోరోజు గురువారం జరిపిన దాడుల్లో మరో ఐదుగురు మరణించారు. మృతుల్లో ఎనిమిదిమంది మహిళలున్నారు. దక్షిణగాజా తూర్పు ఖాన్ యూనుస్‌లో బనిసుహైలా ప్రాంతంలో గురువారం జరిపిన గగనతల దాడుల్లో ముగ్గురు, అబసన్ అల్ కబిరా ప్రాంతంలో ఇద్దరు మరణించారు. దీంతో కాల్పుల విరమణ ఉన్నప్పటికీ 776 రోజులుగా జరుగుతున్న యుద్ధం,ఏకపక్ష దాడుల్లో 69,546 మంది పాలస్తీనియన్లు మరణించారు. కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చిన తర్వాత గడచిన ఐదు వారాలలో పూర్తిస్థాయిలోఇజ్రాయెల్ సైన్యం కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి దాడులు కొనసాగించింది. దీంతో ఈ ఒప్పందం ఉనికి సందిగ్ధంలో పడిందని హమాస్ అధీనంలో ఉన్న గాజా ఆరోగ్య మంత్రిత్వశాఖ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. గాజా సిటీ పొరుగున ఈస్ట్రన్ జియోటోన్‌లోని ముస్లిం దేవాదాయ మంత్రిత్వశాఖ భవనంపై జరిపిన గగనతల దాడుల్లో 10 మంది మరణించారు. ఐతే ఐడిఎఫ్ మాత్రం భిన్నకథనం వినిపించింది. హమాస్ ఉగ్రవాదులు కాల్పుల విరమణ ఒప్పందానికి పాల్పడ్డారని, ఖాన్‌యూనిస్‌లో ఇజ్రాయెల్ సైనికులు ఉన్న ప్రాంతంపై కాల్పులు జరిపారని, దీంతో హమాస్ ఉగ్రవాద స్థావరాలను అణచివేసేందుకు ఇజ్రాయెల్ సైన్యం దాడులు చేయాల్సి వచ్చిందని సాకులు చెప్పింది. దీంతో హమాస్ తీవ్రంగా స్పందించింది. ఇజ్రాయెల్ సైన్యం కుంటిసాకులు చెబుతోందనీ, కాల్పుల విరమణను ఉల్లంఘించి ప్రమాదకరమైన స్థాయిలో యుద్ధాన్ని విస్తరించాలని ప్రయత్నిస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది.గాజాలో ఇజ్రాయెల్‌చాలా తీవ్రస్థాయిలో కాల్పుల విరమణ ఒప్పంద ఉల్లఘునలకు పాల్పడుతోందని, అరబ్ లీగ్, ఐఓసి (ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ కో–ఆపరేషన్)లు చాలా స్పష్టమైన వైఖరితో కఠిన చర్యలకు సహకరించాలని పాలస్తీనా ప్రతిఘటన సంస్థ హమాస్ అధికార ప్రతినిధి హాజెమ్ క్వాస్సెమ్ డిమాం డ్ చేశారు. అక్టోబరు 10వ తేదీన గాజాలో కాల్పుల విరమణ ఒప్పం దం అమలులోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకూ 246 మంది పాలస్తీనియన్లు హతులయ్యారని,286 సార్లు కాల్పుల ఉల్లంఘనలకు పాల్పడిందని, అధికారికంగా పాలస్తీనియన్లను విదేశాలకు వెళ్ళిపోయేందుకు ప్రోత్సహిస్తోందని, వెస్ట్‌బ్యాంక్‌లో పాలస్తీనియన్లపై దాష్టీకాలు సాగిస్తోందని, కీలకమైన అవసరాలు నెరవేర్చకుండా ముఖ్యమైన సహాయాన్ని గాజాలోకి రాకుండా అడ్డుకుంటున్నదని ఆయన విమర్శించారు.



### వెస్ట్‌బ్యాంక్‌లో యుద్ధ నేరాలపై దర్యాప్తుకు హ్యూమన్ రైట్స్ డిమాండ్

వెస్ట్‌బ్యాంక్‌లో ఉన్న మూడు శరణార్థ శిబిరాల నుండి ఈ నెలారంభంలో 32 వేలమంది పాలస్తీనియన్లను ఇజ్రాయెల్ బలవంతంగా వెళ్ళగొట్టిన సమయంలో చాలా తీవ్రమైన యుద్ధ నేరాలకు పాల్పడి ఉండవచ్చునని మానవ హక్కుల సంఘం ''హ్యూమన్ రైట్స్ వాచ్'' (హెచ్‌ఆర్ డబ్ల్యు) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విషయంలో ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ, ఆర్థికమంత్రి బెజెలెల్ స్మోట్రిక్, రక్షణమంత్రి ఇజ్రాయెల్ కట్జ్‌లను నిలదీసి వారిపై విచారణ చేయాల్సిన అవసరం ఉందని కోరింది. వారు తప్పు చేసి ఉండవచ్చుననీ, అందువల్ల వారిని విచారణ చేసి అందుకు ఎవరు బాధ్యులో తేల్చవలసి ఉందని కోరింది. వెస్ట్‌బ్యాంక్ నుండి 32,000 మంది పాలస్తీనియన్లను బలవంతంగా వెళ్ళగొట్టారని, ఇది అంత శాంతియుతంగా జరిగే ప్రక్రియ కాదని సందేహం వ్యక్తం చేసింది. యావత్ ప్రపంచం గాజాలో యుద్ధంపైనే దృష్టిసారించిందని, కానీ వెస్ట్‌బ్యాంక్ ఉత్తర ప్రాంతంలో ఉన్న మూడు శరణార్థ శిబిరాలపై జరిగిన దాడులను గమనించలేదని పేర్కొంది. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఈ యుద్ధ నేరాలు జరిగి ఉండవచ్చునని అంచనా వేసింది.

## ఆస్ట్రేలియాలో డిసెంబరు 4 నుండి టీనేజర్లకు ఫేస్‌బుక్,ఇన్‌స్టాగ్రామ్ నిషేధం



**కాన్‌బెర్రా:** ఆస్ట్రేలియాలో టీనేజర్లకు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, థ్రెడ్స్‌లను అందుబాటులో లేకుండా ఎకౌంట్లను నిషేధిస్తున్నట్లు 'మెటా' ప్రకటించింది. ఆస్ట్రేలియాలో డిసెంబరు 10వ తేదీ నుండి సోషల్ మీడియాపై ఆంక్షలను ప్రభుత్వం అమలు చేయడం ప్రారంభించనున్నది. దీనికంటే వారం రోజులు ముందుగానే మెటా సంస్థ ఆస్ట్రేలియాలో 16 ఏళ్ళ లోపు పిల్లలను గుర్తించి మరో పక్షం రోజుల్లో నిషేధం అమలులోకి తీసుకురానున్నది. యంగ్ యూజర్లు తమ డేటాను అప్‌డేట్ చేసుకోవాలని మెటా కోరింది. డిసెంబరు 10 నుండి ఆస్ట్రేలియాలో టీనేజర్లకు సోషల్ మీడియాలో ప్రవేశం లేదని, వారిని సోషల్ మీడియాలోకి రాకుండా నిషేధిస్తున్నామని ఆ దేశ ప్రధానమంత్రి ఆటోనియో ఆల్బనీస్ ఇప్పటికే ప్రకటించారు.యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, టిక్‌టాక్, ఎక్స్, కిక్, రెడ్డెట్, స్నాప్‌చాట్, వంటివన్నీ టీనేజర్లకు అందుబాటులోఉండవు. ఐతే గూగుల్ క్లాస్‌రూమ్, డిస్కార్డ్, గిట్‌హబ్, లెగోప్లే, మెస్సేంజర్, రోబ్లోక్స్, స్టీమ్ అండ్ స్టీమ్ చాట్, వాట్సాప్, యూట్యూబ్ కిడ్స్ వంటివన్నీ టీనేజర్లకు అందుబాటులోనే ఉంటాయి. ''పిల్లల్ని పిల్లలుగానే ఉండనిద్దాం''అని ఆస్ట్రేలియాప్రధాని ఆల్బనీస్‌పిలుపుఇచ్చారు. అందుకే వారికి సోషల్ మీడియాను అందుబాటులో లేకుండా చూస్తామన్నారు. ఈ విషయంలో ప్రపంచానికే ఆస్ట్రేలియా ఆదర్శంగా ఉంటుందన్నారు. మొదట ఈ ప్రతిపాదనకు తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. ఆ తర్వాత అందరూ సర్దుకుని ఒప్పుకున్నారు. ఆస్ట్రేలియా ఇంటర్నెట్ రెగ్యులేటర్ ఇచ్చిన సమాచారం ప్రకారం, ఆ దేశంలో ఇన్‌స్టాగ్రామ్‌లో 3.50 లక్షలమంది టీనేజర్లు సభ్యులుగా ఉన్నారు. 1.50 లక్షలమంది ఫేస్‌బుక్‌లో సభ్యులుగా ఉన్నారు.

# వచ్చే ఏడాది కాప్–31కు టర్కీ ఆతిథ్యం!

**బెల్లెం:** వచ్చే ఏడాది కాప్–31 సదస్సుకు అంటాల్యా నగరంలో టర్కీ దేశం ఆతిథ్యం ఇస్తుందని భావిస్తున్నారు. ఈ సదస్సును నిర్వహించేందుకు మొదటినుండీ ఉవ్విళ్ళూరిన ఆస్ట్రేలియా ఈ పోటీ నుండి వైదొలగింది. ఒక దశలో ఉమ్మడిగా ఈ సదస్సు నిర్వహిస్తామని ఆస్ట్రేలియా చేసిన ప్రతిపాదనను టర్కీ తిరస్కరించింది. దీంతో ఇక 2026 కాప్–31 సదస్సు టర్కీ నిర్వహిస్తారని భావిస్తున్నారు. వాస్తవానికి ఐక్యరాజ్య సమితి నిబంధనల ప్రకారం కాప్–31 సదస్సు నిర్వహణ బాధ్యత పశ్చిమ యూరప్ దేశాల గ్రూపు, ఆస్ట్రేలియా ఇతర దేశాలభుజస్కంధాల పైనఉంటుంది.ఈ విషయంలో అందరూ ఒక ఏకాభిప్రాయానికి రావాల్సిన అవసరం ఉంది. కానీ ఏ దేశమూ సుముఖత వ్యక్తం చేయలేదు. ఆస్ట్రేలియా నగరం అడిలైడ్‌లో కాప్ సదస్సు నిర్వహించాలని ఆ దేశం చాలా గట్టిగా వాంఛించింది. పసిఫిక్ ఐలాండ్ దేశాలతో కలిసి సహభాగస్వామ్యంతో సదస్సు నిర్వహిస్తామని ఆస్ట్రేలియా మొదటినుండీ వాదించింది. ఓసియానా ప్రాంతంలో వాతావరణ సమస్యలు పెరిగిపోతున్నాయని కూడా ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పరిస్థితుల్లో ఏ దేశమూ కాప్–31 సమావేశం నిర్వహించడానికి ముందుకు రాకపోతే ఐక్యరాజ్యసమితి వాతావరణ ప్రధాన కార్యాలయం ఉన్న జర్మనీలోని బాన్ నగరంలో ఈ సదస్సు నిర్వహించాలని కూడా ఆలోచిస్తున్నారు. ఐతే కాప్–31కు ముందుగా సన్నాహక సమావేశాన్ని పసిఫిక్ ఐలాండ్‌లోనూ, ప్రధాన సమావేశాలను టర్కీలోనూ నిర్వహించాలనే ఆలోచన కూడా ఉంది. టర్కీకి మద్దతు ఇచ్చేందుకు ఆస్ట్రేలియా ఇష్టపడినప్పటికీ తమ మంత్రికి ఛైర్మన్ పదవి ఇవ్వాలని కోరుతున్నది. ప్రస్తుతం కాప్ ఛైర్మన్ పదవిలో బ్రెజిల్ అధ్యక్షుడు లులా డసిల్వా ఉన్నారు. సాధారణంగా ఏ దేశం ఆతిథ్యం ఇస్తే ఆ దేశమే కాప్ సదస్సుకు అధ్యక్ష బాధ్యతల్లో ఉంటుంది. టర్కీలో జరిగితే టర్కీ అధ్యక్షుడే ఆ పదవిలో ఉంటారు. కానీ ఆస్ట్రేలియా మాత్రం భాగస్వామ్య నిర్వహణలో అసాధారణమైన భాగస్వామ్య కోరిక కోరడంతో ఇప్పుడు అందరూ ఆశ్చర్యపోతున్నారు.



# 30 రోజుల్లో జెఫ్రీ ఎప్స్టీన్ ఫైల్స్ విడుదల

**వాషింగ్టన్:** జెఫ్రీ ఎప్స్టీన్ ఫైల్స్‌ను విడుదల చేసేందుకు అమెరికా కాంగ్రెస్ ఆమోదించిన బిల్లుపై అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. రాబోయే 30 రోజుల్లో ఎప్స్టీన్ ఫైల్స్‌ను బహిరంగంగా ప్రజలముందుకు తీసుకువస్తామని ఆయన ప్రకటించారు. ఐతే ఈ పత్రాలలో వ్యక్తుల ప్రైవసీకి ఏదైనా అభ్యంతరకరంగా ఉంటే లేదా చాలా క్రియాశీల పద్ధతిలో దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందని భావించినాగానీ అలాంటి పత్రాలను ప్రజలకు విడుదల చేయకుండా స్తంభింపజేస్తారు. ఫైల్స్ విడుదలకు అన్ని రోజులు ఆగేది లేదని డెమోక్రాట్లు వ్యతిరేకించారు. ఇంకా ముందుగానే ఈ పత్రాలను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. పెద్దల జాతకాలన్నీ నిక్షిప్తమై ఉన్న ఎప్స్టీన్ ఫైల్స్ విడుదల చేసేందుకు తాము భయపడటం లేదని, వాటికీ తనకు ఎలాంటి సంబంధం లేదనీ, నిజం చెప్పాలంటే ఎప్స్టీన్ ఒక డెమోక్రాట్ అనీ, ఇది ఆ పార్టీకి సంబంధించిన సమస్య అనీ ట్రంప్ గడచిన మూడు రోజులుగా వాదిస్తున్నారు. ఆయన తన పూర్వపు వైఖరి మార్చుకుని సెనేట్‌లో, దిగువసభలో ఈ పత్రాలను విడుదల చేసేందుకు అనుకూలంగా ఓటు వేయాలని పిలుపు ఇవ్వడంతో భారీ మెజార్టీతో బిల్లు ఆమోదం పొందింది. అమెరికా జస్టిస్ విభాగం ఈ పత్రాలను విడుదల చేయాలంటే ఆ దేశంలో ఉభయసభలూ ఒక బిల్లును ఆమోదించాలి. ఇన్నాళ్ళూ ఈ విషయమే పెద్ద ఆటంకంగా మారింది. ఇప్పుడు ఆ ఆటంకం తొలగిపోయింది.



## ఇంటెలిజెన్స్ సిటీగా హైదరాబాద్

(మొదటి పేజీ తరువాయి)

సిఈఓ అలెక్స్ కిప్మన్ ముఖ్యమంత్రిని కలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలను చర్చించారు. భారత్ ఫ్యూచర్ సిటీని పరిశోధన, సుస్థిర పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పించిందని సిఎం రేవంత్ రెడ్డి 'తెలంగాణ రైజింగ్–2047' లక్ష్యాలను ఈ సందర్భంగా వివరించారు. ఆర్థిక వృద్ధికి సైతం ఫిజికల్ ఇంటెలిజెన్స్ అత్యుత్తమ పరిష్కారాలను అందిస్తుందని కిప్మన్ తన నమ్మకాన్ని వ్యక్తం చేశారు. డిసెంబర్ 8, 9 తేదీలలో జరిగే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని సిఎం ఆయనను ఆహ్వానించారు. ట్రాఫిక్, అర్బన్ ఫ్లడింగ్, సరస్సుల రక్షణ, వాతావరణ అంచనా, పరిశ్రమల కాలుష్య నియంత్రణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కరించే మార్గాలను చర్చించారు. 'ఫిజికల్ ఇంటెలిజెన్స్' ఆధారంగా రియల్ టైమ్ సెన్సార్ నెట్‌వర్క్, స్మార్ట్ సిటీ నిర్వహణ పద్ధతులను అమలు చేసే వీలుందని అభిప్రాయపడ్డారు. ఇందులో భాగంగా హైదరాబాద్ సిటీలో ఫిజికల్ ఇంటెలిజెన్స్‌ను పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టాలని నిర్ణయించారు. ఎనిమిది వారాల పాటు ఈ ప్రోగ్రామ్ అమలవుతుంది. ఇందులో భాగంగా సీసీ టీవీ వ్యవస్థను రియల్ టైమ్ సిటీ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫారమ్‌గా మారుస్తారు. ట్రాఫిక్, ప్రజా భద్రత, అత్యవసర సేవలన్నీ ఎఐ ఆధారిత అంచనాలతో ఒకే చోట సమన్వయం చేస్తారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి లైవ్‌గా దీనిని మానిటరింగ్ చేస్తారు. ఈ పైలెట్ ప్రోగ్రామ్ పూర్తయ్యే నాటికి హైదరాబాద్ దేశంలోనే తొలి ఫిజికల్ ఇంటెలిజెన్స్ సిటీగా మారుతుందనే అంచనాలున్నాయని ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది.

## పంచాయతీ ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి పాల్గొన్నారు. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలపై కమిషనర్ సమీక్ష జరిపారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను సజావుగా, సమర్థంగా చేపట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఓటరు జాబితాపై వచ్చిన అభ్యంతరాల పరిశీలన, వాటి పరిష్కారం చూపాలన్నారు. ఎన్నికల కోసం పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలన్నారు. సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు సంబంధించిన రిజర్వేషన్ల ప్రక్రియ అమలు, ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన శాంతిభద్రతల ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో స్థానిక సంస్థల ఎన్నికలు కీలకమన్న విషయాన్ని గుర్తు చేస్తూ, ప్రతి అధికారి తమ బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తించాలని స్పష్టం చేశారు.

## గవర్నర్ అనుమతి

(మొదటి పేజీ తరువాయి)

నమోదు చేసేందుకు ఎసిబి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. విచారణ తర్వాత ఛార్జ్ షీట్ దాఖలు చేసే అవకాశం ఉందని ఎసిబి అధికారులు అంటున్నారు. ఈ కేసులో కీలక నిందితుడైన ఐఎఎస్ అధికారి అరవింద్ కుమార్‌పై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. ఒక వేళ కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇస్తే ఆయనపై కూడా ఎసిబి అభియోగాలు నమోదు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

ఫార్ములా ఈకారు రేసు కేసు ముఖ్య వివరాలు..

డిసెంబరు 18, 2024న ఎఫ్ఐఆర్ నమోదు
డిసెంబర్ 28, 2024న ఇడి సమన్లు
జనవరి 2, 2025న అర్వింద్ కుమార్ విచారణ
జనవరి 3, 2025న బిఎల్ఎన్ రెడ్డి విచారణ
జనవరి 7, 2025న కెటిఆర్ విచారణ
జూన్ 2025లో ఎసిబి రెండో దశ విచారణ
జూన్ 16న కెటిఆర్ మరోసారి విచారణకు హాజరు

## పోలీసు కస్టడికి ఐ-బొమ్మ రవి

### బషీర్‌బాగ్ సిసిఎస్‌లో ప్రారంభమైన విచారణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఐబొమ్మ, బప్పం వెబ్‌సైట్ల నిర్వాహకుడు ఇమంది రవిని గురువారం పోలీసులు కస్టడిలోకి తీసుకుని, అనంతరం బషీర్‌బాగ్‌లోని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పైరసి కేసుతో పాటు బెట్టింగ్ యాప్‌లకు సంబంధించి వివిధ కోణాల్లో అధికారులు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. టాలీవుడ్‌తో పాటు కొలివుడ్, మాలివుడ్ ఇండస్ట్రీలకు సంబంధించిన 21 వేల సినిమాలను పైరసి చేసిన రవిని నగర సైబర్ క్రైమ్ పోలీసులు ఇటీవల అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో అతడి నుంచి మరిన్ని వివరాలు రాబట్టేందుకు వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని సైబర్ క్రైమ్ పోలీసులు నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, ఇరువైపుల వాదనలు విన్న న్యాయమూర్తి ఐదు రోజుల కస్టడీకి అనుమతి ఇచ్చారు. కుటుంబ వివాదాలు, భార్యతో మనస్పర్థలు, తన కూతురిని చూసే అవకాశం లేకపోవడంతో ఒంటరిగా కుమిలిపోయి అడ్డదారుల్లో అయిన రూ. కోట్లు సంపాదించాలని ఈ వృత్తిలోకి దిగినట్లు రవి అంగీకరించినట్లు సమాచారం. పోలీసుల నుంచి తప్పించుకునేందుకు కరేబియన్ దీవులు కేంద్రంగా చేసుకుని ఆరేళ్లుగా 66 మిర్రర్ వెబ్‌సైట్లలో పైరసి సినిమాలు అప్‌లోడ్ చేసినట్లు గుర్తించారు. అంతే కాకుండా, 50 లక్షల మంది డేటా సేకరించి సైబర్ నేరస్థులు, గేమింగ్ బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులకు విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఒకవైపు రవి విచారణ కొనసాగుతుండగానే ఐబొమ్మ1 పేరుతో కొత్త వెబ్‌సైట్ దర్శనమిచ్చింది. దీంతో ప్రేక్షకులు ఆ సైట్ ఓపెన్ చేసి సినిమాల గురించి వెతకడం గమనార్హం.

**ఐబొమ్మ1 లో రివ్యూస్ మాత్రమే ఉన్నాయి.. సినిమాల్లేవు : సైబర్ క్రైమ్ పోలీసులు**

ఐబొమ్మ1 వెబ్‌సైట్‌లో కేవలం సినిమా రివ్యూలు మాత్రమే ఉన్నాయని సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు. రీ డైరెక్టర్ అయ్యి సినిమాలు ఓపెన్ అవ్వడం లేదన్నారు. ఐ బొమ్మ, బప్పం వెబ్‌సైట్లను బ్లాక్ చేయించామని క్లారిటీ ఇచ్చారు. వేరే వెబ్‌సైట్ల ద్వారా పైరసీకి పాల్పడితే వాటి దిశగా దర్యాప్తు చేస్తామని వెల్లడించారు.

## నేడు అఖిలపక్షం ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

కాల్పులు జరుపుతున్నారని విమర్శించారు.

**ప్రజాజీవితంలోకి వస్తామంటే కాల్చేస్తారా : బి.మహేష్‌కుమార్ గౌడ్**

ప్రజా జీవితంలో కలుస్తామని ముందుకొచ్చే మావోయిస్టులకు అవకాశం కల్పించకుండా, వారిని పట్టుకుని చంపేస్తున్నారని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి లాంటి ఫాసిస్టు శక్తులు బలపడితే దేశానికి, సమాజానికి ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. కమ్యూనిస్టులను, కాంగ్రెస్‌ను, వామపక్ష భావజాలం ఉన్న వారిని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బలహీన పర్చేందుకు ప్రయత్నిస్తోందని, ఈ నేపథ్యంలో బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలను అం దరూ వ్యతిరేకించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దేశంలోని ఇటువంటి పరిస్థితుల్లో కమ్యూనిస్టులు, కాంగ్రెస్ ఏకం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. హిడ్మా, కేశవరావు, తిరుపతి ఇలా వీరిని నాయకులుగా గుర్తిస్తామని, వారు ఎంచుకున్న పద్ధతి ప్రభుత్వాలకు నచ్చకపోయినప్పటికీ వారు తమ జీవితాంతం ప్రజల కోసం పాటుపడ్డారని గుర్తు చేశారు. ప్రజాస్వామ్య దేశంలో 'ఎలిమినేషన్' అనేది సరైందికాదన్నారు. పాలకులు, మావోయిస్టులు ఇరు వైపులా హింసను తాము వ్యతిరేకిస్తున్నామని మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు.

**మానవ హననం చేయాలని ఏ శాస్త్రం, ధర్మం చెబుతుంది? కూనంనేని**

ఎన్‌కౌంటర్ల పేరుతో కాల్చి చంపిన మావోయిస్టుల మృతదేహాలకు న్యాయమూర్తి, కుటుంబ సభ్యుల సమక్షంలో శవ పరీక్షలు నిర్వహించాలని, దీనిని వీడియో తీయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఎన్‌కౌంటర్‌పైన న్యాయ విచారణ చేపట్టాలని, ఇప్పటి వరకు జరిగిన ఎన్‌కౌంటర్లపై శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. మానవ హననం చేయాలని పాలకులకు ఏ శాస్త్రం, ధర్మం చెబుతుందని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దేశంలో మావోయిస్టుల పట్ల కేంద్రం బార్బరిజం కొనసాగిస్తోందన్నారు. ఎన్‌కౌంటర్ అంటే ఏమిటో కూడా తెలియనివారు కేంద్ర మంత్రులుగా ఉండడం విచారకరమన్నారు. మావోయిస్టుల పట్ల కేంద్రం ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కమ్యూనిస్టులు, మావోయిస్టులకు మధ్య భావజాలంలో తేడా ఉన్నప్పటికీ ఇద్దరూ పేద వర్గాల కోసమే పని చేస్తారన్నారు.

టిజెఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ మాట్లాడుతూ రాజకీయ ఉద్యమాలను హింసతో రూపుమాపలేవని, వ్యక్తులను చంపి, వారిని అణిచివేయవచ్చు కానీ వ్యవస్థను అణచివేయడం సాధ్యంకాదన్నారు. మనుషులను చంపే అధికారం చట్టం ఎవ్వరికీ ఇవ్వలేదన్నారు. ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులపై కూడా కేసు నమోదు చేసి విచారించాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ మార్గదర్శకాలు ఉన్నాయని, దీనిని కేంద్ర ప్రభుత్వం పాటించడంలేదని కోదండరామ్ తెలిపారు.

సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ కేంద్రాన్ని, ప్రధాని మోదీని, బిజెపిని ప్రశ్నించే, ఆరోపించే ప్రతి ఒక్కరిపైనా కేంద్ర ప్రభుత్వం దాడి చేస్తోందన్నారు. మావోయిస్టులతో పాటు అన్ని రంగాలు, వ్యవస్థలపై కేంద్రం ఎన్‌కౌంటర్ చేస్తోందని విమర్శించారు. బిజెపియేతర ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల్లో అక్కడి రాష్ట్ర ప్రభుత్వాలను కూడా భయపెడుతున్నారని, గవర్నర్ల ద్వారా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు.

రిటైర్డ్ ప్రొఫెసర్ జి.హరగోపాల్ మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం చెబుతున్న 'అభివృద్ధి నమూనా'లో మానవతా విలువలు లేవన్నారు. అటవీ ప్రాంతాల్లోని వనరులను కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు ప్రకృతిని విధ్వంసం చేస్తూ, అడ్డుగా ఉన్న మనుషులను చంపేస్తున్నారని ఆరోపించారు. అడవిలోని నాలుగు లక్షల చెట్లను తొలగిస్తున్నారన్నారు. ఆదివాసీల హక్కులను కూడా కాలరాస్తున్నారని, కేంద్రం ఎవరి మాటలనూ వినడం లేదని, రాజ్యాంగం, చట్టాలను కూడా కేంద్రం అమలు చేయడంలేదని విమర్శించారు. రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్ర కుమార్ మాట్లాడుతూ బూటకపు ఎన్‌కౌంటర్లను ప్రభుత్వం మానుకోవాలని, మావోయిస్టులతో చర్చలు జరి పి, సమస్యను పరిష్కరించాలని, మావోయిస్టులు కూడా సాయుధపోరాటాన్ని వదిలి ప్రజా జీవితంలోకి రావాలని కోరారు. మనుషులను పట్టుకుని కాల్చిచంపడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ఒప్పుకుంటుందా? అని ప్రశ్నించారు. అరుణోదయ సాంస్కృతిక సంస్థ నాయకురాలు విమలక్క మాట్లాడుతూ ఎన్‌కౌంటర్ పేరుతో కేంద్రం మానవహననం చేస్తోందన్నారు. మావోయిస్టులు చేసేది హింస అయితే, వారిని చంపేందుకు కేంద్రం చేస్తున్న ప్రతిహింస కూడా హింసే కదా అని అన్నారు. తుపాకీకి తుపాకీ పరిష్కారం కాదన్నారు.

సిపిఐ (ఎంఎల్ )న్యూడెమోక్రసీ మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు హన్మేశ్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు చలపతి రావు, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర నాయకులు రమేశ్ రాజా, సిపిఐ (ఎంఎల్) చంద్రన్న గ్రూప్ నాయకులు భాస్కర్ మాట్లాడుతూ కేంద్రం తక్షణమే బూటకపు ఎన్‌కౌంటర్లను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి వ్యాఖ్యలు చట్టవిరుద్ధమన్నారు. సమావేశంలో తెలంగాణ పౌర హక్కుల నాయకులు నారాయణ, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.అంజయ్యనాయక్, ఎస్.చాయాదేవి, నెదునూరి జ్యోతి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, రాష్ట్ర సమితి సభ్యులు ఫైమిద, సిపిఐ(ఎంఎల్,) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కె.గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## కాలపరిమితి లేదు

(మొదటి పేజీ తరువాయి)

జస్టిస్ జెబి పర్దీవాలా నేతృత్వంలోని ధర్మాసనం, బిల్లులను గవర్నర్లు మూడు నెలల్లోగా ఆమోదించాలని ఈ ఏడాది ఏప్రిల్ మాసంలో తీర్పునిచ్చింది. అయితే, రాష్ట్రపతి ద్రౌపది ముర్మ ఈ తీర్పుపై, రాజ్యాంగంలోని ఆర్టికల్ 143(1) ప్రకారం 14 కీలక ప్రశ్నలను లేవనెత్తడంతో, వాటిని విచారించేందుకు ఐదుగురు సభ్యులతో కూడిన ధర్మాసనం అంగీకరించింది. ఆర్టికల్ 143(1) ప్రకారం, చట్టపరమైన, ప్రజా సంబంధిత అంశాలపై సుప్రీం కోర్టు అభిప్రాయాన్ని కోరే అవకాశం రాష్ట్రపతికి ఉంటుంది. రాష్ట్రపతి సూచనతో ఈ అంశాన్ని విచారించిన ధర్మాసనం, ఈ ఏడాది సెప్టెంబర్ 11న తీర్పును రిజర్వ్ చేసింది. గురువారం తీర్పును వెల్లడిస్తూ, రాజ్యాంగ అధికారాలు, రాష్ట్రపతి లేదా గవర్నర్ నిర్ణయాలనుఆర్టికల్142ప్రకారం, మా ర్చడానికి వీల్లేదని తెలిపింది.అంతేగాక, నిర్ణీత కాలం ముగిసిన వెంటనే, గవర్నర్ల వద్ద ఉన్న బిల్లులకు ఆమోదముద్ర లభించినట్టు భావిం చడానికి కూడాఈ ఆర్టికల్ అనుమతించదని తేల్చి చెప్పింది. ఆర్టికల్ 361ను ఉటంకిస్తూ, గవర్నర్లను వ్యక్తిగతంగా కోర్టు విచారణకు పిల వడంపై సంపూర్ణ నిషేధం ఉందని కూడా ధర్మా సనం తెలిపింది. గవర్నర్ దీర్ఘకాలం ఎలాంటి నిర్ణయాలు తీసుకోనప్పుడు లేదా పనులను అచేతన స్థితిలోఉంచినప్పుడు,పరిస్థితిని సమీక్షించే అధికారంన్యాయవ్యవస్థకుఉందని స్పష్టం చేసింది.

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో ఐదు శాతం వికలాంగులకు కేటాయించాలి

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌కి అఖిలభారత వికలాంగుల హక్కుల వేదిక విజ్ఞప్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో దివ్యాంగులకు ఐదు శాతం ఇళ్లను కేటాయించాలని, అదేవిధంగా నూతనంగా నిర్మించబోయే డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించాలని అఖిలభారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షులు కొలి నాగేశ్వరరావు, గ్రేటర్ అధ్యక్షులు జంగిల్ శ్రీనివాస్‌తో కలిసి గురువారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన మంత్రి.. దివ్యాంగుల కొరకు గ్రౌండ్ ఫ్లోర్‌లోనే ఇళ్లు కేటాయించి, వారికి అనుకూలంగా నిర్మిస్తామని హామీ ఇచ్చారు.

## 28 అంశాలతో ట్రంప్ ప్రణాళిక?

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఒప్పందం సాధ్యపడుతుందని పేర్కొన్నారు. ఇరు వైపుల నుండీ లభించిన సమాచారం ప్రకారం యుద్ధాన్ని ముగించేందుకు, శాంతి సాధించేందుకు తాము కొన్ని ఆలోచనలు సిద్ధం చేశామని, వాటికి మరింత పదునుపెట్టి ఇరు వైపులా కొన్ని రాయితీలు పాటించేవిధంగా సిద్ధం చేస్తున్నామని ఎక్స్‌లో పేర్కొన్నారు. ఆయన ప్రకటన ప్రకారం చూస్తేగతంలో ట్రంప్ ప్రకటనల ప్రకారం ఉక్రేన్ కొన్ని త్యాగాలు చేయడానికి సిద్ధ పడాల్సి ఉంటుంది. ఈ కొత్త ప్రణాళిక ప్రకారం కూడా ప్రస్తుతం ఉక్రేన్ అధీనంలో ఉన్న డాన్‌బాస్ సహా ఇతర భూభాగాలను రష్యాకు తిరిగి స్వాధీనం చేయాలి. అదేవిధంగా ఉక్రేన్ తన సైన్యాన్ని కుదించుకోవాలి.ఐతే దీనిపై యూరోపియన్ యూనియన్ విదేశీవిధాన ప్రధానాధిపతి ఖాజా కల్లాస్ మాట్లాడుతూ, ఉక్రేన్, యూరోపియన్ యూనియన్ జోక్యం లేకుండా ఎలాంటి నిర్ణయాలు జరగకూడదన్నారు. ఉక్రేన్‌లోని టెర్నోపిల్‌లో రష్యా గతంలో లేనివిధంగా చేసిన దాడుల్లో 26 మంది మరణించారని, మరో 22 మంది జాడ తెలియడంలేదని, వారంతా శిథిలాల్లో కూరుకుపోయారని జెలెన్‌స్కీ ప్రకటించిన రోజునే ట్రంప్ ప్రతిపాదించిన ఈ శాంతి ప్రణాళిక అంశం వెలుగు చూసింది. ఒకవైపు రష్యా యుద్ధ దాడులు కొనసాగుతున్నప్పటికీ చాపకింద నీరులాగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రష్యాతో కలిసి యుద్ధ విరమణ కోసం ఒక ప్రణాళిక రూపొందించేందుకు ఎప్పటినుండో సన్నాహాలు కొనసాగిస్తున్నారు. ముసాయిదా తయారీ పని జరుగుతున్నందువల్లనే ఇటీవలికాలంలో ట్రంప్ ఉక్రేన్‌లో యుద్ధం గురించి ఎక్కడా మాట్లాడటంలేదని భావిస్తున్నారు. ఈ ప్రణాళిక విషయాన్ని అమెరికా,రష్యాకు చెందిన వర్గాలు ధృవీకరించకపోయినప్పటికీ ఈ సన్నాహాలు ముమ్మరంగా కొనసాగుతున్న దశలో బుధవారంనాడు మెల్లిగా ఈ విషయం బయటకు పొక్కింది. గాజాలో కాల్పుల విరమణకోసం ట్రంప్ 20 సూత్రాల ప్రణాళికను రూపొందించి ముస్లిం, అరబ్ దేశాల నాయకులతో చర్చించి వారి ఆమోదం పొందారు. ఆ తర్వాత హమాస్‌కు,ఇజ్రాయెల్‌కు ఆ ప్రణాళికను పంపారు. వారంతా సుదీర్ఘ చర్చలు జరిపిన తర్వాత ఐదు వారాల క్రితం గాజాలో శాంతి ఒప్పందం అమలులోకి వచ్చింది. దీనిని మూడు రోజుల క్రితం అధికారికంగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ఆమోదించింది. ఇదే తరహాలో ఒక ప్రణాళికను ఉక్రేన్ యుద్ధం ముగించేందుకు ట్రంప్ రూపొందిస్తున్నారని వార్తలు వెలువడ్డాయి. ఈ ప్రణాళికపై చర్చించేందుకే అమెరికా రక్షణశాఖ అధికారులు జెలెన్‌స్కీతో సమావేశమయ్యారు.

తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ శాఖ
కలెక్టర్ గారి కార్యాలయం
రాజన్న సిరిసిల్ల

ఫైల్ నెం. జి2/34/2025 తేది: 17.11.2025.

ఫారం -VII

(భూసేకరణ చట్టం 30/2013) లోని సెక్షన్ 19(1) మరియు రూల్ (25)(1) అనుసరించి)

డిక్లరేషన్

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ, అర్బన్ మండలానికి చెందిన సంకేపల్లి గ్రామ పరిధి లో మొత్తం విస్తీర్ణము **14519.00 చ.ల.గ.** నివాస స్థలము మరియు (45) నిర్మాణాలు ప్రజా ప్రయోజనాల కోసం మిడ్ మానేరు ఏర్పాటు కోసం మరియు పూర్తి జలాశయ నీటి మట్టం దాటి వంద మీటర్ల వరకు అవసరమున్నదని తెలంగాణ ప్రభుత్వం జిల్లా / కలెక్టర్ రాజన్న సిరిసిల్ల గారు భావించి చట్టం ద్వారా సేకరించుటకు గానూ నిర్ణయించినారు.

కావున ఈ దిగువ చూపిన షెడ్యూల్ నందు తెలిపిన సంకెపల్లి గ్రామ విస్తీర్ణం **14519.00 చ.గజములు** గల భూమి మరియు 45 ఇండ్లకు ఇట్టి భూసేకరణ చట్టములోని సెక్షన్ 19 (1) ప్రకారం డిక్లరేషన్ జారీ చేయనైనది

మరియు నివాస గృహముల యజమానుల వివరములు ఈక్రింద తెలిపిన విధముగా ప్రకటించనైనది.

| క్ర. సం. | ఇంటి నెం. | ఇంటి యజమాని పేరు / తండ్రి / భర్త పేరు | సర్వే నెం./ భాగం | ఇంటి విస్తీర్ణం చ.గ. | ఇంటి ఖాళీ స్థలం చ.గ. | వ్యవసాయ భూమి చ.గ. | మొత్తం చ.గ. | ఇతర వివరములు (నిర్మాణములు / చెట్లు) |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| 1 | 3-94 | పెరుగు మల్లవ్వ తండ్రి పోచయ్య | 456 | 138.00 | 167.00 | 0.00 | 305.00 | వేప-1 సితఫల్ - 3 నిమ్మ-1 |
| 2 | 3-95 | మారవేని గంటయ్య తండ్రి మల్లయ్య | 456 | 92.00 | 409.00 | 0.00 | 501.00 | సీతఫల్-1 కరివేపాకు-1 |
| 3 | 3-96 | మారబోయిన మల్లవ్వ భర్త కీశే మారవేని చెన్నయ్య. | 456 | 139.00 | 266.00 | 0.00 | 405.00 | సీతపల్-2 |
| 4 | 3-97 | మారవేని దేవయ్య తండ్రి మల్లయ్య | 456 | 180.00 | 347.00 | 0.00 | 527.00 | సుబాబులు-6 నరేంగా-1 సీతఫల్-1 |
| 5 | 3-98 | మారవేని రాజయ్య తండ్రి కొమురయ్య | 456 | 121.00 | 218.00 | 0.00 | 339.00 | వేప -1 సీతఫల్-8 నిమ్మ -1 టేకు - 1 కరివేపాకు-1 |
| 6 | 3-99 | యం.డి. మున్న తండ్రి కరీముల్ల | 456 | 70 | 498.00 | (0.07) గుంటలు (847.00) చ.గ.లు | 1415.00 ((0.07) గుంటల వ్యవసాయ భూమిని కలుపుకొని | సీతఫల్-10 సుబాబుల్-4 |
| 7 | 3-100 | కొండ సత్తవ్వ భర్త రాజయ్య (యజమానులు మరణించినారు) మరణించిన వారి కుటుంబ సభ్యుల వివరములు 1. నోముల వెంకటవ్వ భర్త వీరేశం 2. కొండ నాగవ్వతండ్రి రాజయ్య 3.మెర్గు పద్మ భర్త రాజేశం 4. కొండ శ్రీనివాస్‌తండ్రి కీ.శే రాజయ్య 5.కొండ బాబు తండ్రి కీ. శే రాజయ్య | 456 | 88.00 | 428.00 | 0.00 | 516.00 | దానిమ్మ -1 వేప - 2 సీతాఫల్-10 జామ-2 ఈత-1 కర్జురా-1 చింత-1 బొప్పాయి-1 కరివేపాకు-1 |
| | | | 478 | 28.00 | 87.00 | 0.00 | 115.00 | ... |
| 8 | 4-1 | పోచంపల్లి భాగ్య భర్త కీశే పోచంపెల్లి దేవయ్య | 456 | 91.00 | 355.00 | 0.00 | 446.00 | వేప - 4 సీతఫల్-2 కానుగ -1 |
| 9 | 4-1/A | పోచంపెల్లి దేవవ్వ భర్త ఎల్లయ్య | 456 | 91.00 | 355.00 | 0.00 | 446.00 | మామిడి-1 జామ-1 ఉసిరి-1 సీతఫల్-20 నిమ్మ-1 దానిమ్మ-1 |
| 10 | 4-3 | నాగుల శంకరయ్య తండ్రి ఎల్లయ్య | 456 | 27.00 | 117.00 | 0.00 | 144.00 | ... |
| 11 | 4-4 | మారవేని దుర్గయ్య తండ్రి గంటయ్య | 456 | 119.00 | 210.00 | 0.00 | 329.00 | సీతఫల్-10 కరివేపాకు-1 |
| 12 | 4-41 | జింక రాజవ్వ భర్త మల్లయ్య | 461 | 101.00 | 169.00 | 0.00 | 270.00 | జామ-1 నిమ్మ- 1 సీతఫల్-1 ఉసిరి-1 |
| 13 | 4-41/1 | జింక రమేష్ తండ్రి మల్లయ్య | 461 | 50.00 | 170.00 | 0.00 | 220.00 | జామ-2 నిమ్మ-1 సీతఫల్-1 ఉసిరి-1 |
| 14 | 4-46 | జింక కనుకవ్వ భర్త కీశే జింక లక్ష్మ య్య | 461 | 59.00 | 167.00 | 0.00 | 226.00 | ... |
| 15 | 4-47 | జుట్టు ఎల్లయ్య తండ్రి సత్తయ్య (యజమానులు మరణించినారు) మరణించిన వారి కుటుంబ సభ్యుల వివరములు 1. బట్టు కాంతవ్వ భర్త బాలయ్య 2. జుట్టు మల్లేశం తండ్రి కీ.శే ఎల్లయ్య | 461 | 50.00 | 173.00 | 0.00 | 223.00 | నిమ్మ-1 వేప - 1 సీతపల్-1 సుబాబుల్-2 |
| 16 | 4-58 | జింక రాజవ్వ భర్త మల్లయ్య | 461 | 88.00 | 127.00 | 0.00 | 215.00 | దానిమ్మ-1 నిమ్మ-1 సీతఫల్-6 బొప్పాయి-1 వేప - 1 సుబాబుల్-8 |
| 17 | 4-53 | జింక భూదవ్వ భర్త ఇస్తారి | 461 | 107.00 | 386.00 | 0.00 | 493.00 | సీతఫల్-4 వేప - 1 సుబాబుల్-6 |
| 18 | 4-54 | జింక నర్సయ్య తండ్రి దుర్గయ్య & జింక లక్ష్మి భర్త బాలయ్య సమ భాగాలు | 461 | 69.00 | 97.00 | 0.00 | 166.00 | సుబాబుల్-5 వేప -2 సీతఫల్-2 |
| 19 | 4-55 | జింక మల్లేశం తండ్రి నర్సయ్య | 461 | 47.00 | 206.00 | 0.00 | 253.00 | జామ-1 వేప - 3 దానిమ్మ-2 నిమ్మ-2 కుక్కుడు-1 సీతపల్-3 సుబాబుల్-3 |
| 20 | 4-60 | జింక రాజయ్య (గజ్జెల) ఎల్లయ్య తండ్రి (యజమానులు మరణించినారు) మరణించిన వారి కుటుంబ సభ్యుల వివరములు 1. గంగిపల్లి కవిత తండ్రి కీ.శే జింక రాజయ్య (గజ్జెల) భర్త బాబు 2. జింక రాజేశ్వరి తండ్రి కీ.శే జింక రాజయ్య (గజ్జెల) | 461 | 61.00 | 207.00 | 0.00 | 268.00 | వేప-2 జామ-2 సీతఫల్-5 సుబాబుల్-2 |
| 21 | 4-61 | జింక నారాయణ తండ్రి మల్లయ్య | 461 | 71.00 | 176.00 | 0.00 | 247.00 | సీతఫల్-1 వేప - 1 జామ-1 సుబాబుల్-11 |
| 22 | 4-61/1 | జింక లక్ష్మి భర్త జింక బాలయ్య & జింక నర్సయ్య తండ్రిదుర్గయ్య సమ భాగాలు | 461 | 81.00 | 157.00 | 0.00 | 238.00 | సీతఫల్-2 తుమ్మ - 2 సుబాబుల్-7 |
| 23 | 4-63 | పండుగ దుర్గయ్య తండ్రి ఎల్లయ్య (యజమానులు మరణించినారు) మరణించిన వారి కుటుంబ సభ్యుల వివరములు 1. పండుగ లక్ష్మీ రాజం తండ్రి కీ. శే పండుగ దుర్గయ్య 2. ఐతే రాజవ్వ తండ్రి కీ.శే పండుగ దుర్గయ్య భర్త గోపాల్ | 461 | 53.00 | 234.00 | 0.00 | 287.00 | తాడి-1 చింత-1 వేప - 2 సీతఫల్-12 సుబాబుల్-20 నమిలినార-1 |
| 24 | 4-63/1 | ఐత గోపాల్ తండ్రి స్వామి | 461 | 56.00 | 341.00 | 0.00 | 397.00 | జామ-1 సీతఫల్-1 తుమ్మ -1 దానిమ్మ-1 |
| 25 | 4-64 | పండుగ దేవయ్య తండ్రి రాజయ్య | 461 | 74.00 | 176.00 | 0.00 | 250.00 | సీతాఫల్-13 సుబాబుల్-12 |
| 26 | 4-65 | పండుగ మల్లేశం తండ్రి నాంపెల్లి | 461 | 80 | 49.50 | 0.00 | 129.50 | .... |
| | 4-65/1 | | | 85 | 44.50 | 0.00 | 129.50 | .... |
| 27 | 4-67 | పండుగ మల్లయ్య తండ్రి నర్సయ్య | 461 | 56.00 | 188.00 | 0.00 | 244.00 | ... |
| 28 | 4-68 | పండుగ భూమయ్య తండ్రి మల్లయ్య | 461 | 61.00 | 166.00 | 0.00 | 227.00 | సీతపల్-1 నిమ్మ-1 ఈత -1 బొప్పాయి-2 జామ-1 వేప - 4 సుబాబుల్-10 టేకు 2 |
| 29 | 4-69 | పండుగ దేవయ్య తండ్రి కొమురయ్య | 461 | 28.00 | 112.00 | 0.00 | 140.00 | నిమ్మ-2 సీతఫల్-1 జామ -2 కుక్కుడు-1 సుబాబుల్-1 |
| 30 | 4-69/1 | పండుగ ఎల్లవ్వ భర్త మల్లేశం | 461 | 40.00 | 90.00 | 0.00 | 130.00 | చింత-1 సుబాబుల్-10 |
| 31 | 4-70 | పండుగ దేవయ్య తండ్రి కొమురయ్య | 461 | 88.00 | 156.00 | 0.00 | 244.00 | వేప - 1 జామ-1 సుబాబుల్-12 |
| 32 | 4-70/1 | పండుగ ముత్తవ్వ భర్త గోపాల్ | 461 | 72.00 | 206.00 | 0.00 | 278.00 | జామ-1 టేకు - 1 ఇరికి - 3 ఉసిరి-1 సుబాబుల్-1 వేప - 2 నమిలినార-1 |
| 33 | 4-70/2 | పండుగ చంద్రయ్య తండ్రి మల్లయ్య | 461 | 188.00 | 66.00 | 0.00 | 254.00 | సుబాబుల్-5 |
| 34 | 4-71 | పండుగ లచ్చవ్వ భర్త మల్లయ్య (యజమానులు మరణించినారు) మరణించిన వారి కుటుంబ సభ్యుల వివరములు 1. పండుగ చంద్రయ్య తండ్రి కీ.శే మల్లయ్య 2.పండుగ గోపాల్ తండ్రి మల్లయ్య 3. మేర్గా భారతవ్వ భర్త అంజయ్య 4. ఎర్ర లత భర్త దుర్గయ్య 5.పండుగ లక్ష్మ ణ్ తండ్రి కీ. శే మల్లయ్య | 461 | 113.00 | 154.00 | 0.00 | 267.00 | సీతఫల్-1 సుబాబుల్-8 నమిలి నార-1 వేప - 1 తాడి-1 |
| 35 | 4-72 | పండుగ శంకర్ తండ్రి భీమయ్య | 461 | 78.00 | 162.00 | 0.00 | 240.00 | వేప - 3 జామ-1 సపోటా-1 సీతఫల్-1 తుమ్మ -1 సుబాబుల్-6 |
| 36 | 4-73 | పండుగ అంజయ్య తండ్రి భీమయ్య | 461 | 54.00 | 146.00 | 0.00 | 200.00 | టేకు-02 |
| 37 | 4-73/1 | పండుగ సంజీవ్ తండ్రి భీమయ్య | 461 | 92.00 | 91.00 | 0.00 | 183.00 | వేప - 1 సుబాబుల్ -4 నమిలినార 1 |
| 38 | 4-75 | జింక రాజమల్లు తండ్రి మైసయ్య | 461 | 119.00 | 63.00 | 0.00 | 182.00 | టేకు-03 సీతఫల్-3 |
| 39 | 4-75/1 | జింక కొండయ్య తండ్రి మైసయ్య | 461 | 31.00 | 59.00 | 0.00 | 90.00 | టేకు-1 దానిమ్మ-2 |
| 40 | 4-76 | మానువాడ రాజలింగం తండ్రి పోచయ్య | 461 | 76.00 | 273.00 | 0.00 | 349.00 | వేప - 4 సీతఫల్-30 జామ-01 కరీవేపాకు-1 నిమ్మ-01 |
| 41 | 4-77 | మల్యాల మల్లయ్య తండ్రి రాజయ్య | 461 | 72.00 | 249.00 | 0.00 | 321.00 | నిమ్మ-1 బొప్పాయి-2 సీతాఫల్-1 దానిమ్మ-1 జామ-1 |
| 42 | 4-78 | దోమకొండ రాజవ్వ భర్త లచ్చయ్య | 461 | 34.00 | 479.00 | 0.00 | 513.00 | వేప - 4 సీతఫల్-5 దానిమ్మ-01 జామ - 1 నిమ్మ - 01 అల్లనేరేడు-1 ఉసిరి-1 దుర్శన్ - 2 |
| 43 | 4-79 | దోమకొండ లస్మయ్య తండ్రి నర్సయ్య | 461 | 77.00 | 330.00 | 0.00 | 407.00 | బొప్పాయి-1 నిమ్మ-1 వేప-02 కరివేపాకు-1 పసుపు - 1 సీతాఫల్ 21 దుర్శన్-1 |
| 44 | 4-92 | జింక బాలయ్య తండ్రి భూమయ్య | 461 | 90.00 | 378.00 | 0.00 | 468.00 | టేకు - 1 దానిమ్మ-1 కరివేపాకు-1 |
| 45 | 4-94 | జింక మైసవ్వ భర్త దుర్గయ్య | 461 | 101.00 | 181.00 | 0.00 | 282.00 | సీతాఫల్ 6 నిమ్మ-3 వేప-1 సుబాబుల్-6 |
| | | మొత్తము | | 3786.00 | 9886.00 | (0.07) గుంటలు (847.00) చ.గ.లు | 14519.00 ((0.07) గుంటల వ్యవసాయ భూమిని కలుపు కొని | |

ప్రతిపాదిత భూసేకరణ చట్టం 2013(కేంద్ర చట్టం 30/ 2013) లోని సెక్షన్ 15(1) ప్రకారం సంబదిత భూ యజమానుల నుండి అభ్యంతరములు స్వీకరించి, సెక్షన్ 15 (2) క్రింద విచారణ కొరకై అవకాశం కల్పించి, సెక్షన్ 15 (3) క్రమం పరిష్కరించబడి, సెక్షన్ 19(1) భూసేకరణ చట్టం,2013 (కేంద్ర చట్టం 30/2013) ప్రకారం డిక్లరేషన్ జారిచేయబడుతున్నది.

ప్రతిపాదిత భూసేకరణ భూమిలో బొగ్గు, ఇనుము, ప్లేటు మరియు ఇతరత్రా ఖనిజములు ఇట్టి భూమిలో లేదా కొంత భాగములో లభ్యమైనచో ఆ ఖనిజాలు ప్రాజెక్ట్ నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో వాటిని స్వీకరించబడును.లేనిచో స్వీకరించబడవు.

పైన చూపిన భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాను మరియు వివరములు ఏదేని పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో ప్రత్యేక ఉప కలెక్టర్- విభాగం ( భూసేకరణ ) 7, ఎఫ్.ఎఫ్.సి./ ఎం.ఎం.ఆర్, మరియు అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ళ సుజల స్రవంతి ప్రాజెక్టు, రాజన్న సిరిసిల్ల గారి కార్యాలయములో పరిశీలించుకొను నిమిత్తము అందుబాటులో ఉండును.

సం/- ప్రత్యేక ఉప - కలెక్టర్(అ.భా) భూసేకరణ విభాగం-VII, ఎఫ్.ఎఫ్.సి./ఎం.ఎం.ఆర్, మరియు డా॥బి.ఆర్. అంబేద్కర్ (పి.సి.ఎస్.ఎస్.పి.)

సం/- జిల్లా అదనపు కలెక్టర్ రాజన్న సిరిసిల్ల.

సం/- జిల్లా కలెక్టర్, రాజన్న సిరిసిల్ల.

DIPR RO NO. 853/LA/PP/Advt/Pub/2025-26




## రూ.161 కోట్లు వెంటనే విడుదల చేయండి

### ఆర్థిక శాఖ అధికారులకు డిప్యూటీ సిఎం ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూనియర్ కళాశాలు, డిగ్రీ కళాశాలలు, పాలిటెక్నిక్ కళాశాలలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. ప్రజాభవన్‌లో గురువారం సాయంత్రం ఆర్థిక శాఖతో పాటు సంబంధిత శాఖ అధికారులతో డిప్యూటీ సిఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.

### కనీస మద్దతు ధరకు

# చట్టబద్ధత సాధించే వరకూ పోరాటం

### ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసుఫ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను పూర్తిగా రద్దు చేసి, రైతులకు ఇచ్చిన హామీమేరకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత సాధించే వరకు పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈనెల 26న హైదరాబాద్‌లోని ఆర్‌టిసి క్రాస్ రోడ్‌లో జరగనున్న అన్ని కార్మిక సంఘాల ఐక్య నిరసన ప్రదర్శనలో కార్మికులు, ప్రజలు, అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.యూసుఫ్ అధ్యక్షతన గురువారం అన్ని జాతీయ కార్మిక సంఘాల సంయుక్త సమావేశం హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, రాష్ట్ర కార్యదర్శి ఎన్.కరుణకుమారి, హైదరాబాద్ నగర ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి భూపాల్, ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్, రాష్ట్ర నాయకులు పి.శ్రీకాంత్, టియుసిఐ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ వి.ప్రవీణ్, రాష్ట్ర నాయకులు కె.ఎస్.ప్రదీప్, ఐఎఫ్‌టియు నాయకులు విజయ్,అరెల్లిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు. రాజ్యాంగం అమలులోనికి వచ్చిన 'నవంబర్ 26వ' తేదీన నిరసన, ధర్నాలు, ప్రదర్శనలు, సభలు, సమావేశాలు నిర్వహించడం ద్వారా కేంద్రంలోని బిజెపి విధానాలను బహిర్గతం చేయడానికి, కార్మిక సంఘాలు ఐక్య కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించాయి.ఈ సందర్భంగా ఎం.డి.యూసుఫ్ మాట్లాడుతూ దేశంలో రైతులకు వ్యతిరేకంగా గతంలో బిజెపి ప్రభుత్వం మూడు రైతు వ్యతిరేక నల్ల చట్టాలు ప్రవేశపెట్టిందని, దీంతో ఈ చట్టాలను వెంటనే రద్దుచేయాలని, కనీస మద్దతు ధర చట్టబద్ధ ం కల్పించాలని రైతులు ఢిల్లీ శివారులో దాదాపు ఒకటిన్నర సంవత్సరం పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు. ఈ కాలంలో దాదాపు 750 మంది పోరాట యోధులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ కనికరం లేని కేంద్ర ప్రభుత్వం రైతుల డిమాండ్లను ఖాతరు చేయకుండా బలప్రయోగానికి సిద్ధపడిందని, అయినప్పటికీ కార్మిక వర్గంతోకలిసి రైతులు పోరాటాలను ఉధృతం చేయడంతో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గిందని, మూడు చట్టాలను రద్దు చేస్తామని, కనీస మద్దతు ధరకు చట్ట బద్ధత కల్పిస్తామని హామీనిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. కార్మికవర్గ పోరాటంతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రం రద్దు చేసి, నాలుగు కార్మిక వ్యతిరేక యాజమాన్య అనుకూల కోడ్లను అమలు చేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వ పాలన మొదలైనప్పుడు సంపద నామమాత్రంగా ఉన్న పెట్టుబడిదారి వర్గం 2022 సంవత్సరం నుంచి 23 లెక్కల ప్రకారం ప్రపంచ జనాభాలో ఒక శాతం మంది 22.6శాతం సంపదను తమ ఖాతాల్లో వేసుకున్నారని వివరించారు. ఇప్పటి లెక్క ప్రకారం 1687 మంది వ్యక్తుల చేతుల్లో సగం దేశ సంపద ఉన్నదని, 2014 నుండి భారత బిలీనియర్ల నికర సంపద 250శాతం పెరిగిందని వివరించారు. నోట్ల రద్దు, జిఎస్‌టి అమలుతో నాలుగు మిలియన్లకు పైగా ఉద్యోగాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తగినంత ఉత్పాదకత, వ్యవసాయేతర ఉద్యోగాలను సృష్టించడంలో, రైతుల కష్టాలను పరిష్కరించడంలో కేంద్రం విఫలమైందని ఆరోపించారు.

### కీలక ఖనిజ రంగంలో తెలంగాణ చొరవకు

# నీతి ఆయోగ్ గుర్తింపు

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

2,300 మెగావాట్ల థర్మల్, సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు రాజస్థాన్ కేబినెట్ ఆమోదంపై హర్షం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇటీవల నీతి ఆయోగ్ సంస్థ ఏర్పాటు చేసిన 'జాతీయ స్థాయి కీలక ఖనిజ కమిటీ'లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సంస్థ సింగరేణికి ప్రముఖ స్థానం కల్పించింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక ఖనిజ రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ కార్యాచరణ ప్రారంభించి మిగిలిన అన్ని రాష్ట్రాల కంటే ముందున్న నేపథ్యంలో దేశవ్యాప్త గుర్తింపును పొందుతుందని చెప్పడానికి నీతి ఆయోగ్ కమిటీలో సింగరేణికి స్థానం దక్కడం నిదర్శనమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈనెల 19వ తేదీన నీతి ఆయోగ్ ప్రకటించిన జాతీయ స్థాయి కీలక ఖనిజాల గుర్తింపు, అన్వేషణ కమిటీలో సింగరేణి సంస్థకు ప్రాధాన్యతనిస్తూ ఆ సంస్థ సిఎండిని సభ్యునిగా పేర్కొంటూ ఆఫీస్ మెమొరాండం విడుదల చేసిన నేపథ్యంలో భట్టి విక్రమార్క గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

దేశ అవసరాలకు కీలకమైన కీలక ఖనిజాల అన్వేషణను తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్య అంశంగా పరిగణిస్తూ ప్రభుత్వ సంస్థలను ప్రోత్సహిస్తూ ముందుకెళ్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇప్పటికే ఆస్ట్రేలియా, రష్యా, ఘనా వంటి దేశాలతో వ్యాపార విస్తరణ అవకాశాలపై చర్చలు జరుపుతున్నామని, కీలక ఖనిజ రంగంలో గల అవకాశాలను అధ్యయనం చేయటానికి ఇప్పటికే ఏజెన్సీలను నియమించుకున్నామని తెలిపారు. ఇటీవల కేంద్రం నిర్వహించిన కీలక ఖనిజాల అన్వేషణ వేలం పాటలో సింగరేణి సంస్థ పాల్గొని బంగారం, రాగి ఖనిజాల అన్వేషణకు లైసెన్స్ కూడా సాధించిందన్నారు.

**2300 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్లకు రాజస్థాన్ క్యాబినెట్ ఆమోదం హర్షణీయం**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చొరవతో రాజస్థాన్ విద్యుత్ ఉత్పదాన్ నిగమ్ లిమిటెడ్‌తో కలిసి సింగరేణి సంస్థ 2300 మెగావాట్ల థర్మల్, సోలార్ విద్యుత్ ఉత్పాదనకు కుదుర్చుకున్న ఒప్పందానికి బుధవారం ఆ రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలపడం హర్షనీయమని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఉభయ రాష్ట్రాలకు మేలు చేసే విధంగా, దేశ విద్యుత్ అవసరాలకు తగిన విధంగా సహకరించేందుకు ఈ మెగా ప్రాజెక్టును సంయుక్తంగా చేపట్టామన్నారు. రాజస్థాన్ రాష్ట్ర క్యాబినెట్ అనుమతి లభించినందున రాజస్థాన్‌లోని సోలార్ వ్యాలీలో ఏర్పాటు చేయనున్న 1500 మెగావాట్ల సోలార్ ప్లాంట్‌కు కావలసిన స్థలం త్వరగా సమకూరుతుందన్నారు. ఒప్పందంలో భాగంగా మరో 800 మెగావాట్ల ప్లాంట్‌ను ప్రస్తుత మంచిర్యాల సమీపంలో గల సింగరేణి థర్మల్ విద్యుత్ ప్రాంగణంలో ఏర్పాటు చేయనుందని తెలిపారు. క్యాబినెట్ సమావేశంలో సింగరేణి రాజస్థాన్ విద్యుత్ ఉత్పాదన నిగం లిమిటెడ్ ఒప్పందానికి అనుమతి ఇచ్చిన రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వానికి తన అభినందనలు తెలియజేశారు. త్వరలో సింగరేణిని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తరించేలా ప్రణాళికలు రూపొందించినట్లు వెల్లడించారు. జాయింట్ వెంచర్ కంపెనీని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సింగరేణి సిఎండి ఎన్.బలరామ్‌ను డిప్యూటీ సిఎం ఆదేశించారు.

### భార్య, ఇద్దరు పిల్లల హత్య కేసులో

## నిందితుడికి ఉరిశిక్ష

**ప్రజాపక్షం/వికారాబాద్ :** భార్య, ఇద్దరు పిల్లలను హత్య చేసిన ఘటనలో నిందితుడికి ఉరిశిక్ష పడింది. 2019సంవత్సరంలో తన భార్యతో పాటు ఇద్దరు పిల్లలను అత్యంత కిరాతకంగా హత్య చేసిన కేసులోని నిందితుడైన గురుప్రవీణ్‌కుమార్‌కు మరణశిక్ష విధించి రూ.10వేలు, లేకుంటే ఆరు నెలల కఠిన కారాగార శిక్ష అనుభావించాలి ఈ వివిరాలను జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి తెలిపారు. శేరిలింగంపల్లి చెందిన గురుప్రవీణ కుమార్, చాందిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. అంతకుముందే వివాహం జరిగింది అని అన్నారు. అయినప్పటికీ తమ బిడ్డేనని అంగీకరించి ఈ దంపతులు వికారాబాద్‌కు మకాం మార్చారు. భార్య ఎక్కువ ఫోన్ మాట్లాడుతుందనే అనుమానం గురుప్రవీణ్ కుమార్‌కు బలంగా ఉండేది. ఈ విషయంలో చాలా సార్లు గొడవలు జరిగాయి. 04.08.2019 రాత్రి పిల్లలు నిద్రించిన తర్వాత కోపంతో తన బార్యను ఇనుప రాడ్డుతో కొట్టి ముగ్గురినీ హత్య చేశాడు. తర్వాత నిందితుడు గురుప్రవీణ్ కుమార్ తను రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకొని రైలు పట్టాలవైపు వెళుతున్నాడు. ఈ కేసులో సిఐ శ్రీనివాస్ కేసునమోదు చేసుకోని దర్యాప్తు చేసి 247/2019, సెక్షన్ 302 ఐపిసి కింద కేసు నమోదు చేశారు. అనంతరం 2వ ఐఒ అప్పటి వికారాబాద్ డిఎస్‌పి పి.సీతారాం దర్యాప్తు పూర్తి చేసి సాక్ష్యాలను కోర్టులో సమర్పించగా వాదోపవాదనలు విన్న జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి నిందితునికి ఉరిశిక్ష, రూ.10వేలు చెల్లించాలని అదేశించారు. ఈ కేసులో నిందుతుడికి కఠినమైన శిక్ష పడేందుకు కృషి చేసిన అధికారులకు ప్రత్యేకంగా అభినందించారు.

# ఇంటింటికీ ఇందిరమ్మ చీర

ఎస్‌హెచ్‌జి వెలుపల ఉన్న మహిళలకు సభ్యత్వం ఇచ్చి చీరలను వెంటనే ఇవ్వాలి

గ్రామాల్లో ఇంటింటికి వెళ్ళి చీరలు పంచాలి : మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/ములుగు :** ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని అత్యంత క్రమశిక్షణతో, పారదర్శకంగా నిర్వహించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

సెర్ప్ ఉన్నతాధికారులతో గురువారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి సీతక్క అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మహిళల గౌరవం, వారి శ్రేయస్సు కోసం ప్రభుత్వం ప్రారంభించిన ఈ మహత్తర కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా పండగ వాతావరణంలో సాగాలని ఆమె పేర్కొన్నారు. 18 ఏళ్లు పైబడిన ప్రతి మహిలకు చీర అందేలా పంపిణీ కార్యక్రమం నిర్వహించాలని సీతక్క సూచించారు. ఇంకా స్వయం సహాయక బృందాల్లో లేని మహిళలకు అవగాహన కల్పించి, వెంటనే వారికి సభ్యత్వం ఇచ్చి ఇందిరమ్మ చీరలను అక్కడికక్కడే అందించాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. నూతన లబ్ధిదారులను గుర్తించేందుకు పౌర సరఫరాల శాఖ సహకారాన్ని తీసుకోవాలన్నారు. ప్రస్తుత, కొత్త లబ్ధిదారుల వివరాలను యాప్ ద్వారా నమోదు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పంపిణీ కార్యక్రమం దశలవారీగా నిర్వహిస్తున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నవంబర్ 19 నుండి డిసెంబర్ 9 వరకు మొదటి దశలో పట్టణ ప్రాంతాల్లో మార్చి 1 నుండి 9 వరకు రెండవ దశగా పంపిణీ చేయాలని ఆమె స్పష్టం చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశించినట్లుగా, ప్రతి నియోజకవర్గానికి సబ్ కలెక్టర్ లేదా ఆర్‌డిఒ స్థాయి ప్రత్యేక అధికారిని నియమించి నియోజకవర్గం నుండి మండల, గ్రామ స్థాయిల వరకు పంపిణీని పర్యవేక్షించేలాగా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని సీతక్క సూచించారు.

ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని పురస్కరించుకొని మహిళా స్వయం సహాయక బృందాల ప్రాముఖ్యతను, ఇందిరా మహిళా శక్తి విజయాలను చాటే విధంగా నియోజకవర్గ, మండల స్థాయిలో ప్రారంభ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి పర్యవేక్షణలో కార్యక్రమం జరగాలని ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, ప్రజా ప్రతినిధులందరికీ మండల స్థాయి కార్యక్రమాలకు ఆహ్వానం పలకాలని ఆమె అధికారులను కోరారు. గ్రామ స్థాయిలో ప్రభుత్వ సిబ్బందితో పాటు గ్రామ మహిళా స్వయం సహాయక బృందాల సభ్యులు లబ్ధిదారుల నివాసాలకు వెళ్ళి ఇందిరమ్మ చీరలను బొట్టుపెట్టి అందజేయాలని సూచించారు. మహిళల ఐక్యతను చాటే విధంగా ఇంటింటికీ ఇందిరమ్మ చీరలు చేర్చుతామన్నారు. లబ్ధిదారుల వివరాలను సెర్ప్ ప్రొఫైల్ యాప్ ద్వారా నమోదు చేయడం తప్పనిసరి అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఈ యాప్ ద్వారా ఆధార్ డేటా, ఫోటోల సేకరణ జరగాల్సి ఉన్నందున అధికారులు పూర్తి సన్నద్ధతతో వ్యవహరించాలని సూచించారు. ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం మహిళల జీవితాల్లో ఆనందాన్ని నింపే పండగలా మారాలని, ప్రతి జిల్లాలో అవగాహన కార్యక్రమాలు చేపట్టి ప్రచారం పెంచాలని సీతక్క ఆదేశించారు.

తెలంగాణ ప్రభుత్వం
పంచాయత్‌రాజ్ ఇంజనీరింగ్ శాఖ
జిల్లా పి.ఆర్.ఇంజనీర్ కార్యాలయం, పిఐయు, ఖమ్మం.

NIT No 86/2025-26 To 88/2025-26 (3rd), and 89/2025-26 (1st Call)

ఈ దిగువ సంతకందారుచే DMFT-2025-26 and SMG 2021-22 పథకము కింద మంజూరైన 04 అభివృద్ధి పనులకు గాను అంచనా విలువ 25.75 లక్షలు ఆన్‌లైన్ టెండర్స్ రిజిస్టర్డ్ కాంట్రాక్టర్స్ నుండి పిలువబడుతున్నవి.

ETV, EMD ఇతర వివరములు, https://tender.telangana.gov.in/ నందు ది: 20.11.2025 నుండి లభించును. భవిష్యత్తులో ఏవైనా సవరణలు, నిబంధనలలో మార్పులు వున్నచో వెబ్‌సైట్ నందు మాత్రమే ప్రచురించబడును.

సం/- జిల్లా పి.ఆర్. ఇంజనీర్, పిఐయు ఖమ్మం.

DIPR R.O. No. : 10990-PP/CL/ADVT/1/2025-26, Date: 20-11-2025

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
చందానగర్ సర్కిల్-21, ఎస్ఎల్‌పి జోన్.

టెండర్ నోటీసు ('ఇ' ప్రొక్యూర్‌మెంట్ ద్వారా)

NIT No. 26/EE/GHMC/DIV-21/GHMC/2025-26 తేది: 19.11.2025

(04) పని కోసం 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లను నం. 26/EE/GHMC/DIV-21/2025-26 (ఐటెమ్ నం. 01 నుండి 04 వరకు) తేదీ: 19.11.2025 ద్వారా పిలవడమైనది. **అంచనా వ్యయం:** రూ.102.00 లక్షలు. తేదీ: 20.11.2025న మధ్యాహ్నం 2.00 గంటల నుండి 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ వెబ్‌సైట్‌లో బిడ్ల అమ్మకం తెరిచి ఉంటుంది మరియు **బిడ్ల సమర్పణకు చివరి తేదీ:** 27.11.2025 మధ్యాహ్నం 2.00 గంటలకు మరియు బిడ్ల అమ్మకం సమర్పణ సమయానికి ఒక గంట ముందు ముగుస్తుంది. మరిన్ని వివరాలను https://tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, చందానగర్ సర్కిల్-21 ఎస్ఎల్‌పి జోన్ : జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 11039-PP/CL/ADVT/1/2025-26, Date: 20-11-2025



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఆపరేషన్ కగార్‌పై బాధ్యతారాహిత్యంగా..

టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యలు

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆపరేషన్ కగార్ విషయంలో టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కేంద్ర ప్రభుత్వంపై చేసిన ఆరోపణలను బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తీవ్రంగా ఖండించారు. కేంద్రం మావోయిస్టులను కక్షపూరితంగా చంపుతోందంటూ చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా, ప్రజలను తప్పుదారి పట్టించేలా ఉన్నాయని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో అన్నారు. మహేశ్ కుమార్ గౌడ్ తమ వ్యాఖ్యలకు వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు. కాంగ్రెస్ హయాంలోనే అత్యధిక ఎన్‌కౌంటర్లు జరిగాయని, ఇప్పుడు కేంద్రంపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. మాజీ ఐపిఎస్ అధికారి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ నక్సల్స్ పట్ల సానుభూతి చూపడం వెయ్యి ఎలుకలు తిన్న పిల్లి తీర్థ యాత్రకు వెళ్లిన చందంగా ఉందన్నారు. గతంలో ఎన్‌కౌంటర్‌లలో పాల్గొని, ఇప్పుడు సానుభూతి చూపడం రెండు నాల్కల ధోరణికి నిదర్శనమన్నారు.

# సన్న బియ్యం పంపిణీని దేశమంతటా విస్తరించండి

సన్న బియ్యం పంపిణీతో పిడిఎస్ బియ్యం రీ సైక్లింగ్ తగ్గింది

బహిరంగ మార్కెట్లోనూ బియ్యం ధరలు స్థిరపడ్డాయి

కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషితో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో అమలు చేస్తున్న 'సన్న బియ్యం పంపిణీ పథకం' విజయవంతమైందని, దేశమంతటా ఈ పథకాన్ని విస్తరించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషితో తన అభిప్రాయాలను పంచుకున్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో రేషన్ షాప్‌ల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని సిఎం వివరించారు. తద్వారా పిడిఎస్ బియ్యం రీ సైక్లింగ్ తగ్గిందని, బహిరంగ మార్కెట్లోనూ ధరలు స్థిరపడ్డాయని చెప్పారు. ప్రజలు తినే బియ్యాన్ని పంపిణీ చేయడంతో ఈ పథకం ఆశించిన లక్ష్యం నెరవేరిందని అన్నారు. తెలంగాణ మాదిరిగానే కేంద్ర ప్రభుత్వం కూడా దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ చేసే అంశాన్ని పరిశీలించాలని సిఎం సూచించారు. పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ అంశంపై నిర్ణయం తీసుకుంటామని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి చెప్పారు. హైదరాబాద్‌కు గురువారం వచ్చిన కేంద్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. హోటల్ తాజ్ కృష్ణాలో జరిగిన ఈ సమావేశంలో సిఎంతో పాటు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సిఎస్ కె,.రామకృష్ణా రావు, సిఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, సివిల్ సప్లయిస్ ప్రిన్సిపల్ సెక్రెటరీ స్టీఫెన్ రవీంద్ర, పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి తగిన సహకారం అందించాలని సిఎం పలు అంశాలను ప్రస్తావించారు. 2024–25 రబీ సీజన్‌కు సంబంధించి అదనంగా 10 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ కోటా పెంచాలని, పిడిఎస్ కింద సరఫరా చేసిన లెవీ రైస్‌కు సంబంధించిన రూ.1,468 కోట్ల సబ్సిడీ విడుదల చేయాలని సిఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని కోరారు. పిఎంజికెఎవై 5వ దశకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.343.27 కోట్ల సబ్సిడీ విడుదల చేయాలని కోరారు. 2024–25 ఖరీఫ్ కస్టమ్ మిల్లింగ్ రైస్ వ్యవధి పొడిగించాలని, ఎఫ్‌సిఐ గోదామ్‌లలో నిల్వ ఇబ్బందులను అధిగమించేందుకు అదనపు బాయిల్డ్ రైస్ ర్యాక్‌లు కేటాయించాలని, రాష్ట్రంలో 15 లక్షల మెట్రిక్ టన్నుల గోదామ్‌ల నిల్వ సామర్థ్యం పెంచుకునేందుకు కేంద్రం సాయం అందించాలని కోరారు. 2025–26 ఖరీఫ్‌లో అత్యధికంగా 148 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందని, ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని 80 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచాలని కేంద్ర మంత్రికి సిఎం విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తులన్నీ సానుకూలంగా పరిశీలిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. దేశవ్యాప్తంగా బాయిల్డ్ రైస్ అవసరం తగ్గిందని, అందువల్ల మిల్లింగ్‌కు అనువైన ముడి బియ్యం రకాల సాగును ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్రంలో మిగులు ధాన్యం నిల్వలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎగుమతి అవకాశాలను పరిశీలించాలని సలహా ఇచ్చారు. ధాన్యం సేకరణ లక్ష్యాన్ని 80 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచాలని, బాయిల్డ్ రైస్ అదనపు కోటాను కేటాయించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. రా రైస్‌కు అనువైన రకాల వరి సాగును ప్రోత్సహించేందుకు రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు.

## ధాన్యం ఉత్పత్తి సేకరణలో...
# నల్లగొండ తెలంగాణలోనే ప్రముఖ పాత్ర

దేశంలోని 80 కోట్ల మంది పేద ప్రజలకు ప్రతినెల 5 కిలోల ఉచిత బియ్యాన్ని ఇస్తున్నం

ఎఫ్‌సిఐ డివిజనల్ కార్యాలయాన్ని ప్రారంభించిన కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి



**ప్రజాపక్షం/నల్లగొండ :** ఆహార భద్రతలో భాగంగా దేశంలోని 80 కోట్ల మంది పేదప్రజలకు ప్రతినెల 5కిలోల ఉచిత బియ్యాన్ని ఇస్తున్నట్లు కేంద్ర ఆహార, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు, ప్రజా పంపిణీ శాఖల మంత్రి ప్రహ్లాద్ జోషి చెప్పారు. గురువారం అయన జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన భారత ఆహార సంస్థ డివిజనల్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ కోవిడ్ మహా విపత్తులో ఏ ఒక్కరూ ఆకలితో చనిపోకూడదన్న ఉద్దేశంతో ఆహార భద్రత కింద పేదలందరికీ 5 కిలోల చొప్పున 80కోట్ల మందికి ఉచిత బియ్యం ఇస్తున్నామని, ఇది 2030 వరకు ఇది కొనసాగించాలని దేశ ప్రధాని నరేంద్ర మోదీ నిర్ణయించినట్లు తెలిపారు. ప్రపంచంలో ఏ దేశంలో ఇంత పెద్ద మొత్తంలో పేదలకు ప్రతినెల 5కిలోల బియ్యం ఇవ్వటం లేదని అన్నారు. ఆస్ట్రేలియా, జర్మనీ యూరోపియన్ దేశాలలో సైతం ఇలాంటి పద్ధతి లేదని, భారత ప్రజా పంపిణీ వ్యవస్థను చూసి ఇతర దేశాలు ఆశ్చర్యపోతున్నాయని, ప్రపంచంలోనే భారత ఆహార భద్రత పథకం మోడల్ గా తీసుకురావడం జరిగిందని ఆయన వెల్లడించారునల్లగొండ జిల్లా ధాన్యం ఉత్పత్తి, ధాన్యం సేకరణలో తెలంగాణ రాష్ట్రంలోనే ప్రముఖ పాత్ర పోషిస్తున్నదని,ప్రస్తుతం నూతనంగా ప్రారంభించిన ఎఫ్‌సిఐ డివిజనల్ కార్యాలయ ఆవరణలో ఉన్న గోదాంలో 62 వేల మెట్రిక్ టన్నుల నిలువ సామర్థం ఉందని, ప్రభుత్వం భూమి ఇస్తే మరో ఎఫ్‌సిఐ గోదామును జిల్లాలో ప్రారంభించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు.

రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి 2024–25 సంవత్సరానికి సంబంధించి బాయిల్డ్ రైస్ లక్ష్యాన్ని పెంచాలని,పదేళ్ల నుండి పెండింగ్లో ఉన్న 1400 కోట్ల రూపాయలను సీఎంఆర్ బకాయిలు చెల్లించాలన్నారు. దేశంలో తెలంగాణ ఖరీఫ్లో 150 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించిందని, 80 లక్షల మెట్రిక్ టన్నులు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరిస్తున్నదని, ఇదివరకే 29 వేల కోట్ల రూపాయలను ధాన్యం కొనుగోలుపై ఖర్చు చేయడం జరిగిందని ,రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేసేందుకు రాష్ట్రంలో 8800 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, ఆహార భద్రత కింద ప్రతి ఒక్కరికి 6 కిలోల నాణ్యమైన సన్నబియాన్ని ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఉద్యమాల గడ్డ ధాన్యపు రాశులకు అడ్డా మా నల్లగొండ ఎక్కువ వరి ధాన్యం జిల్లాలో పండుతుంది, బత్తాయి ఎంతో ప్రసిద్ధి చెందింది మా రైతుల కోసం అత్యాధునిక ధాన్యం గోదాము, బత్తాయి కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు మంజూరు చేయాలని, ధాన్యానికి సంబంధించి ప్రైవేటు ప్రభుత్వ భాగస్వామ్యంలో లక్ష మెట్రిక్ టన్నుల సామర్థం కలిగిన గోదామును మంజూరు చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.

నల్లగొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి ,భారత ఆహార సంస్థ ఈ డి వనిత శర్మ ఎమ్మెల్సీ శంకర్ నాయక్ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, భారత ఆహార సంస్థ జిల్లా మేనేజర్ రాజు, ఎఫ్‌సిఐ అధికారులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




## ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు వెంటనే చెల్లించాలి

ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నేషనల్ హెల్త్ మిషన్‌లో కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు గత రెండు నెలలుగా జీతాలు రాక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే పెండింగ్ జీతాలు విడుదల చేయాలని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి, ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఎం.నరసింహ డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం కోఠిలోని డిహెచ్ క్యాంపస్‌లో మహాధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం స్కీంలో పనిచేస్తున్న వేల మంది ఉద్యోగుల జీతాలు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నడుస్తున్నటువంటి ఈ స్కీంలో ఉద్యోగులకు అటు కేంద్ర ప్రభుత్వ బేసిక్ గాని, ఇటు రాష్ట్ర ప్రభుత్వ బేసిక్ గాని ఇవ్వకుండా శ్రమదోపిడికి గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఉద్యోగులకు రావలసిన పెండింగ్ బకాయిలపై రాబోవు రోజుల్లో నిరవధిక సమ్మె సైతం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. అనంతరం చీఫ్ ప్రోగ్రాం ఆఫీసర్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేయగా, వారు స్పందించి ఈ నెల చివరిలోపు జీతాలు చెల్లించేందుకు ప్రయత్నిస్తామని ఉద్యోగులకు హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సారంగుల బాలసుబ్రమణ్యం, దేవనబోయిన బాపు యాదవ్, నూకల అంజయ్య, సిద్దిపేట రాజేశ్వరి రెడ్డి, ఆచంట అభిషేక్ , ఎల్. సురేష్ నాయక్, జి.జ్యోతి, సిద్ధార్థ, యూనియన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## కెటిఆర్‌పై విచారణకు గవర్నర్ అనుతించారు.. సిఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు ఏం చేస్తారు?

కేంద్రమంత్రి బండి సంజయ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు విచారణకు గవర్నర్ ఆమోదించడాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ స్వాగతించారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ బిజెపి, బిఆర్‌ఎస్ ఒక్కటేనని ఆరోపించిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఆర్‌కె (రేవంత్ రెడ్డి, కెటిఆర్) పాలన కొనసాగుతోందని ఆరోపించారు. ఇన్నాళ్లూ గవర్నర్ అనుమతి ఇవ్వొద్దనే సిఎం కోరుకున్నారని, అవినీతిపరుల ఆస్తులు జప్తు చేస్తానని గతంలో సిఎం అన్నారన్నారు. ఇప్పుడు గవర్నర్ అనుమతి ఇచ్చారని, సిఎం ఏం చేస్తారో చూడాల్సి ఉందన్నారు. మోదీ అభివృద్ధిని చూసి అడవిలో ఉన్న నక్సలైట్లు లొంగిపోతున్నారని, అర్బన్ నక్సల్స్‌లో మాత్రం మార్పు కన్పించడం లేదన్నారు.

**టెన్త్ పేపర్ లీక్ కేసు రద్దుపై హైకోర్టు తీర్పుకు స్వాగతం**

టెన్త్ హిందీ ప్రశ్నాపత్రం లీక్ కేసును హైకోర్టు రద్దు చేసిన తీర్పును కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ చేయని తప్పుకు తనను జైలుకు పంపారని, మానవత్వం మరిచి తన మీద, తమ కార్యకర్తలపై క్రూరంగా వ్యవహరించారన్నారన్నారు. ఈ పాపం ఊరికే పోదని, కక్షసాధింపు చర్యలకు ఫలితముంటుందని శాపనార్థాలు పెట్టారు. తనపై మోపిన కేసులన్ని అక్రమమైనవని హైకోర్టు తీర్పు మరోసారి నిరూపించిందన్నారు.

**ప్రతిపక్ష హోదా కూడా మిగలదు : పాయల్ శంకర్**

కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై గత ప్రభుత్వం పెట్టిన కేసులు హైకోర్టులో కొట్టివేయబడడంతో, గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ రాజకీయ కుట్రలు బహిర్గతమయ్యాయని బిజెపి శాసనసభాపక్ష ఉపనేత పాయల శంకర్ విమర్శించారు. టెన్త్ పరీక్ష పేపర్ లీక్ పేరుతో సంజయ్‌పై పెట్టిన కేసు తప్పుడు కేసు అని కోర్టు తేల్చిందన్నారు. హైకోర్టు పలుమార్లు బిఆర్‌ఎస్ ప్రభుత్వ చర్యలపై తీవ్రమైన వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో, ఆ పార్టీ ఇప్పటికైనా తన తీరు మార్చుకోవాలని శంకర్ సూచించారు. లేనిపక్షంలో బిఆర్‌ఎస్‌కు ప్రతిపక్ష హోదా కూడా మిగలదన్నారు.

# దేశాభివృద్ధిలో దక్షిణాది రాష్ట్రాలది కీలక పాత్ర

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషలు, సంస్కృతుల మధ్య తేడాను వివరించడం దక్షిణాది వారికి కష్టంగా ఉండేదని, అయినా ఆర్థికంగా, సాంస్కృతిక పరంగా, ఇతర రంగాల్లో దేశాభివృద్ధిలో దక్షిణాది రాష్ట్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోన్న భారత్ ఫ్యూచర్ సిటీలో భారతదేశపు మొట్టమొదటి 'నార్త్ ఈస్ట్ అనుబంధ కేంద్రాన్ని' నిర్మించడానికి భూమి కేటాయిస్తామని సిఎం ప్రకటించారు. 'తెలంగాణ నార్త్ ఈస్ట్ కనెక్ట్' టెక్నో, కల్చరల్ ఫెస్టివల్ గురువారం హైదరాబాద్లో జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ధనసరి అనసూయ సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, డిజిపి శివధర్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ 'నార్త్ ఈస్ట్ అనుబంధ కేంద్రం'లో ప్రతి ఈశాన్య రాష్ట్రం వారి సొంత భవనాలను నిర్మించుకోవడానికి వెసులుబాటు కల్పిస్తామన్నారు. అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర రాష్ట్రాలకు వారి ప్రత్యేక భవనంతో పాటు హాస్టల్ సౌకర్యం, ఆహారం, చేతివృత్తులు, సంస్కృతులు, కళల ప్రదర్శనకు వేదికలు ఉంటాయని వెల్లడించారు. ఇండియాలో తొలి నార్త్ ఈస్ట్ అనుబంధ కేంద్రాన్ని తెలంగాణ ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేసే ప్రణాళికలను విజయవంతంగా ముందుకు తీసుకెళదామన్నారు. తెలంగాణ అభివృద్ధి లక్ష్యాలను, తెలంగాణ రైజింగ్ విజన్ 2047 ఉద్దేశాలను దేశంలోని ప్రతి ప్రాంతానికి, ప్రపంచ నలుమూలలకు తీసుకువెళ్లడానికి సహకరించాలని సిఎం కోరారు.

# రైతుల కోసం దృఢ సంకల్పంతో ముందుకు

గ్రామీణ ఆర్థిక వ్యవస్థ భవిష్యత్తును నాబార్డ్ మారుస్తోంది

గ్రామీణ భారత పునరుద్ధరణ వెనుక ఉన్న నిశ్శబ్దశక్తి నాబార్డ్

నాబార్డ్ ఎర్త్ సమ్మిట్‌లో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం దృఢ సంకల్పంతో ముందుకెళ్తోందని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ భవిష్యత్తును నాబార్డ్ మారుస్తోందన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో గురువారం ఏర్పాటు చేసిన నాబార్డ్ మొదటి 'ఎర్త్ సమ్మిట్'కు డిప్యూటీ సిఎం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశంలో డిప్యూటీ సిఎం ప్రసంగిస్తూ గ్రామీణ భారత పునరుద్ధరణ వెనుక ఉన్న నిశ్శబ్దశక్తి నాబార్డ్ అన్నారు. 21వ శతాబ్దానికి అనువైన సంస్థలను తెలంగాణ నిర్మిస్తుందని డిప్యూటీ సిఎం చెప్పారు. వ్యవసాయంలో ఎఐ వంటి సాంకేతిక పరిజ్ఞానం వినియోగం విలాసం కాదని, నేడు అది అవసరమన్నారు. భారతదేశ బలం చివరకు దాని నేలలోనే ఉంది, దాని గ్రామాలలో ఉందన్నారు. దేశ రైతుల్లో ఉంది, ప్రతికూలతను సమృద్ధిగా మార్చే వారి నిశ్శబ్ద ధైర్యంలో ఉందన్నారు. దేశంలోనే అతి పెద్ద రుణమాఫీలలో ఒకదాన్ని అమలు చేసి, దాదాపు 22 లక్షల కుటుంబాలకు 21,000 కోట్ల రూపాయల ఉపశమనం అందించామన్నారు. రైతులకు నేరుగా, సమయానుసారం మద్దతు అందుకునేలా రైతు భరోసా అమలు చేస్తున్నాం అనే డిప్యూటీ సిఎం వివరించారు. సాగునీరు, డిజిటల్ పంట రికార్డులు, కోత తర్వాత మౌలిక వసతులలో పెట్టుబడులతో గ్రామీణ కుటుంబాల్లో బలమైన నమ్మకాన్ని పునరుద్ధరించామని తెలిపారు. సంక్షోభ సమయాల్లోనే కాదు, రైతుల ప్రతి రోజూ అభివృద్ధి పయనంలో కాంగ్రెస్ ప్రభుత్వం తోడుగా ఉంటుందని, ఇది ప్రభుత్వ నిబద్ధత ఇది అన్నారు.

## మానవ అక్రమ రవాణా
# నివారణే ప్రధాన లక్ష్యం



నేరాల సమీక్షలో అధికారులతో డిజిపి బి.శివధర్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ఎంపిక చేసిన జిల్లాలలో 'సేఫ్ విలేజ్ ప్రోగ్రాం' కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించనున్నట్లు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలోని పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో గురువారం డిజిపి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నేరాల స్థితిగతులను సమీక్షించారు. ముఖ్యంగా తీవ్రమైన నేరాలు, ఆర్థిక నేరాలు, బాలలకు సంబంధించిన నేరాలపై లోతుగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాను సమర్థవంతంగా అరికట్టేందుకు ప్రయోగాత్మకంగా రాష్ట్రంలోని ఏడు జిల్లాల పరిధిలో స్వచ్ఛంద సంస్థ సహకారంతో మహబూబాబాద్, ఖమ్మం, వరంగల్, భద్రాద్రి కొత్తగూడెం, వికారాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లాలలో 'సేఫ్ విలేజ్ ప్రోగ్రాం'పై విస్తృత కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

ఫలితాలను బట్టి అవసరమైతే మిగిలిన ప్రాంతాలకు కూడా విస్తరిస్తామన్నారు. దీంతో పాటు పొరుగు రాష్ట్రాల సరిహద్దు జిల్లాల ఎస్పీలు ఆయా రాష్ట్రాలకు సంబంధించిన అధికారులతో సమన్వయ సమావేశాలను ఏర్పాటు చేసుకొని, అంతర్రాష్ట్ర నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. లా అండ్ అర్డర్ అడిషనల్ డిజిపి మహేష్ భగవత్, సిఐడి అడిషనల్ డిజిపి చారు సిన్హా, మల్టీజోన్ 2 అడిషనల్ డిజిపి డిఎస్.చౌహాన్, మల్టీ జోన్1 ఐజిపి ఎస్. చంద్రశేఖర్ రెడ్డి, ఐజిపిలు డాక్టర్ ఎం.రమేష్, కె .రమేష్ నాయుడు, ఎస్పీలు నవీన్ కుమార్, వెంకటలక్ష్మి, సతీష్, లీగల్ అడ్వైజర్ అజయ్ కుమార్ తదితరులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

**దక్షిణ మధ్య రైల్వే**
Follow us on X @SCRailwayindia
దక్షిణమధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడగలరు.

**ఇ-టెండరు నోటీసు నెం. GNT/E.21/TrD/2025–26** PUB/1460/25

ఈ క్రింద పేర్కొన్న పనులకు కాంట్రాక్టర్ల నుండి 15.12.205 వ తేదీన మధ్యాహ్నం 3.30 గంటల వరకూ ఇ-టెండర్లను ఈ క్రింద సంతకం చేసినవారు ఆహ్వానించడమైనది.

**క్రమ సంఖ్య:** 1 **టెండరు శీర్షిక:** జిఎన్‌టి–డివిజన్: సిటిఆర్(పి). రైల్ రెన్యూవల్ ద్వారా (పి), టిఎఫ్ఆర్, టిబిఆర్ (ఎంవీల్) పనులు-ఎలక్ట్రికల్ ట్రాక్షన్ పంపిణీ పనులు, **టెండరు రిఫరెన్స్ నెం:** జిఎన్‌టి/ఇ.21/టిఆర్‌డి/2025-26 తేదీ : 18.11.2025, **సుమారు విలువ రూపాయలలో** :17,11,828/- **డిపాజిట్‌గా చెల్లించాల్సిన ధనం రూపాయలలో,**: 34,300/- **టెండరు నమూనా (తిరిగి చెల్లించబడదు) రూపాయలలో** : నిల్

ఇ–వేలంపాటకు బిడ్స్‌ను ఆన్‌లైన్‌లో సమర్పించడానికి చివరి తేదీ: 15.12.2025 మధ్యాహ్నం 3.30 గంటల వరకూ.

ఒకవేళ టెండరు సమర్పించేందుకు చివరితేదీ గనుక ప్రభుత్వ సెలవు దినమ్ముగా ప్రకటినట్లయితే ఆ మరునాటి పనిదినం సమయంలో టెండర్లు తెరచి చూడబడును. ఇతరత్రా ఏవైనా వివరాలు, సమాచారం కావాలంటే 18.11.2025వ తేదీ నుండి లేదా ఆ తర్వాత నుండి 15.12.2025 మధ్యాహ్నం 3.30 గంటల వరకూ మా వెబ్‌సైటు www.ireps.gov.in లోకి ప్రవేశించి తెలుసుకోగలరు. తదుపరి సంప్రదింపులకు, తప్పు ఒప్పుల పట్టికకోసం కేవలం ఇ-పోర్టల్ www.ireps.gov.in ద్వారా మాత్రమే తెలియజేయవలెను.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీరు ట్రాక్షన్ పంపిణీ/టిఆర్‌డి/గుంటూరు

**ఇ-టెండరు నోటీసు నెం. GSU-GTL-ESC-LIFT-08-2025 తేదీ: 13.11.2025** PUB/1461/25

భారత రాష్ట్రపతి తరపున డిప్యూటీ చీఫ్ ఇంజనీరు/గతిశక్తి యూనిట్/గుంతకల్ ఈ క్రింది పనులు నిర్వహించుటకు ఇ-టెండర్లకు ఆహ్వానించడమైనది. టెండర్లు ముగిసే తేదీ మరియు సమయం : 05.12.2025 ఉదయం 11.00 గంటల వరకూ.

**క్రమ సంఖ్య:** 1 **టెండరు శీర్షిక:** జిఎస్‌యు-జిటిఎల్-ఇఎస్‌సి-ఎల్ఐఎఫ్‌టి-08-2025, **పని వివరం:** గుంతకల్ డివిజన్: **SW-I** - (i) రాయ్‌చూర్: వనరుల సంఖ్య మూడు. ఎస్కలేటర్లు పైకి ఎక్కుటకు మరియు దిగుటకు) కొత్త 12 మీటర్లు ఎఫ్ఓబి కోసం. (ii) ప్రస్తుత FOBకి 2 లిఫ్టుల ఏర్పాటు. **SW-II** - (i) యాదగిరి: కొత్త 12 మీటర్ల FOBకి 3 ఎస్కలేటర్ల ఏర్పాటు (పైకి & క్రిందికి). (ii) వనరుల సంఖ్య రెండు. ప్రస్తుతం ఉన్న ఎఫ్ఓబికి లిఫ్టులు **ప్రకటించిన విలువ:** రూ.3,81,84,747.30, **డిపాజిట్‌గా చెల్లించాల్సిన ధనం** : రూ.3,40,900

వేలంపాట పత్రాలకు మరియు ఇతర వివరాలకోసం http://ireps.gov.in లో ప్రవేశించగలరు. ఏ విధమైన తప్పు ఒప్పుల పట్టికైనా ఆన్‌లైన్ ద్వారా మాత్రమే జారీ చేయబడును.

డిప్యూటీ చీఫ్ ఇంజనీరు/గతిశక్తి యూనిట్/గుంతకల్

**ఇ-టెండరు నెం. ELS/BZA-eTN-15-2025–26 తేదీ: 18.11.2025** PUB/1462/25

భారత రాష్ట్రపతి తరపున ఈ దిగువన సంతకం చేసిన వారు ఈ క్రింద పేర్కొన్న పనులకు 10.12.2025 తేదీన మధ్యాహ్నం 3.00 గంటల వరకూ ఇ-టెండర్లకు ఆహ్వానించడమైనది.

**క్రమ సంఖ్య** :1 **టెండరు శీర్షిక:** బి/ఇ.221/టిఆర్ఎస్/ఆర్‌సి/558 **ఇ-టెండరు నెం:** ఇఎల్ఎస్-బిజెడ్ఎ-ఇ టిఎన్-15-2025-26 తేదీ: 18.11.2025 **పని వివరం:** బోగీలకు వచ్చిన పగుళ్ళకు బోగీ లైనర్స్‌కు వెల్డింగు చేయవలెను మరియు విజయవాడ ఎలక్ట్రిక్ లోకోషెడ్ వద్ద ఇతర వెల్డింగు కార్యకలాపాలు కూడా నిర్వహించవలెను. **పూర్తి చేయాల్సిన సమయం** : 24 నెలలు, **టెండరు విలువ:** 13730351.72/- **డిపాజిట్ చేయాల్సిన ధనం:** 218700.00/- **టెండరు పత్రం విలువ** : 0, **టెండరు ముగింపు తేదీ మరియు సమయం:** 10.12.2025, మధ్యాహ్నం 3.00 గంటల వరకూ.

1) టెండరు షరతులు/ఇతర వివరాలు అంటే పూర్తి పని పేరు, పైన పేర్కొన్న ఒకేరకమైన పని పరిస్థితి,అర్హత ప్రాధాన్యత తదితరాలు అన్నీ టెండరు పత్రాలలో లభ్యమగును. ఇవన్నీ www.ireps.gov.in వెబ్‌సైటులో ప్రచురించడమైనది.
2) ఆసక్తిగల టెండర్లు ఏ టెండరుకు సంబంధించిన ఎలాంటి మార్పులనైనా / తప్పు ఒప్పుల పట్టికనైనా తెలుసుకోవడానికి టెండరు ముగియడానికి ముందు రోజునే మా వెబ్‌సైటు www.ireps.gov.in ను సందర్శించగలరు.
3) ఎలాంటి కారణం చెప్పకుండా టెండరును రద్దు చేసుకునే హక్కు రైల్వేకు ఉన్నది.

మా వెబ్‌సైటు www.ireps.gov.in ను సందర్శించగలరు.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీరు (టిఆర్ఎస్)ఇఎల్ఎస్ / విజయవాడ

A1857

మరిన్ని టెండర్ షరతులు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.

# చేనేత కార్మికులకు రూ.33కోట్లు


తుమ్మల నాగేశ్వర్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సిఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం నేత కార్మికులకు రూ 33 కోట్లు విడుదల చేసినట్టు రాష్ట్ర చేనేత,జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. నేత కార్మికుల సంక్షేమానికి అభయహస్తం పథకం అమలు చేస్తున్నామన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి నేత కార్మికుల సంక్షేమం కోసం అనేక పథకాలు తీసుకురావడంతో పాటు , పునరుద్ధరించామని వివరించారు. ప్రజా ప్రభుత్వ నిర్ణయాలతో నేత కార్మికులకు నిరంతర ఉపాధి లభిస్తోందని, అందులో భాగంగా టెస్కోకు రూ.588 కోట్ల విలువైన ఆర్డర్లు రావడం జరిగిందని అన్నారు. నేత కార్మికులకు 365 రోజులు ఉపాధి కల్పించడమే తమ ప్రధాన ధ్యేయమని అన్నారు. సిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, మంచిర్యాల, హన్మకొండ జిల్లాల్లోని 130 ఎంఎసిఎస్, 56 ఎస్ఎస్ఐ యూనిట్ల ద్వారా ఇందిరా మహిళా శక్తి పథకం కింద సహాయక సంఘాల మహిళా సభ్యులకు అందించే చీరల ఉత్పత్తి జరిగిందని, తద్వారా మహిళలకు నాణ్యమైన చీరలు అందిస్తున్నామని తుమ్మల తెలిపారు. అన్ని శాఖలకు అవసరమైన వస్త్రాలను టెస్కో ద్వారా కొనుగోలు చేయాలని సూచించామన్నారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం రూ.168 కోట్లతో తెలంగాణ చేనేత అభయహస్తం పథకంలో భాగంగా మూడు ముఖ్యమైన పథకాలను అమలు చేస్తోందన్నారు.

**మంత్రి తుమ్మల–సీడ్ బిల్లు**

నాణ్యత లేని విత్తనాలు సరఫరా చేసిన కంపెనీలు సదరు నష్టానికి గురైన రైతులకు తప్పనిసరిగా పరిహారం చెల్లించే విధంగా చట్టబద్ధమైన నిబంధనలను చేర్చాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. ప్రస్తుత కేంద్ర ముసాయిదాలోని లేని రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా ఉండేలా నిబంధనలను రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'నూతన విత్తన చట్టం 2025' ముసాయిదాపై హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ప్రధాన కార్యదర్శి సురేంద్రమోహన్, వ్యయసాయ శఖూఖ సంచాలకులు డాక్టర్ బి.గోపి, తెలంగాణ స్టేట్ సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ విసి ఆల్దాస్ జానయ్య, అదనపు సంచాలకులు నరసింహారావు,సంయుక్త సంచాలకులు సుచరిత, హార్టికల్చర్ సంయుక్త సంచాలకులు రామక్ష్మి తో పాటు పలువురు రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో విత్తనం ప్రాథమిక అవశ్యకత అని, నకిలీ/నాణ్యతలేని విత్తనాల కారణంగా రైతులు తరచూ నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం విడుదల చేసిన ముసాయిదా చట్టంపైన రాష్ట్ర ప్రభుత్వం రైతు వేదికల ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని, రైతుల సూచనలను స్వీకరించాలన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## రాబర్ట్ వాద్రాపై ఇడి చార్జిషీట్ దాఖలు

**న్యూఢిల్లీ :** యుకెకు చెందిన ఆయుధ వ్యాపారి సంజయ్ భండారీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ప్రముఖ వ్యాపార వేత్త రాబర్ట్ వాద్రాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చార్జిషీట్ దాఖలు చేసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద చార్జిషీట్‌ను ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టుకు సమర్పించింది. కాగా, యుకెకు చెందిన ఆయుధాల కన్సల్టెంట్ సంజయ్ భండారీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో రాబర్ట్ వాద్రాను ఇడివిచారించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది జులైలో ఆయన వాంగ్మూలాన్ని రికార్డు చేసింది.ఈ నేపథ్యంలో తాజాగా వాద్రాపై ఛార్జిషీట్ దాఖలు చేసింది.

## రాహుల్ కేసులో స్టే పొడిగించిన 'సుప్రీం'

**న్యూఢిల్లీ:** భారతీయ సైన్యంపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యల కేసులో గురువారం సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. 2022 భారత్ జోడో యాత్రలో ఆర్మీపై రాహుల్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఆ కేసులో చర్యలు తీసుకోవాలని ట్రయల్ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆ ఆదేశాలను సవాల్ చేస్తూ సుప్రీంను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో విచారణను నిలిపివేయాలని డిసెంబర్ 4వ తేదీ వరకు సుప్రీంకోర్టు స్టేను పొడిగించింది. జస్టిస్ ఎంఎం సుందరేశ్, సతీశ్ చంద్ర శర్మతో కూడిన ధర్మాసనం ఈ కేసును ఇవాళ విచారించింది. ట్రయల్ కోర్టు ఆదేశాలను కొట్టివేయాలని కోరుతూ మే 29వ తేదీన అలహాబాద్ హైకోర్టును రాహుల్ ఆశ్రయించారు. అయితే ఆ సవాల్‌ను హైకోర్టు తిరస్కరించింది. దీంతో సరిహద్దులను చైనా ఆక్రమించినట్లు గతంలో ఆరోపించారు. అయితే ఆ కేసులో ఆగస్టు 4వ తేదీన సుప్రీంకోర్టు విచారణ చేస్తూ.. 2 వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం ఉన్న భారత భూభాగాన్ని చైనా ఆక్రమించినట్లు ఎలా చెబుతున్నారని ప్రశ్నించింది. ఆ ఆక్రమణ సమయంలో మీరున్నారా, మీ దగ్గర ఏదైనా నమ్మదగ్గ సమాచారం ఉందా అని కోర్టు అడిగింది.

## ఉగ్రవాదులకంటే మేధావులే ప్రమాదం

### 'సుప్రీం'కు ఢిల్లీ పోలీసుల స్పష్టీకరణ

**న్యూఢిల్లీ:** దేశ వ్యతిరేక చర్యల్లో మేధావుల పాత్ర పెరుగుతున్నదంటే అది సాధారణ అంశం కాదు, క్షేత్రస్థాయిలో పనిచేసే ఉగ్రవాదుల కంటే వీరే ఎక్కువ ప్రమాదకరమని ఢిల్లీ పోలీసులు సుప్రీం కోర్టుకు స్పష్టం చేశారు. 2020లో ఢిల్లీలో జరిగిన అల్లర్ల కేసులో నిర్బంధంలో ఉన్న ఉమర్ ఖాలిద్, శర్జీల్ ఇమామ్ తదితర నిందితుల బెయిల్ పిటిషన్లను వ్యతిరేకిస్తూ పోలీసుల తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజు బలమైన వాదనలు వినిపించారు. 2020లో పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ), జాతీయ పౌరసత్వ పట్టిక (ఎన్‌ఆర్‌సి) వ్యతిరేకంగా ఢిల్లీలో జరిగిన భారీ నిరసనలు హింసాత్మకంగా మారిన సంగతి తెలిసిందే. మూడు రోజుల పాటు కొనసాగిన అల్లర్లలో 53 మంది మృతి చెందగా, వందలాది మంది గాయపడ్డారు. ఈ అల్లర్లకు సంబంధించి ఉమర్ ఖాలిద్, శర్జీల్ ఇమామ్, గుల్ఫిషా ఫాతిమా, మీరాన్ హైదర్ తదితరులపై మునుపటి ఐసిసి సెక్షన్లతో పాటు ఉగ్రవాద నిరోధక చట్టం ఉపా కింద కేసులు బుక్ చేశారు. అప్పటి నుంచి వీరు దాదాపు ఐదేళ్లుగా నిర్బంధంలో ఉన్నారు. బెయిల్ పిటిషన్లపై విచారణ సందర్భంగా, కేసు దర్యాప్తులో, విచారణలో జరిగిన ఆలస్యానికి నిందితులే ప్రధాన కారణమని ఎఎస్‌జి రాజు ధర్మాసనానికి వివరించారు. ఈ జాప్యాన్ని ఇప్పుడు బెయిల్ కారణంగా చూపించలేరని స్పష్టం చేశారు. 'వారు సాగదీస్తే దాన్ని తమకు అనుకూలంగా మలచుకోవాలనే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. న్యాయవ్యవస్థను తప్పుదోవ పట్టించే ప్రయత్నం ఇది అని రాజు వాదించారు. శర్జీల్ ఇమామ్ రెచ్చగొట్టే ప్రసంగాలు చేశాడన్న ఆరోపణను బలపరచేందుకు పోలీసులు సుప్రీంకోర్టులో సంబంధిత వీడియో క్లిప్స్‌ను ప్రదర్శించారు. ఇమామ్ ఒక ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ అని, ఇటీవలి కాలంలో ఒక ట్రెండ్ మొదలైందని తెలిపారు డాక్టర్లు, ఇంజినీర్లు తమ వృత్తి పనులు వదిలిపెట్టి దేశ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనడం పెరిగిందని, వీరి ప్రభావం ఎక్కువ, అందుకే వీరు మరింత ప్రమాదకరులని వ్యాఖ్యానించారు. నిరసనల అసలు ఉద్దేశ్యంపై కూడా ఢిల్లీ పోలీసులు సందేహాలు వ్యక్తం చేశారు. 'ఇవి సాధారణ ప్రజా ఆందోళనలు కావని చెప్పారు ఎఎస్‌జి రాజు. హింసతో కూడిన సమన్విత ప్రణాళిక అని, అంతర్జాతీయ మీడియాలో ఇమేజ్ క్రియేట్ చేసుకునేందుకు అప్పటి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత పర్యటనను ఉపయోగించుకున్నారని చెప్పారు. ప్రభుత్వాన్ని అస్థిరం చేయడం, ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడం, దేశవ్యాప్తంగా గందరగోళాన్ని సృష్టించడమే వీరి యాజమాన్య లక్ష్యమంటూ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ కేసు కేవలం సిఎఎ వ్యతిరేక ఉద్యమం కాదని, మతరంగ ప్రాతిపదికన సమాజాన్ని విభజించే కుట్ర అని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కూడా వాదించారు. నిరసనల పేరుతో దాగి ఉన్న పెద్ద ప్లాన్ ఇదని తెలిపారు. హింసకు దారి తీసిన సంఘటనలు ఒక్కసారిగా జరగలేదని, నిందితుల మధ్య జరిగిన సంభాషణలు, సమావేశాలు, విభిన్న ప్రాంతాల్లో జరిగిన కార్యకలాపాలు అని ఆయన పేర్కొన్నారు.

## టాప్ 10లో నితీశ్‌కుమార్

### అత్యధిక కాలం ప్రభుత్వాధినేతల జాతీయ స్థాయి జాబితాలో చోటు

**పాట్నా:** దేశంలోని ఏ ముఖ్యమంత్రి కూడా బిహార్‌లో మాదిరిగా అనేకసార్లు ప్రమాణ స్వీకారం చేసి ఉండరు. గురువారం నితీశ్ కుమార్ రికార్డు స్థాయిలో 10వసారి సిఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. 74 ఏళ్ల వయసు ఉన్న నితీశ్ కుమార్ 19 ఏళ్లుగా సిఎం పదవిలో ఉంటూ అత్యధిక కాలం ప్రభుత్వాధినేతల జాబితాలో జాతీయ స్థాయిలో టాప్10 చోటు సంపాదించడం ద్వారా మరో మైలురాయిని సాధించారు.

దీర్ఘకాలం పనిచేసిన ముఖ్యమంత్రుల జాబితా:

* సిక్కిం: పవన్ కుమార్ చామ్లింగ్ (25 సంవత్సరాలకు పైగా) డిసెంబర్ 12, 1994 – మే 26, 2019.
* ఒడిశా: నవీన్ పట్నాయక్ (24 సంవత్సరాలకు పైగా) మార్చి 5, 2000– జూన్ 11, 2024.
* పశ్చిమ బెంగాల్: జ్యోతి బసు (23 సంవత్సరాలకు పైగా) జూన్ 21, 1977 –నవంబర్ 5, 2000.
* అరుణాచల్ ప్రదేశ్: గెగాంగ్ అపాంగ్ (22 సంవత్సరాలకు పైగా) జనవరి 18, 1980 – జనవరి 19, 1999; ఆగస్టు 3, 2003 –ఏప్రిల్ 9, 2007.
* మిజోరాం: లాల్ థన్హావ్లా (22 ఏళ్లకు పైగా) మే 5, 1984– ఆగస్టు 21, 1986; జనవరి 24, 1989 – డిసెంబర్ 3, 1998; డిసెంబర్ 11, 2008 – డిసెంబర్ 15, 2018.
* హిమాచల్ ప్రదేశ్: వీరభద్ర సింగ్ (21 సంవత్సరాలకు పైగా) ఏప్రిల్ 8, 1983 – మార్చి 5, 1990; డిసెంబర్ 3, 1993 – మార్చి 24, 1998; మార్చి 6, 2003 – డిసెంబర్ 30, 2007; డిసెంబర్ 25, 2012 – డిసెంబర్ 27, 2017.
* త్రిపుర: మాణిక్ సర్కార్ (19 ఏళ్లకు పైగా) మార్చి 11, 1998– మార్చి 9, 2018
* బిహార్: నితీష్ కుమార్ (సుమారు 19 ఏళ్లు) మార్చి 3, 2000, మార్చి 11, 2000 నుండి; నవంబర్ 24, 2005, మే 20, 2014 నుండి, ఫిబ్రవరి 22, 2015, నవంబర్ 19, 2025 వరకు.
* తమిళనాడు: ఎం కరుణానిధి (18 ఏళ్లకు పైగా) ఫిబ్రవరి 10, 1969 – జనవరి 31, 1976; జనవరి 27, 1989 – జనవరి 30, 1991; మే 13, 1996 – మే 14, 2001; మే 13, 2006 – మే 16, 2011.
* పంజాబ్: ప్రకాష్ సింగ్ బాదల్ (18 ఏళ్లకు పైగా) మార్చి 27, 1970 – జూన్ 14, 1971; జూన్ 20, 1977 – ఫిబ్రవరి 17, 1980; ఫిబ్రవరి 12, 1997 – ఫిబ్రవరి 26, 2002; మార్చి 1, 2007 – మార్చి 16, 2017.

## ఎర్రకోట పేలుడు కేసు...
## కస్టడీలోకి వైద్యులు, మత బోధకుడు



**న్యూఢిల్లీ :** ఢిల్లీ ఎర్రకోట వెలుపల జరిగిన ఘోర కారు పేలుడు కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) విచారణ ముమ్మరంగా కొనసాగుతోంది. ఈనెల 10న జరిగిన పేలుడు ఘటనలో 15 మంది ప్రాణాలు కోల్పోగా, అందులో కీలక పాత్ర పోషించినట్లు గుర్తించిన ముగ్గురు వైద్యులు, ఒక మత బోధకుడిని గురువారం కస్టడీలోకి తీసుకున్నట్లు ఎన్ఐఎ అధికారులు తెలిపారు. జమ్మకశ్మీర్ పోలీసులు ముందుగా అరెస్ట్ చేసిన డాక్టర్లు ముజమ్మిల్ గనై, అదీల్ రాథర్, షాహీనా సయీద్‌తో పాటు మౌల్వీ ఇర్ఫాన్ అహ్మద్ వాగేయ్‌ను ఇప్పుడు ఎన్ఐఎ కస్టడీలోకి తీసుకుంది. ఆ నలుగురు కూడా ఎర్రకోట పేలుడు కుట్రలో ప్రముఖ పాత్ర పోషించినట్లు కేంద్ర ఏజెన్సీ పేర్కొంది. ఇప్పటికే ఈ కేసులో అమీర్ రషీద్ అలీ, జాసిర్ బిలాల్ వాని (అలియాస్ దానిష్) అనే ఇద్దరిని ఎన్ఐఎ అరెస్ట్ చేసింది. దీంతో మొత్తం అరెస్టుల సంఖ్య ఆరుగురికి చేరింది. పేలుడు జరిగిన ఐ–20 కారు డ్రైవర్ డాక్టర్ ఉమర్–ఉన్–నబీ, ఆ వాహనాన్ని అమీర్ రషీద్ అలీ పేరు మీద కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైంది. జాసిర్ వానిని ఉమర్ ఆత్మాహుతి బాంబర్‌గా మారమని ఒప్పించే ప్రయత్నం చేసినట్టు తెలిసింది. అయితే అతడు అంగీకరించక పోయినా, నిషేధిత జైషే మహ్మద్ కోసం ఓవర్‌గ్రౌండ వర్కర్‌గా పనిచేయడానికి సిద్ధపడ్డాడని విచారణలో బయటపడింది. ఢిల్లీ పేలుడు కేసుతో బట్టబయలైన 'వైట్ కాలర్ టెరర్ మాడ్యూల్'లో వైద్యులు విద్యాసంస్థలతో సంబంధం ఉన్న వ్యక్తులు భాగమైనట్టు అధికారులు చెబుతున్నారు. హైదరాబాద్, ఉత్తర్‌ప్రదేశ్, హర్యానాలోని పోలీసులతో కలిసి చేసిన దర్యాప్తులో ఫరీదాబాద్‌లోని అల్ ఫలాహ్ విశ్వవిద్యాలయంలో భారీగా 2,900 కిలోల విస్ఫోటక ద్రవ్యాలు స్వాధీనం కావడం చర్చనీయాంశంగా మారింది. అక్టోబర్ 18–19 తేదీల మధ్య రాత్రి శ్రీనగర్ వెలుపల గోడలపై నిషేధిత జైషే మహ్మద్ పోస్టర్లు కనిపించడం నుంచే కథ ప్రారంభమైంది. వీటిలో భద్రతా సిబ్బందిపై దాడులు జరిగేదని హెచ్చరికలు ఉండటంతో, శ్రీనగర్ పోలీస్ అధికారి జీవీ సందీప్ చక్రవర్తి దీనిని సీరియస్‌గా తీసుకున్నారు. సిసిటివి ఫుటేజీ ఆధారంగా అరెస్ట్ చేసిన ముగ్గురు యువకులు అరిఫ్ నిసార్ డార్ (సాహిల్), యాసిర్–ఉల్–అష్రఫ్, మక్సూద్ అహ్మద్ డార్ (షాహిద్) పోస్టర్లను అతికించినట్లు బయట పడింది. విచారణలో వారు ఆ పోస్టర్లను షోపియన్‌కు చెందిన మతబోధకుడు మౌల్వీ ఇర్ఫాన్ అహ్మద్ అందించాడని వెల్లడించారు. దీంతో అతడిని అరెస్ట్ చేశారు. ఇర్ఫాన్ అహ్మద్ విచారణే అసలైన పజిల్‌ను పూర్తిగా విప్పింది.

## కశ్మీర్ టైమ్స్ ఆఫీసులో
## ఎకె-47 తూటాలు లభ్యం

**జమ్ము :** జమ్ముకశ్మీర్‌లోని కశ్మీర్ టైమ్స్ మీడియా సంస్థ కార్యాలయంలో పోలీసు విభాగానికి చెందిన స్టేట్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ సోదాలు నిర్వహించింది. సోదాల్లో ఎకె 47 బుల్లెట్లు దొరికాయని పోలీసు వర్గాలు వెల్లడించాయి. గురువారం ఉదయం నుంచి జరుగుతున్న తనిఖీల్లో క్యాట్రిడ్జ్‌లు, పిస్టల్ రౌండ్స్, మూడు గ్రనేడ్ లెవర్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వివరించాయి. దీంతో కశ్మీర్ టైమ్స్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ అనూరాధ భాసిన్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. భారతదేశం, జమ్ముకశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతానికి వ్యతిరేకంగా, వేర్పాటువాదానికి అనుకూల సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఈ సోదాలు చేపట్టారు. ఈ క్రమంలోనే ఆమె కార్యకలాపాలు, సంబంధాలను పరిశీలించడమే దర్యాప్తు లక్ష్యమని పోలీసు వర్గాలు వెల్లడించాయి.

**'మా గళాన్ని అణచివేసేందుకే ఈ ఆరోపణలు'**

మరోవైపు ఈ సోదాలపై కశ్మీర్ టైమ్స్ సీనియర్ ఎడిటర్లు ప్రబోధ్ జమ్వాల్, అనూరాధ స్పందించారు. తమను బెదిరించేందుకు, తమ గళాన్ని అణచివేసేందుకే ఈ ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. తాము మౌనంగా ఉండకుండా త మ పని కొనసాగిస్తున్నామని,తమను లక్ష్యం గా చేసుకున్నారని విమర్శించారు.జమ్ముకశ్మీర్‌కు చెందిన ప్రముఖ మీడియా సంస్థ. 1954లో ప్రచురణను ప్రారంభించి నదీని వేద్ భా సిన్ స్థాపించారు. 1964 వరకు వీకీగా ఉన్న పత్రి క అనంతరం డైలీగా మారింది. అయితే 2023 నుంచి ప్రింట్ ఎడిషన్ నుంచి డిజిటల్ మల్టీమీడియా సంస్థగా మారింది.



సోదాలపై స్పందించిన జమ్ముకశ్మీర్ ఉపముఖ్య మంత్రి

కశ్మీర్ టైమ్స్‌లో సోదాలపై జమ్ముకశ్మీర్ ఉపముఖ్యమంత్రి సురీందర్ చౌదరీ స్పందించారు. ఈ దాడులు మీడియాపై ఒత్తిడి పెంచేందుకు ఉద్దేశపూర్వకంగా చేస్తున్నారా అని ప్రశ్నించారు. ఈ క్రమంలోనే జమ్ములోని మరో పెద్ద మీడియా సంస్థపైనా కీలక వ్యాఖ్యలు చేశారు. 'దర్యాప్తు సంస్థలు వారి పని చేస్తున్నాయి. అయితే ఉద్దేశపూర్వకంగా కొన్ని సంస్థలు లక్ష్యంగా దాడులు చేయకూడదు. ఒకవేళ వారు ఏదైనా తప్పులు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకోవాలి. అంతకానీ వారిపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు దాడులు చేయకూడదు. మీడియా అనేది ప్రజాస్వామ్యంలో నాలుగో ఎస్టేట్. వారిని స్వేచ్ఛగా వదిలిపెట్టాలి. జమ్ములో మరో పెద్ద మీడియా సంస్థ కూడా ఉంది. అక్కడా వార్తలు రాస్తుంటారు. దానిపైనా దృష్టి పెట్టాలి. ఆ సంస్థకు ఎక్కడ నుంచి అంత పెద్ద ప్రకటనలు వస్తాయి? అంత పెద్ద పత్రికను నడిపేందుకు ఎక్కడ నుంచి నగదు వస్తుంది? ఒకవేళ చర్యలు తీసుకోవాలంటే అందరిపైనా చేపట్టాలి.' అని సురీందర్ చౌదరీ అన్నారు.

## రోజుకు 5000 స్పాట్ బుకింగ్‌లే..

### శబరిమలలో భక్తుల రద్దీ దృష్ట్యా టిడిబి కీలక నిర్ణయం



**పతానంతిట్ట :** కేరళలోని శబరిమల అయ్యప్ప ఆలయంలో భక్తుల రద్దీ నేపథ్యంలో ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు (టిడిబి) కీలక నిర్ణయం తీసుకుంది. అయ్యప్ప దర్శనం కోసం రోజువారీ స్పాట్ బుకింగ్‌లను గరిష్టంగా 5,000కు పరిమితం చేసింది. సోమవారం వరకు ఇదే పరిమితి కొనసాగనుంది. కోర్టు ఆదేశాల నేపథ్యంలో అటవీ మార్గం ద్వారా వచ్చే యాత్రికుల సంఖ్యను రోజుకు 5,000కి పరిమితం చేయాలని టిడిబి నిర్ణయించింది. కాగా, మండల మకరవిళక్కు వార్షిక తీర్థయాత్ర నేపథ్యంలో శబరిమలలో నెలకొన్న భక్తుల రద్దీపై కేరళ హైకోర్టు ఆందోళన వ్యక్తం చేస్తూ, ఇచ్చిన ఆదేశాల మేరకు ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. అనియంత్రిత రద్దీ నేపథ్యంలో, దేవస్థానం బోర్డు గతంలో స్పాట్ బుకింగ్‌లను 20,000కి తగ్గించాలని నిర్ణయించింది. పంబాలో రద్దీని తగ్గించడానికి నీలక్కల్ లో మరో ఏడు స్పాట్ బుకింగ్ కౌంటర్లను తెరవాలని కూడా నిర్ణయం తీసుకుంది. అయితే శబరిమలలో నెలకొన్న రద్దీ, ఏర్పాట్లపై వివిధ పిటిషన్లపై విచారణ జరిపింది కేరళ హైకోర్టు. ఈ క్రమంలో రద్దీని పూర్తిగా నియంత్రించడానికి సోమవారం వరకు రోజుకు 5,000 స్పాట్ బుకింగ్ లను మాత్రమే అనుమతించాలని టిడిబిని ఆదేశించింది. యాత్రికుల రద్దీని నియంత్రించడానికి శాస్త్రీయ పద్ధతులను అవలంబించాలని కోరింది.

రద్దీ తగ్గితే రోజుకు 10వేల స్పాట్ బుకింగ్స్

హైకోర్టు ఆదేశాల మేరకు శబరిమలలో భక్తుల రద్దీని నివారించడానికి టిడిబి కీలక చర్యలు తీసుకుంది. పంబాలోని ఒకటి, నీలక్కల్‌లో ఏడు స్పాట్ బుకింగ్ కౌంటర్లను అందుబాటులోకి తెచ్చింది. ఎట్టి పరిస్థితుల్లోనూ హైకోర్టు ఆదేశించినదాని కంటే ఎక్కువ స్పాట్ బుకింగ్‌లు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. సన్నిధానం (ప్రధాన ఆలయ సముదాయం) వద్ద పరిస్థితిని సమీక్షించిన తర్వాత రోజుకు స్పాట్ బుకింగ్ల పరిమితిని 10,000కి పెంచడాన్ని పరిగణలోకి తీసుకుంటామని టిడిబి తెలిపింది. మరోవైపు ఈ నెలాఖరు వరకు మొత్తం వర్చువల్ క్యూ బుకింగ్‌లు ఇప్పటికే పూర్తయ్యాయి.

## నక్సలైట్లు హింసను విడనాడి...
## అభివృద్ధి ప్రధాన స్రవంతిలోకి

**ద్రౌపది ముర్ము: గిరిజన సమాజంలో జన్మించడం గర్వంగా ఉందని ఉద్ఘాటన**

**అంబికాపూర్‌లో 'జన్‌జాతీయ గౌరవ్ దివస్' కార్యక్రమంలో కీలక ప్రసంగం**



**అంబికాపూర్ (ఛత్తీస్‌గఢ్ ):** నక్సలైట్లు హింసా మార్గాన్ని విడనాడి అభివృద్ధి ప్రధాన స్రవంతిలోకి చేరుతున్నారని , కేంద్రం, రాష్ట్రాలు సమయన్వయంతో పనిచేస్తే వామపక్ష తీవ్రవాదాన్ని త్వరలోనే సమూలంగా నిర్మూలించవచ్చని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నొక్కిచెప్పారు. ఆమె గురువారం ఛత్తీస్‌గఢ్ సుర్గుజా జిల్లా కేంద్రం అంబికాపూర్‌లో జరిగిన 'జన్‌జాతీయ గౌరవ్ దివస్' కార్యక్రమంలో ప్రసంగించారు. గిరిజన సమాజాలు ఇతర సామాజిక సమూహాలతో కలిసి దశలవారీగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గిరిజన దిగ్గజం బిర్సా ముండా జయంతిని పురస్కరించుకుని నవంబరు 15న జన్‌జాతీయ గౌరవ్ దివస్‌ను జరుపుకుంటున్నారు. 'ప్రజలు (నక్సలైట్లు) వామపక్ష తీవ్రవాదం (లెఫ్ట్ వింగ్ ఎక్స్‌ట్రీమిజంఎల్‌డబ్ల్యుఇ) మార్గాన్ని విడిచిపెట్టి, ఛత్తీస్‌గఢ్‌తో పాటు దేశవ్యాప్తంగా అభివృద్ధి ప్రధాన స్రవంతిలోకి చేరుతున్నారు' అని రాష్ట్రపతి ముర్ము పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యవస్థీకృత ప్రయత్నాలతో సమీప భవిష్యత్తులోనే వామపక్ష తీవ్రవాదాన్ని నిర్మూలించడం సాధ్యం అవుతుందని రాష్ట్రపతి అన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించడానికి కేంద్రం, రాష్ట్రాలు సంయుక్తంగా చర్యలు తీసుకుంటున్నాయని ఈ ప్రయత్నాలను 'చాలా సంతృప్తికరమైన మార్పు'గా ఆమె అభివర్ణించారు. వివిధ రంగాలలో గిరిజనులు పోషిస్తున్న ఆధిపత్య పాత్రలను ఆమె ప్రధానంగా ప్రస్తావించారు. ఇటీవల నిర్వహించిన బస్తర్ ఒలింపిక్స్‌లో 1,65,000మందికి పైగా పాల్గొన్నారని, ఈ విషయం సంతోషదాయకమన్నారు. 'గిరిజన కథానాయకుల ఆదర్శాలను అనుసరించడం ద్వారా ఛత్తీస్‌గఢ్ నివాసితులు బలమైన స్వావలంభన, వీక్షిత్ భారత్ (అభివృద్ధి చెందిన భారతదేశం)కు అమూల్యమైన సహకారాన్ని అందిస్తారన్న నమ్మకం నాకున్నది' అని రాష్ట్రపతి ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. మహిళలు సమాజాన్ని కాపాడేవారని, పురోగతి సాధిస్తే సమాజం మరింత ముందుకు సాగుతుందని చెప్పారు. ఇటీవల తాను రాష్ట్రపతి భవన్‌లో భారత మహిళా ప్రపంచ క్రికెట్ విజేతల క్రికెట్ బృందంతో సమావేశమైన జ్ఞాపకాలను రాష్ట్రపతి గుర్తుచేసుకున్నారు. గిరిజన క్రికెటర్ క్రాంతి గౌడ్‌ను ముర్ము ఈ సందర్భంగా ప్రస్తుతించారు. క్రాంతిగౌడ్ తన కఠినపరిశ్రమ, అంకితభావంతో జట్టులో స్థానం సంపాదించుకున్నారని తెలియజేశారు. క్రాంతి గౌడ్ దేశవ్యాప్తంగా మహిళలకు ముఖ్యంగా గిరిజన సమాజపు కూతుళ్లకు ఒక విప్లవాత్మక ఉదాహరణగా నిలిచారని ముర్ము చెప్పారు. గిరిజన సమాజాలు ఎల్లప్పుడూ క్రీడలపై ఆసక్తి, సహజ ప్రతిభను కలిగిఉంటాయని, భవిష్యత్తు తరాల కోసం బలాన్ని పెంపొందించడం కొనసాగించాలని పిలుపునిచ్చారు. గిరిజన సమాజంలో జన్మించినందుకు గిరిజన స్త్రీగా తాను ఎంతో గర్వపడుతున్నానని ముర్ము చెప్పారు. గిరిజన వర్గాలను బలోపేతం చేయడానికి కేంద్రం చేస్తున్న కృషిని ఆమె నొక్కిచెప్పారు. భగవాన్ బిర్సాముండా 150వ జయంతి సందర్భంగా కేంద్రం 'ఆది కర్మయోగి అభియాన్'ను ప్రారంభించిందని రాష్ట్రపతి తెలిపారు. దేశవ్యాప్తంగా స్థానిక గిరిజన అభివృద్ధికి తోడ్పడటానికి దాదాపు 20లక్షల మంది వాలంటీర్ల నెట్‌వర్క్‌ను సృష్టించిందని చెప్పారు. ఛత్తీస్‌గఢ్ గవర్నర్ రమేన్ డేకా, ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి, ఇతర రాష్ట్ర మంత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అమెరికాను నిలదీస్తారా? లేదా?

### యుద్ధంలో పాక్ గెలిచిందనడంపై మోదీని ప్రశ్నించిన కాంగ్రెస్



**న్యూఢిల్లీ:** నాలుగురోజులపాటు జరిగిన యుద్ధం (ఆపరేషన్ సిందూర్)లో భారత్‌పై పాకిస్థాన్ సైన్యం విజయం సాధించిందని ఒక 'అమెరికా కమిషన్' తన నివేదికలో పేర్కొనడంపై ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, భారత విదేశీ మంత్రిత్వ శాఖ అభ్యంతరాలు తెలియజేస్తుందా? లేదా? అని కాంగ్రెస్‌పార్టీ నిలదీసింది. ఇది భారతదేశ దౌత్యానికి, దౌత్య కార్యదక్షణకు ఎదురైన మరో వైఫల్యమని పేర్కొంది. కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ గురువారం ఈ మేరకు ఎక్స్ వేదికగా ఒక పోస్టింగ్ పెట్టారు. కమిషన్ నివేదికలోని సంబంధిత పేజీల స్క్రీన్‌షాట్‌లను ఆయన షేర్ చేశారు. భారత్‌పై పాకిస్థాన్ విజయం చైనా ఆయుధాల సామర్థ్యాన్ని తెలియజేస్తున్నాయని కూడా నివేదిక పేర్కొందన్నారు. అమెరికా–చైనా ఆర్థిక,భద్రతా సమీక్షా సంఘం ఆ దేశ చట్టసభ కాంగ్రెస్‌కు వార్షిక నివేదికను సమర్పించింది. అమెరికా సెనెట్‌తోపాటు దిగువసభ హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ సంయుక్తంగా ఈ సమీక్షా సంఘాన్ని ఏర్పాటు చేస్తాయి. ఈ సమీక్షా సంఘంలో 12 మంది స్వతంత్ర్య సభ్యులు ఉంటారు. వీరంతా కలిసి వార్షిక నివేదిక సమర్పించారు. ఈ వార్షిక నివేదికలో భారత్‌పై జరిగిన నాలుగు రోజుల యుద్ధంలో పాకిస్థాన్ విజయం సాధించిందని పేర్కొన్నారని జైరామ్ రమేశ్ తన పోస్టింగ్‌లో పేర్కొన్నారు. ''800 పేజీలతో కూడిన సుదీర్ఘమైన ఈ వార్షిక నివేదిక–2025ను అమెరికా కాంగ్రెస్‌కు సమీక్షా సంఘం సమర్పించింది. ఈ నివేదికలోని 108, 109 పేజీలలో ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన మనం అర్థం చేసుకోవడానికి సాధ్యం కానంతగా ఎంతో దిగ్భ్రాంతి కలిగించే విషయాలు ఉన్నాయి, 2025 ఏప్రిల్‌లో పహల్గామ్‌లో ఉగ్రవాదులు భారత పర్యాటకులపై కాల్పుల దాడి చేశబూరారు. పాకిస్థాన్ రూపొందించిన ఈ దాడిని సమీక్షా సంఘం నివేదిక తిరుగుబాటు దారుల విద్రోహ చర్యగా అభివర్ణించింది, ఇది పాకిస్థాన్ సైన్యం నాలుగు రోజుల యుద్ధంలో భారత్‌పై సాధించిన విజయాన్ని తెలియజేస్తోంది'' అని జైరామ్ రమేశ్ ఎక్స్ వేదికగా తెలియజేశారు. ''ఆపరేషన్ సిందూర్‌ను నేనే అడ్డుకున్నాను అని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వివిధ వేదికల ద్వారా ఇప్పటివరకూ 60 సార్లు ప్రకటించారు. కానీ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పూర్తిగా మౌనం పాటించారు, ఒక్కసారి కూడా దీనిపై స్పందించలేదు, ఇక ఇప్పుడు అమెరికా కాంగ్రెస్ ఏర్పాటు చేసిన ''యుఎస్–చైనా ఎకనామిక్,సెక్యూరిటీ కమిషన్ నివేదిక కూడా పాకిస్థాన్‌కు అనుకూలంగా నే వచ్చిం, ఇది భారతదేశం ఎట్టి పరిస్థితుల్లోనూ సమ్మతించలేనిది, ప్రధానమంత్రి, విదేశీ మంత్రిత్వశాఖ వెంటనే అభ్యంతరాలు తెలియజేయాలి, ఈ నివేదిక దేశ దౌత్యపరమైన కార్యదక్షతకు తీవ్రమైన ఎదురుదెబ్బ తగిలింది, దీనిపై నిరసన తెలియజేయాలి'' ఈ ఏడాది మే నెల 7 వ తేదీ నుండి 10వ తేదీ వరకూ జరిగిన యుద్ధంలో పాకిస్థాన్ ఎక్కువగా చైనా ఆయుధాలపైన, చైనా గూఢచర్యం సహకారంపైనే ఆధారపడింది. ఈ వివాదంపై యావత్ ప్రపంచం దృష్టి కేంద్రీకరించింది. పహల్గామ్‌లో 26 మంది దేశ ప్రజలను కాల్చి చంపినందుకు ప్రతీకారంగా భారత్ యుద్ధం ప్రారంభించింది. గడచిన 50 ఏళ్ళలో ఎన్నడూ లేని విధంగా రెండు దేశాలూ సుదూరంగా ఉన్న పరస్పర భూభాగాలు లక్ష్యంగా దాడులు చేసుకున్నాయి'' అని నివేదిక పేర్కొంది. ''నాలుగు రోజుల యుద్ధంలోఅదేసమయంలో ఈ ప్రచ్ఛన్న యుద్ధంలో ఒక రెచ్చగొట్టే శక్తిగా చైనా పాత్ర కూడా ఉండి ఉండవచ్చు, చైనా తన ఆధునిక ఆయుధ సామర్థ్యాన్ని ప్రపంచానికి ప్రచారం చేసుకోవడానికి ఈ యుద్ధాన్ని ఒక అవకాశంగా తీసుకుని ఉండవచ్చు, భారత్–చైనా మధ్య కొనసాగుతున్న సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో తన రక్షణ రంగ లక్ష్యాలను విస్తరించుకోవచ్చు'' అని నివేదిక పేర్కొంది. అదేవిధంగా జైరామ్ రమేశ్ మరో పోస్టింగ్ పెడుతూ, పదే పదే ట్రంప్ యుద్ధం తానే ఆపానని చెప్పుకోవడాన్ని, దీనిపై మోదీ మౌనం పాటించడాన్ని తీవ్రంగా విమర్శించారు.

## ఉచితంగా 'టెట్ ప్రాక్టీస్' టెస్టులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణాలో టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్2026) పరీక్షకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థుల కోసం 'మెరుపు యాప్' ఉచితంగా ప్రాక్టీస్ టెస్టులను అందిస్తోంది. టెట్ నోటిఫికేషన్ ఇటీవలే విడుదలైన విషయం తెలిసిందే. జనవరి మొదటివారంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో ఈ పరీక్షలు జరగనున్నాయి. ఈ సారి డిఎడ్, బిఎడ్ పూర్తయిన విద్యార్థులతో పాటు, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లు కూడా పరీక్షలో అర్హత సాధించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ప్రిపరేషన్ కు వీలుగా 'మెరుపు యాప్' ఈనెల 21 తేదీ నుంచి డిసెంబర్ 21 వరకు నెల రోజుల పాటు డెయిలీ ప్రాక్టీస్ టెస్ట్ లను అందిస్తోంది. అభ్యర్థులు ఎక్కడి నుంచైనా.. ఏ సమయంలోనైనా.. ఎలాంటి రిజిస్ట్రేషన్, ఎంట్రీ ఫీజులు లేకుండానే ఉచితంగా ప్రాక్టీస్ టెస్ట్‌లో పాల్గొనవచ్చును. టెట్ నూతన సిలబస్ ఆధారంగా, గతంలో టెట్ పరీక్షల ప్రశ్నల సరళికి అనుగుణంగా, నిపుణులైన అధ్యాపక బృందంతో తయారు చేశారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలనే అభ్యర్థులు తమ సెల్ ఫోన్లలో 'మెరుపు యాప్'ను డౌన్ లోడ్ చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

## 'సిగాచి బాధితుల'కు రూ. కోటి పరిహారం ప్రకటన ఏమైంది?: హరీశ్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిగాచి ప్రమాద బాధితులకు ప్రకటించిన కోటి రూపాయల పరిహారం ఇప్పటికీ అందలేదని, బాధిత కుటుంబాలకు వెంటనే న్యాయం చేయాలని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు ఆయన సిఎంరేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలోని 'సిగాచి' పరిశ్రమలో ఘోర ప్రమాదం జరిగి, నాలుగు నెలలు గడిచినప్పటికీ ప్రభుత్వ సాయం అందలేదన్నారు. మృతుల కుటుంబాలకు రూ. కోటి చొప్పున పరిహారం అందిస్తామని సిఎంరేవంత్‌రెడ్డి స్వయంగా ప్రకటించారని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తామని హామీనిచ్చిన విషయాన్ని ఆయన సిఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు. కార్మికులకు రావాల్సిన పిఎఫ్,ఇఎస్ఐ,ఇన్సూరెన్స్ డబ్బులను ,నష్టపరిహారంలో కలిపి లెక్కలు చెప్పడం ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని పేర్కొన్నారు.

## రాజకీయంగా బలహీనపర్చేందుకే అనుమతి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కెటిఆర్‌ను రాజకీయంగా బలహీనపర్చాలనే ఈకార్‌రేసులో గవర్నర్ ప్రాసిక్యూషన్‌కు అనుమతినిచ్చారని బిఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కె.ఆర్.సురేశ్ రెడ్డి ఆరోపించారు. రాజకీయ కక్షతోనే కెటిఆర్ ఇమేజ్‌ను దెబ్బతీసే ందుకు చూస్తున్నారన్నారు.హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి గంగుల కమలాకర్, ఎంపి వద్దిరాజు రవిచంద్రతో కలిసి సురేశ్ రెడ్డి మాట్లాడుతూ షార్ములా ఈ కార్ రేస్ నిర్వహణ మంచి ప్రయత్నమన్నారు. ఐటి పాలసీని చంద్రబాబు మొదలుపెట్టారని, 2004లో వైఎస్ సిఎం అయిన తర్వాత ఐటిని వేరే లెవెల్ కు తీసుకెళ్లారని, బిఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఐటి రంగం మరింత అభివృద్ధి చెందిందని ఆయన వివరించారు. వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ విచారణ విషయంలో చోటా భాయ్ అడగగానే బడే భాయ్ అనుమతినిచ్చారని ఎద్దేవా చేశారు. ఫార్ములా ఈ కార్ రేస్‌లో ఎసిబికి సంబంధం లేదని చెప్పారు. గంగుల కమలాకర్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ఆదేశాన్ని గవర్నర్ పాటించారని, బిఆర్‌ఎస్‌ను అణగదొక్కాలని కా ంగ్రెస్, బిజెపి ఒక్కటయ్యాయని ఆరోపించారు. ఫార్ములా ఈ కార్ రేస్‌లో డబ్బులు ఎక్కడా వృథా కాలేదన్నారు.

ప్రజాపక్షం
శుక్రవారం, 21 నవంబరు

## యథాతథస్థితికే 'సుప్రీం' ఓటు

శాసనసభ ఆమోదించిన బిల్లులపై ఆమోదం లేదా తిరస్కార నిర్ణయం తీసుకునేందుకు గవర్నర్‌లకు, గవర్నర్‌లు నివేదించిన బిల్లులపై రాష్ట్రపతి నిర్ణయానికీ న్యాయవ్యవస్థ కాలావధి నిర్దేశించవచ్చునా? తదితర ప్రశ్నలతో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము పంపిన నివేదనపై ఐదుగురు జడ్జిలతో కూడిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం గురువారం వెలువరించిన 'తీర్పు' రాజ్యాంగ నిర్దేశించిన అధికారాల విభజనను గౌరవిస్తూ యథాతథ స్థితిని సమర్థించినట్లుగా ఉంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వం వహించిన రాజ్యాంగ ధర్మాసనం రాజ్యాంగం అధికరణ 143 కింద ఇచ్చింది తీర్పు కాదు, 'సలహాపూర్వక అభిప్రాయం'. అందువల్ల అది శిరోధార్యం కాదు. అయితే కార్యనిర్వాహకవర్గం, న్యాయవ్యవస్థ, గవర్నర్‌లు, రాష్ట్రపతి భవిష్యత్ వర్తనంపై తీవ్ర పర్యవసానాలతో కూడిన ప్రభావం చూపగలదు. కేంద్రం, రాష్ట్రాల్లోని రాజకీయ పార్టీల నడవడికపై కూడా ప్రభావం చూపుతుంది. రాజ్యాంగ అథారిటీ అయిన సుప్రీంకోర్టు అధికారానికున్న బలం అలాంటిది.

శాసనసభ ఆమోదించిన బిల్లులపై నిర్ణయం తీసుకోవటంలో తమ గవర్నర్ పాటిస్తున్న విపరీత జాప్యాన్ని సవాలు చేస్తూ తమిళనాడు ప్రభుత్వం, ఇతరులు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు డివిజన్ బెంచి(జస్టిస్ జెబి పార్థివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్)2025 ఏప్రిల్ 11న ఇచ్చిన తీర్పును రాజ్యాంగ ధర్మాసనం త్రోసిపుచ్చలేదు. పైగా తమది 'సలహాపూర్వక అభిప్రాయం' మాత్రమే అంది. డివిజన్ బెంచి తీర్పు గవర్నర్‌లు నిర్ణయం తీసుకోవటానికి 3మాసాలు, గవర్నర్‌లు నివేదించిన బిల్లులపై రాష్ట్రపతి నిర్ణయానికి 3 మాసాల కాలావధిని నిర్దేశించింది. అలా చేయకపోతే ఆ బిల్లులు ఆమోదముద్ర పడినట్లుగా పరిగణించబడతాయని చెప్పింది. రాజ్యాంగ పదవుల్లోని గవర్నర్, రాష్ట్రపతికి న్యాయవ్యవస్థ కాలావధులు నిర్ణయించవచ్చునా అని దాఖలైన 'రాష్ట్రపతి నివేదిక'ను సిజెఐ బిఆర్ గవాయ్, జస్టిస్‌లు, సూర్యకాంత్, విక్రం నాథ్, పిఎస్.నరసింహ, అతుల్ ఎస్.చందూరకార్‌లతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం విచారించింది. డివిజన్ బెంచి తీర్పు గవర్నర్‌లు, రాష్ట్రపతి అధికారాలను కోర్టు గుంజుకున్నట్లు అవుతుందని, అది అనుమతించబడదని రాజ్యాంగ బెంచి చెప్పింది. అది రాజ్యాంగంలో పొందుపరిచిన అధికారాల విభజనకు ఉల్లంఘన అవుతుందని స్పష్టం చేసింది. అయితే బిల్లుల విషయంలో రాష్ట్రపతి, గవర్నర్‌ల చర్యలపై కోర్టుల్లో కొట్లాడే వీలులేదని, బిల్లు చట్టం అయినాక మాత్రమే న్యాయసమీక్ష ఉంటుందని, గవర్నర్‌లకు ఆర్టికల్ 361 ఇస్తున్న రక్షణ బిల్లులకు ఆమోదం విషయంలో న్యాయసమీక్ష నుంచి పూర్తి రక్షణ లేదని బెంచి చెప్పింది. ఆర్టికల్ 200 కింద గవర్నర్ 'సహేతుకమైన కాలావధిలో' చర్య తీసుకోకపోతే రాజ్యాంగ కోర్టు పరిమితమైన న్యాయ సమీక్ష చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నది. కచ్చితమైన కాలావధుల నిర్దేశనను తిరస్కరించటం ద్వారా రాజ్యాంగ బెంచి రాష్ట్రపతి, గవర్నర్‌లకు వెసులుబాటు ఇచ్చింది. అంటే దాని అర్థం నిర్ణయం చేయకుండా ఏళ్లతరబడి బిల్లులను తొక్కిపెట్టమని కాదు. రాజ్యాంగ ఆదేశం ప్రకారం గవర్నర్ సహేతుకమైన వ్యవధిలో బిల్లును ఆమోదించాలి లేదా తన అభ్యంతరా లు తెలియజేస్తూ వాటిని పరిశీలించాలని కోరుతూ మంత్రిమండలికి తిరిగి పంపాలి. వాటిని శాసనసభ పరిశీలించవచ్చు, తిరస్కరించవచ్చు. అదే బిల్లును రెండవసారి గవర్నర్ ఆమోదానికి పంపితే దాన్ని ఆమోదించటం మినహా గవర్నర్‌కు మరో మార్గం లేదు. రాజ్యాంగ అంశాలు ఇమిడివున్న బిల్లులను రాష్ట్రపతి పరిశీలనకు నివేదించవచ్చు. అధికారాల విభజనను సమర్థించిన రాజ్యాంగ బెంచి – కోర్టులు తమ పరిధి దాటి కార్యనిర్వాహకవర్గం విధుల్లోకి వెళ్లరాదని చెప్పటం ద్వారా జ్యుడీషియల్ యాక్టివిజాన్ని వ్యతిరేకించింది. దీంతో గవర్నర్ రాజకీయ ఉద్దేశాలతో తొక్కిపెట్టే బిల్లులపై పోరాడే మార్గాలు రాష్ట్రాలకు మూసుకుపోయాయి. సంబంధీకులందరూ దురుద్దేశరహితంగా వ్యవహరిస్తే ఈ సమస్య ఉత్పన్నం కాదు. కేంద్రంలోని పాలకపార్టీ ప్రతిపక్షపార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో తమ చెప్పుచేతల్లో ఉండే వ్యక్తులను గవర్నర్‌లుగా నియమించి, రాజకీయ పనిముట్లుగా వారిని వాడుకోవటం వల్లనే ఈ సమస్య తలెత్తుతున్నది. ప్రజలచే ఎన్నుకోబడిన ప్రభుత్వ అభీష్టానికి గవర్నర్ అడ్డుపడటం ఎంతవరకు ధర్మసమ్మతం అనే వాదన తలెత్తుతున్నది. గవర్నర్‌లు, రాష్ట్రపతి బిల్లుల ఆమోదం జాప్యం చేయటం మొదలిడితే వారి జవాబుదారీతనం ప్రశ్నార్థకమవుతుంది. అటువంటి పరిస్థితి రాష్ట్రాలు–గవర్నర్‌లు, చివరకు రాష్ట్రపతి – కేంద్ర ప్రభుత్వం మధ్య సైతం ఉద్రిక్తత పెంచవచ్చు. అందువల్ల రాజ్యాంగ ధర్మాసనం 'అభిప్రాయం' కేంద్ర–రాష్ట్ర సంబంధాలపై ప్రభావం చూపవచ్చు. అందువల్ల గవర్నర్‌లు కేంద్రం చేతిలో కీలుబొమ్మలుగా కాకుండా సహేతుకమైన వ్యవధిలో నిర్ణయాలు తీసుకుని రాష్ట్ర ప్రభుత్వాలకు సహాయకారిగా వ్యవహరిస్తారని ఆశించుదాం.

# కమ్యూనిస్టు ఉద్యమ ఖిల్లా ఖమ్మం జిల్లా



ఏనుగు వెంకటేశ్వరరావు
ఖమ్మం

**భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 100 సంవత్సరాల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటున్న సందర్భంగా డిసెంబర్ 26న కమ్యూనిస్టు ఉద్యమ ఖిల్లా ఖమ్మంలో ఆ ఉత్సవం ముగింపు సభ జరుపుకుంటోంది. సిపిఐ త్యాగపూరిత చరిత్రను, పోరాటాలను తెలంగాణ రాష్ట్ర ప్రజలకు వివరిస్తూ వారంరోజులుగా ప్రచారం సాగిస్తున్న మూడు జాతాలు నేడు (21వ తేదీ) ఖమ్మం జిల్లాలో ప్రవేశిస్తున్నాయి. ఈ సందర్భంగా ఖమ్మంజిల్లాలో కమ్యూనిస్టుపార్టీ పోరాట చరిత్రను సూక్ష్మంగా గుర్తు చేసే ఈ వ్యాసాన్ని ప్రచురిస్తున్నాం.**
**— సం||**

ఖమ్మం చైతన్య గుమ్మం. ఖమ్మం పేరు చెప్పగానే బలమైన వామపక్ష ఉద్యమం గుర్తుకు వస్తుంది. ఎందరో యోధులు అనన్య త్యాగాలు, పోరాటాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లాను ఎరుపెక్కించారు. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, ఇప్పటి తెలంగాణలోనూ ప్రత్యేక సంస్కృతి, సాంప్రదాయాలు పోరాట నేపథ్యం కలిగిన జిల్లా ఖమ్మం జిల్లా. ఇప్పటికీ సమస్యను పరిష్కరించే స్థాయిలో ప్రజా ఉద్యమాలను నడపగలిగిన సత్తా ఉన్న జిల్లా ఇది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంతాల ముగింపు సభ డిసెంబర్ 26న జరగనుంది. భారత దేశ చరిత్రలో కమ్యూనిస్టు పార్టీకి ఎటువంటి విశిష్ట స్థానం ఉందో కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర లో ఖమ్మం జిల్లాకు అదే స్థానం ఉంది. ఇక్కడి ప్రజల జీవన విధానం కూడా మిగిలిన ప్రాంతాలకు భిన్నమైంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా విశాలమైన అడవులు, విస్తారమైన గనులు, హొయలొలికించే కొండ వాగులు, జీవనదులు లాంటి గోదావరి, కిన్నెరసాని, మున్నేరు, వైరా సహా పలు నదులు ప్రవహిస్తున్నాయి.

తెలంగాణ సాయుధ పోరాట కాలంలో ఇక్కడి ప్రకృతి దళాలకు అండగా నిలిచింది. సామాన్యులు సైతం సాయుధులై పోరాడిన ఈ గడ్డ మీద ఎందరో మహనుభావులు కమ్యూనిస్టు ఉద్యమ బలోపేతంయించి ఆయుధాలను తిరిగి పొందాల్సి వచ్చింది. గణేశ్వరం, వినోబానగర్, మల్లెలమడుగు, తోటపల్లి మొదలైన భూ పోరాటాలలో వేలాదిమంది రైతులు జైళ్లలో బంధించబడ్డారు.

ఒక దశలో ఉమ్మడి రాష్ట్రంలోని జైళ్లు ఖమ్మంజిల్లా పోడు రైతులతో నిండి పోవడంతో విధి లేని పరిస్థితుల్లో ప్రభుత్వం అప్పటి సిపిఐ రాష్ట్ర నాయకులతో ప్రత్యేకంగా చర్చలు జరిపింది. ఆ చర్చల్లో అప్పటి వరకు పోడు నరికి సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇచ్చేందుకు అభ్యంతరం లేదని తెలియజేయడంతో భూ పోరాటాన్ని తాత్కాలికంగా నిలిపివేసి పోడు రైతులకు పట్టాలందించారు. ప్రభుత్వం పోడు నరికితే జైలులో పెడతామని హెచ్చరిస్తే జైళ్లు మాకు కొత్త కాదంటూ పోరాడి భూమిని స్వాధీనం చేసుకున్న చారిత్రిక భూ పోరాట ఘటన ఖమ్మం జిల్లాలోనే జరిగింది.

**ఓ వైపు నవ నాగరికత :** ఒక వైపు నాగరికతకు దూరంగా ఇంకా కొండలు దిగని గిరిజన సంస్కృతి ఉండగా మరో వైపు ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో పరుగులు పెట్టించే విభిన్న పరిస్థితులు ఉన్న జిల్లా ఖమ్మం. ఇక్కడ కమ్యూనిస్టు పార్టీకి ఆది నుంచి ఆదరణ ఉంది. ఖమ్మం జిల్లాలో 1952 తొలి ఎన్నికల్లోనే ఖమ్మం శాసనసభ ద్విసభ్య నియోజక వర్గంగా ఉండగా రెండు స్థానాలను కమ్యూనిస్టులే గెలుచుకున్నారు. 1994 వరకు ఒక్కసారి మినహా కమ్యూనిస్టు అభ్యర్థులే వరుస విజయాలు సాధించారు.

1952లో ఇల్లందు, మధిర, అప్పటి వేంసూరు, భద్రాచలం నియోజక వర్గాలను కమ్యూనిస్టులే గెలుచుకున్నారు. ఇప్పటికీ కమ్యూనిస్టు పార్టీకి ప్రాతినిధ్యం ఉమ్మడి ఖమ్మంజిల్లా నుంచి లభిస్తుండటం విశేషం. ఇటువంటి పోరాట చారిత్రిక నేలపైన కమ్యూనిస్టు పార్టీ శత వసంతాల ముగింపు వేడుకలు జరగనున్నాయి. ఇక్కడ ప్రతి గ్రామానికి ఒక చారిత్రిక నేపథ్యం ఉంది. ఏదో ఒక సమయంలో కమ్యూనిస్టు పార్టీకి సంబంధించి కీలక భూమిక పోషించిన సందర్భాలు అనేకం. ఇప్పటికీ గ్రామ గ్రామాన కమ్యూనిస్టు పార్టీ తన ఉనికిని చాటుతోంది. ఇప్పటికే శత వసంత సభలకు సంబంధించి ప్రచారం విస్తృతమైంది. సభలు, సమావేశాలతో కార్యకర్తలను కార్యోన్ముఖులను చేస్తున్నారు. శత వసంతాల ముగింపు సభ ఒక మైలు రాయిగా నిలిచిపోనుంది.







బొగ్గు గనులకు కేంద్ర స్థానంగా ఉన్న ఖమ్మం జిల్లాలో అనేక సంఘా లు, సంస్థలు పురుడుపోసుకున్నాయి. ఇక్కడి గిరిజన సంస్కృతి పేరెన్నికగన్నది. ఇక్కడి ప్రకృతి సౌందర్యం అలనాటి వాల్మీకి నుంచి నేటి పర్యాటకులను సైతం ఆకట్టుకుంటుంది. కూనవరం మండలంలోని వాలీ సుగ్రీవ గుట్టలు, విశాలమైన గోదావరి, శబరి గోదావరి సంగమం, ప్రకృతి అందాలకు కాణాచిగా నిలుస్తున్నాయి. ఇప్పుడిప్పుడు ప్రభుత్వ పథకాలు గిరిజనుల జీవితాల్లో మార్పులు తీసుకువచ్చాయి. కానీ ఇక్కడి ప్రకృతి కూడా ప్రజా ఉద్యమాలకు దోహదపడింది. నిజాం కాలంలో బొగ్గు గని కార్మికుల నుంచి శ్రమదోపిడీ చేస్తున్న కాలంలో శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా కార్మిక హక్కుల కోసం 942లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌ను స్థాపించారు. కోసం తుదివరకు పని చేశారు. ఒక పక్క రైతాంగ పోరాటాలు మరో పక్క భూ పోరాటాలు సమాంతరంగా జరిగిన నేల ఇది.

**చారిత్రిక భూ పోరాటాలు :** ఖమ్మం జిల్లాలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో చారిత్రిక భూ పోరాటాలు జరిగాయి. ఎక్కడ లేని విధంగా వేలాది మంది భూమి లేని పేదలు పోడు నరికి సాగును ప్రారంభించారు. అరెస్టులు, జైళ్లను సైతం లెక్కచేయలేదు. భద్రాచలం సమీపంలోని తోటపల్లిలో పోడు నరుకుతున్న గిరిజనులను అప్పటి పోలీసులు తుపాకులతో బెదిరించి భూమి నుంచి వెళ్లగొట్టే క్రమంలో పోడు రైతులు ఎదురు తిరిగి పోలీసుల నుంచి తుపాకులను లాక్కున్న చారిత్రిక సన్నివేశం ఇప్పటికి కథలు కథలుగా చెప్పకుంటారు. చివరికి పోలీసులు కమ్యూనిస్టు పార్టీ నాయకులను ఆశ్ర

# కాంగ్రెస్‌కు దూకుడు స్వభావంగల నాయకత్వం అవసరం



ఎస్.కె.జకీర్

తెలంగాణ ఆదర్శంగా కాంగ్రెస్ పార్టీకి వివిధ రాష్ట్రాల్లో దూకుడు స్వభావం కలిగిన నాయకుల అవసరం ఉంది. ఓట్ చోరీ వంటి అంశాలు జనం చెవికెక్కవని బీహార్ ఫలితాలు తేటతెల్లం చేశా యి. కాంగ్రెస్ పార్టీ ఇటీవల జరిపిన ఆత్మపరిశీలనలో గుర్తించిన మరో లోపం స్థానిక సమస్యలు, అంశాలను గుర్తించలేకపోవడం. ఎన్నికల్లో ఓటర్లను అత్యధికంగా ప్రభావితం చేసేవి స్థానికాంశాలే. జాతీయ, అంతర్జాతీయ అంశాలపై విద్యాధికులు తప్ప సామాన్యులు పెద్దగా దృష్టి పెట్టరు. కానీ కాంగ్రెస్ 'అదానీ ముడుపులు – అమెరికాలో కేసు' వంటి అంతర్జాతీయ అంశాలు, సామాన్యుడికి అర్థంకాని అంశాలపై ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తే ఫలితం ఏమీ రాదు. రాష్ట్రాలలో ముఖ్యమైన స్థానిక సమస్యలను మనం మరచిపోకూడదని ఖర్గే వంటి సీనియర్లు అంటున్నారు. "స్థానిక సమస్యలను వివరంగా అర్థం చేసుకోవడం, వాటి చుట్టూ ఒక నిర్దిష్ట ప్రచార వ్యూహాన్ని రూపొందించడం కూడా చాలా ముఖ్యమని" మల్లికార్జున ఖర్గే వాదన. "జాతీయ సమస్యలు, జాతీయ నాయకుల ప్రాతిపదికన మీరు ఎంతకాలం రాష్ట్రాల ఎన్నికలలో పోటీ చేస్తారు"? అంటూ ఆయన ప్రశ్నిస్తున్నారు.

కాగా తరచూ ఎన్నికల ఓటమికి అసలైన కారణాలు ఏంటి..? అనేక రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజాదరణ పొందలేకపోతున్నది. తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో అధికారం చేపట్టగలిగినప్పటికీ అక్కడ ప్రత్యర్థులపై వ్యతిరేకతే ఆ పార్టీని గెలిపించిందన్న విశ్లేషణలున్నవి. అయితే ఒకసారి అధికారం చేపట్టిన రాష్ట్రంలో వరుసగా మరోసారి గెలవలేకపోతోంది. వరుస పరాజయాలతో సతమతమవుతున్న కాంగ్రెస్ పార్టీ తమ ఓటమికి గల అసలు కారణాలను గుర్తించే ప్రయత్నాలు ముమ్మరం చేయవలసి ఉన్నది.

కాంగ్రెస్ పార్టీ అంటేనే అనైక్యతకు మారుపేరు. క్రమశిక్షణారాహిత్యానికి కేరాఫ్ అడ్రస్. నేతలు స్వేచ్ఛగా మాట్లాడుతుంటారు. పార్టీ వైఖరి ఏంటో తెలుసుకోకుండా మాట్లాడుతుంటారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి పదవిని ఆశించి భంగపడ్డ నేతలు వేరు కుంపట్లకు తెరలేపుతూ సొంత ప్రభుత్వాలను, తద్వారా పార్టీని ఇబ్బందులకు గురిచేస్తుంటారు. పార్టీ నిర్ణయాన్ని శిరోధార్యంగా భావించకుండా ధిక్కరిస్తూ అది తమ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యానికి కొలమానంగా చెబుతుంటారు. కానీ భారతీయ జనతా పార్టీలో అంతర్గతంగా ఎన్ని విభేదాలున్నా, స్పర్థలున్న క్రమశిక్షణ పాటిస్తూ పార్టీ నిర్ణయాన్ని శిరసావహిస్తుంటారు. "మనం కఠినమైన క్రమశిక్షణను పాటించడం ముఖ్యం. ప్రతి సందర్భంలోనూ ఐక్యంగా ఉండాలి. పార్టీకి క్రమశిక్షణ అనేది ఆయుధం. కలసికట్టుగా ఉంటేనే గెలుస్తాం. విడిపోతే పడిపోతాం. పార్టీ బలంగానే ఉంటేనే మనం బలంగా ఉంటాం అన్న విషయం ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి" అని ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే వ్యాఖ్యానించారు.

130 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణం గురించి ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఏర్పడింది. పార్టీకి విద్యార్థి విభాగం నుంచి మొదలుపెట్టి, యువజన, రైతు, మహిళ, మైనారిటీ, ఒబిసి.. ఇలా అనేక అనుబంధ సంస్థలు, విభాగాలతో పటిష్టమైన యంత్రాంగం ఏర్పాటు ఉంది. కానీ బిజెపితో పోల్చుకుంటే స్పష్టమైన తేడా ఉంది. ఏ పార్టీలోనైనా పదవులు, అధికారం కోసం కార్యకర్తలు పనిచేస్తుంటారు. కాంగ్రెస్ పార్టీలో ముందు పదవి, ఆ తర్వాతే ఏదైనా అన్న భావన ఎక్కువ. కాంగ్రెస్ పార్టీలో నిస్వార్థంగా అంకిత భావంతో పనిచేసేవారి సంఖ్య చాలా తక్కువ.

ఎన్నికలకు ఏడాది ముందు నుంచే సమర సన్నాహాలు ప్రారంభించాలని కాంగ్రెస్ ఇప్పుడిప్పుడే ఒక నిర్ధారణకు వస్తోంది. కాంగ్రెస్ పార్టీలో అభ్యర్థుల ఎంపిక చివరి క్షణం వరకు జరుగుతూ ఉంటుంది. ప్రత్యర్థులు చాలా ముందుగానే అభ్యర్థులను ప్రకటించి ప్రచార రంగంలోకి దిగి దూసుకెళ్తుంటే, నామినేషన్ల దాఖలు చేయడానికి చివరి తేదీ నాడు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించిన సందర్భాలున్నాయి. ఇవి కూడా పార్టీ ఓటమికి కారణాలుగా అధిష్టానం భావిస్తోంది. పాత విధానాలకు స్వస్తి చెప్పి, ప్రత్యర్థుల కదలికలు, వ్యూహాలను అర్థం చేసుకొని సమయానుకూలంగా ప్రతివ్యూహాలతో రంగంలోకి దిగవలసి ఉన్నది. అట్టడుగున ఉన్న పోలింగు బూత్ స్థాయి నుంచి, బ్లాక్, జిల్లా, రాష్ట్రం, ఎఐసిసి వరకు కొత్త సంకల్పంతో కాలానుగుణంగా మార్పు రావలసి ఉంది. ప్రస్తుత సవాళ్లను అధిగమించి ముందుకు సాగవలసి ఉన్నది.

కాగా, 'బీహార్‌కి మజ్‌బూరి హై, నితీశ్‌కుమార్ జరూరి హై' నినాదం 2017 నాటిది. అంటే 'బీహార్ నిస్సహాయంగా ఉన్నది, నితీశ్‌కుమార్ నాయకత్వం అవసరం' అన్నది తెలుగులో అనువాదం. ఈ ఆకర్షణీయ నినాదానికి కాంగ్రెస్ పార్టీ విరుగుడు కనిపెట్టలేకపోయింది. బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో అధికార కూటమికి 202 సీట్లు లభించగా ప్రతిపక్ష కూటమి మహాగట్ బంధన్‌కు 35 సీట్లు మాత్రమే లభించాయి. నితీశ్ కుమార్‌కు కాంగ్రెస్, ఆర్‌జెడి ప్రచారం చేసినంతగా ప్రభుత్వ వ్యతిరేకత లేదు. తేజస్వి యాదవ్ ఎన్నికల ప్రచారానికి కొత్త శక్తినిచ్చారు కానీ, తన ఆకర్షణ శక్తిని రాష్ట్రీయ జనతాదళ్ సంప్రదాయక ఓటుబ్యాంకు పరిధి ఆవలకు విస్తరింపజేయలేకపోయారు. ప్రధాని నరేంద్ర మోదీ ఓటర్లతో మమేకమవడం, ఓటర్లు ఆయన ఆకర్షణ శక్తిలో మునిగిపోయారు. రాహుల్ గాంధీ ఓట్ చోరీ, నిరుద్యోగం వంటి అంశాలపై జరిపిన ప్రచారం ఫలించలేదు.

పదిహేను సంవత్సరాల లాలూప్రసాద్ యాదవ్, ఆయన భార్య ప్రభుత్వాల పాలన (1990–2005)ను 'జంగిల్ రాజ్'గా బిజెపి, జెడియు చేసిన ప్రచారం ప్రభావం చూపింది. ఆ ప్రభుత్వాన్ని ప్రజలు దించివేసినప్పుడు తేజస్వి యాదవ్ కు 16 సంవత్సరాల వయస్సు కూడా లేదు. కానీ జంగిల్ రాజ్ కు ఆయనే కారణమన్నంతగా బిజెపి ప్రచారం చేసింది. నితీశ్ పాలనా వైఫల్యంపై ప్రజల్లో నిరసన కానరాలేదు!

పోలింగ్ తేదీలు ప్రకటించడానికి పది రోజుల ముందు 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన'ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం దృష్టి పెట్టలేదు. పోలింగ్ తేదీలు ప్రకటించడానికి ముందు నగదు బదిలీ మొదలైంది. ప్రతి కుటుంబంలో ఒక్కో మహిళకు రూ.10 వేల చొప్పున పంపిణీ చేశారు. ఏ దశలోను ఎన్నికల సంఘం ఇందుకు అభ్యంతరం చెప్పలేదు. రూ.10వేల నగదు బదిలీ ఓటర్లకు లంచంగా ఇవ్వడమేనని అందరికీ తెలుసు. తమిళనాడులో రైతులకు నగదు మద్దతు పథకం మార్చి 2003లో ప్రారంభమయింది. 2004లో లోక్‌సభ ఎన్నికల తేదీలను ప్రకటించగానే ఆ పథకం అమలును ఎన్నికల సంఘం నిలిపివేసింది. ఉచిత కలర్ టివి పథకం 2006 నుంచి అమల్లో ఉన్నది. 2011లో అసెంబ్లీ ఎన్నికల ప్రకటన వెలువడగానే ఉచిత కలర్ టివిల పంపిణీని నిలిపివేశారు.

ఐదు సంవత్సరాల క్రితం కొత్త తరం బిహారీ రాజకీయ నాయకుడు చిరాగ్ పాశ్వాన్‌ను ప్రోత్సహించడం ద్వారా నితీశ్ స్థాయిని తగ్గించేందుకు బిజెపి ప్రయత్నించింది. నితీశ్ ప్రాధాన్యాన్ని తగ్గించడం ద్వారా జనతాదళ్ (యునైటెడ్) పార్టీ ఓటర్లను తనవైపు తిప్పుకోవాలన్నది బిజెపి ఎత్తుగడ. ఈ వ్యూహం దాదాపుగా ఫలించింది. నితీశ్‌కుమార్ అపరచాణక్యుడు. బిజెపి ఎత్తుగడలను అర్థం చేసుకున్నారు ఆ పార్టీతో పొత్తును కొనసాగించడం ప్రమాదకరమని భావించారు.

మహారాష్ట్రలో శివసేనను నిలువునా చీల్చివేసిన రీతిలో బీహార్‌లో తన పార్టీని బిజెపి చీల్చకుండా ఉంటుందా అని నితీశ్ ఆలోచించారు. 2022లో బిజెపితో తెగతెంపులు చేసుకుని ప్రతిపక్ష కూటమి 'ఇండియా'లో చేరారు. అయితే జాతీయ స్థాయిలో అగ్రగామి నాయకుడుగా ఎదగాలన్న తన ఆకాంక్ష నెరవేరేందుకు ఇండియా కూటమి సహకరించదనే భావన ఆయన మనసును తొలిచివేసింది. దీంతో గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఒక శుభదినాన మరలా బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏలో చేరారు. ప్రజా జీవితంలో నైతిక విలువలకు నిబద్ధమైన నేతగా పేరుపొందిన నితీశ్‌కుమార్ ఇప్పుడు తన రాజకీయ మనుగడను కాపాడుకోవడంపైనే దృష్టి పెట్టారు. సైద్ధాంతిక విశ్వాసాల స్థానంలో అవకాశవాద రాజకీయాలు ప్రబలిపోయాయి.


పలు ఇతర రాష్ట్రాలలో తమ మిత్రపక్షాలను బిజెపి శాసిస్తోంది. తన నిర్ణయాలను ఆ పార్టీలపై రుద్దుతోంది. ఆ మిత్రపక్షాల నాయకులను బహిరంగంగా చిన్నబుచ్చుతోంది. అయితే బిహార్‌లో సుదీర్ఘకాలంగా ముఖ్యమంత్రిగా ఉన్న నితీశ్ జోలికి ఏ విధంగానూ పోయేందుకు బిజెపి సాహసించలేదు. బహిరంగంగాను, అంతర్గతంగాను సీనియర్ నాయకుడుగా ఆయన్ని గౌరవిస్తోంది. ఇతర హిందీ రాష్ట్రాలలో వలే బిహార్‌లో విశ్వసనీయమైన వెనుకబడినవర్గాల నాయకత్వాన్ని పెంపొందించుకోవడంలో బిజెపి బాగా వెనుకబడిపోయింది.

2029 సార్వత్రిక ఎన్నికలకు ఇంకా వ్యవధి ఉన్నప్పటికీ ప్రస్తుత దశలో నితీశ్‌ను తొలగించడం తమ భవిష్యత్తుకు శ్రేయస్కరం కాదని బిజెపి భావించినందువల్ల నితీశ్‌కుమార్ కు మార్‌లా ముఖ్యమంత్రి పదవి వరించింది. ప్రాభవ ప్రభావాలను ఎంతగా తగ్గించినప్పటికీ ఆయన గెలుచుకోగల ఓట్ల వాటా చాలా అత్యధికంగా ఉంటుందన్న వాస్తవాన్ని బిజెపి అర్థం చేసుకున్నది.

ఇదిలా ఉండగా రాహుల్ ఓట్‌చోరీ ఆరోపణలు, ఓట్ అధికారయాత్రలు జనాన్ని ఆకర్షించాయి కానీ, ఓటు వేయించలేకపోయాయి. అంబానీ, అదానీలపై ఆరోపణలు జనానికి పట్టలేదు. నితీశ్, మోదీలమీద చేయాల్సిన యుద్ధం ఎన్నికల సంఘం మీదకు మళ్లిపోవడంతో ప్రజలకు విషయం ఎక్కలేదు, ఫలితం దక్కలేదు. బిజెపికి సంస్థాగతంగా ఉన్న అనేక బలాలు బిహార్‌లో కాంగ్రెస్‌కు లేకపోవడం పెద్ద దెబ్బ.

పదిహేనేళ్ళలో ఎన్నడూ లేనంత ఘోర పరాజయం పొందిన ఆర్జేడీ పని ఇక సరి అంటున్న వారికి, తనకు బిజెపి, జెడియులకంటే ఎక్కువ ఓట్లు వచ్చిన విషయాన్ని తేజస్వి సగర్వంగా గుర్తుచేయవచ్చు. ఓటువాటా తనకూ తగ్గలేదని కాంగ్రెస్ సైతం చెప్పుకోవచ్చు. మహాగట్బంధన్‌కు, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీకి చొరవతో పనిచేసే నాయకత్వం, పై నుంచి పోలింగ్ బూత్ స్థాయి వరకు నిర్మాణాన్ని స్థిరపచుకోవటం కొత్త సామాజిక తరగతులను ఆకట్టుకోవటం ఎంతైనా అవసరం.

# సైన్సే నా మతమన్న రామన్



పారదర్శకంగా ఉన్న ఘన లేదా ద్రవ లేదా వాయు పదార్థాల గుండా కాంతిని ప్రసరించేటప్పుడు అది తన స్వభావాన్ని మార్చుకుంటుంది. సూర్యుని నుంచి వెలువడే తెలుపురంగు కాంతి వాయువులోని అణువులపై పడి, వాటి ప్రయాణ దిశను మార్చుకుంటాయని తన పరిశోధనల ద్వారా రుజువు చేశారు. వస్తువు మీద కాంతి కిరణం పడితే అది పరివర్తనం చెందుతుందని 1928 ఫిబ్రవరి 28న రామన్ తొలిసారిగా ప్రకటించారు. దీనినే రామన్ ఎఫెక్ట్ అంటారు. నోబెల్ బహుమతి అందుకున్న తొలి భారతీయ శాస్త్రవేత్త సివి రామన్.. నవంబర్ 7, 1888 తమిళనాడులోని తిరుచురాపల్లిలో జన్మించారు. తండ్రి చంద్రశేఖర్ అయ్యర్, తల్లి పార్వతి అమ్మాళ్. తండ్రి విశాఖపట్నంలోని ఎవిఎన్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేయడంవల్ల రామన్ బాల్యం, విద్యాభ్యాసం అక్కడే జరిగింది. అనంతరం మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజీలో చేరి 19 ఏళ్లకు ఫిజిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. ఆ తర్వాత తల్లిదండ్రుల కోరిక మేరకు ఐసిఎస్ పాసై కలకత్తా ప్రభుత్వ ఆర్థికశాఖలో డిప్యూటీ అకౌంటెంట్ జనరల్‌గా చేరారు.

సముద్రం నీరు నీలి రంగులో ఎందుకుంటుంది? ఈ అంశంపై రామన్ చేసిన ప్రయోగం ఓ సంచలనం. అనేక అద్భుతాలకు వేదికగా నిలిచింది. ఈ అంశంపై ఎన్నో పరిశోధనలు ఆయన చేశారు. ఈ ప్రయోగాలే ఆయనను నోబెల్ చెంతన నిలబెట్టాయి. శబ్దశాస్త్రం నుంచి తన పరిశోధనలు కాంతి శాస్త్రం వైపు మళ్లాయి. ఇంగ్లాండు నుంచి తన తిరుగు ప్రయాణంలో ఓడలో ప్రయాణిస్తున్నపుడు ఆకాశం, సముద్రం నీరు రెండింటికి నీలిరంగు ఉండటం ఆయనను ఆలోచింపజేసింది.

అప్పటిదాకా అందరూ అనుకుంటున్నట్లు సముద్రపు నీలి రంగుకు కారణం ఆకాశ వర్ణం సముద్రం మీద ప్రతిఫలించడం కాదు. సముద్రపు నీటి గుండా కాంతి ప్రవహించేటప్పుడు అది పరిక్షేపణం చెందడమే కారణమని ఊహించారు. తన పరికల్పలను నిరూపించడానికి ద్రవాలు, వాయువులు, పారదర్శక ఘనపదార్థాలు కాంతి పరిక్షేపణం గురించి పరిశోధనలు చేశారు.

1970లో, ప్రయోగశాలలో పనిచేస్తున్నపుడు అతనికి గుండెపోటు వచ్చింది. 1970 నవంబర్ 21న రామన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో తుదిశ్వాస విడిచారు. భారతదేశం నుండి వచ్చిన గొప్ప దిగ్గజాలలో డాక్టర్ సివి రామన్ ఒకరు, అతని కృషి, సంకల్పం భారత దేశం గర్వించేలా చేసింది. భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతిని అందుకున్న మొదటి భారతీయుడు అయ్యాడు. ఒక వ్యక్తి తన కోరికలను నెరవేర్చుకోవాలనుకుంటే ఎవరూ ఆపలేరని నిరూపించాడు. సైన్స్‌పై అతని ఆసక్తి, పరిశోధన పని పట్ల అంకితభావం అతన్ని రామన్ ప్రభావాన్ని కనుగొనేలా చేసింది.అతను గొప్ప శాస్త్రవేత్త, భౌతిక శాస్త్రవేత్త మరియు నోబెల్ బహుమతి గ్రహీతగా ఎప్పటికీ గుర్తుండిపోతాడు.

ఉదయాకాశంలోని వెలుగుల్లో చెట్లు ఎంత అందంగా కనబడతాయో మీరు ఎప్పుడైనా గమనించారా? నాకు వీటిని చూస్తూ ఉంటే స్ఫటిక నిర్మాణం గురించిన ఆలోచనలు వస్తుంటాయి.. అందుకే 'విజ్ఞానం అత్యుత్తమైన సృజనాత్మక కళారూపం' అని రామన్ ఎప్పుడూ చెబుతుండే వారు. సైన్స్ తన మతం అని ఆయన గట్టిగా చెప్పారు.

ఎం. రాం ప్రదీప్

# బహుళ ప్రయోజనాల గృహ వేదిక టెలివిజన్

21వ శతాబ్దంలో టెలివిజన్ (టివి) ప్రయోజనం ఏమిటి? డిజిటల్ యుగపు టివి ద్వారా దృశ్య శ్రవణ సమాచార వితరణ, కేబుల్ ప్రసారాల వడ్డింపు మాత్రమే కాకుండా మల్టీమీడియా పాత్ర, వీడియో, మ్యూజిక్, ఇంటర్నెట్ అనుసంధాన ప్రయోజనాలు అనేకం కలిగి ఉంటున్నది. సామాన్య మానవుడి వినోద, విజ్ఞాన, వార్తా ప్రసారాల వేదికగా ప్రతి ఇంట్లో కనీస అవసరంగా మారింది టెలివిజన్ బాక్స్. టివిని విచక్షణారహితంగా వాడితే వ్యక్తి పతనానికి కూడా కారణం అవుతున్నది. భారత్‌లో దాదాపు 350 మిలియన్ల కుటుంబాలు ఉండగా, అందులో 230 మిలియన్ల కుటుంబాలు (70 శాతం కుటుంబాలు)టెలివిజన్ ప్రసారాలు చూడడం జరుగుతుంది. టివి ప్రయోజనాలను గుర్తించిన ఐరాస ప్రతి ఏట 21 నవంబర్ రోజు ప్రపంచ టెలివిజన్ దినోత్సవం (వరల్డ్ టివి డే) పాటించడం కొనసాగుతున్నది. 2025 ప్రపంచ టివి దినం ఇతివృత్తంగా అత్యంత నమ్మకమైన నేస్తం సమాచారం, సాధికారత, అనుసంధానం అను అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రజలను ప్రభావితంచేసే విభిన్న సమస్యలను ప్రదర్శించడంలో టివి ప్రధాన భూమికను పోషిస్తున్నది. టివి ప్రసారాలు వివిధ సంస్కృతులను ఏకం చేయడం, ప్రపంచ వార్తలను క్షణాల్లో మన ఇంటికి చేర్చడం, విద్య బోధన, వినోదాల వడ్డింపు, సమాచారాన్ని చేరవేయడం, ప్రజలను అనుసంధానం చేయడం, మీడియా లిటరసీ, సామాజిక అభివృద్ధి, బ్రేకింగ్ న్యూస్ రూపంలో తాజా వార్తలను అందించడం, సాంస్కృతిక వినిమయం, ఆర్థిక ప్రగతికి బాటలు వేయడం, సాంస్కృతిక వికాసం, క్రీడల వృద్ధి, వినూత్న ప్రయోగాల క్షేత్రం లాంటి బహుళ ప్రయోజనాలను కలిగి ఉంటుంది. టివీ ఆవిష్కరణలో ప్రధాన భాగంగా జాన్ లోగీ బైర్డ్, ఫిలో ఫెన్స్వర్థ కృషి మరువలేనిది. అత్యం త శక్తివంతమైన మాధ్యమంగా టివి నేడు ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నది. యువతకు ప్రేరణ అందించడం, పలు అంశాల్లో అవగాహన కల్పించడం, ప్రపంచ దర్శనానికి కిటికీ వలె టివి నిలుస్తున్నది. సమాజాన్ని సమన్వయ పరచడంతో పాటు సమాజ అద్దంగా టివి నిలువెత్తు రూపం నిలుస్తున్నది. ప్రజాభిప్రాయాన్ని సమీకరించడం, సాంస్కృతిక వైవిధ్యాలను ప్రోత్సహించడం, దేశాల మధ్య సంబంధాలను పెంపొందించడం, పేదరిక నిర్మూలన లాంటి బహుళ ప్రయోజనాలు కలిగిన టివి లేని ఇళ్లు లేదని అవగతం అవుతున్నది.

**(21 నవంబర్ ప్రపంచ టెలివిజన్ దినోత్సవం సందర్భంగా)**

డాక్టర్ బిఎం.రెడ్డి, 9949700037

## ప్రభుత్వ పాఠశాలలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు



**ప్రజాపక్షం/వికారాబాద్ రూరల్ :** వికారాబాద్ మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మదన్‌పల్లి గ్రామ పంచాయతీలో ఆశ్రయ్ ఆకృతి ఫౌండేషన్ హైదరాబాద్ విద్యార్థులకు డాక్టర్ శివరాం నేతృత్వంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. చెవి,గొంతు సమస్యలు ఉన్న విద్యార్థులకు తగిన వైద్యసహాయం అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాదయ్య మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని సేవా దృక్పథం నేటి సమాజానికి అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య బృందం నరేంద్ర , భూమిక, శిల్ప భవాని, దీపిక, పాఠశాల ఉపాధ్యాయులు పాండు, తాజోద్దీన్, లక్ష్మయ్య, శ్రీనివాస్‌రెడ్డి,విద్యార్థులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల నిధుల కేటాయింపుకు వినతి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తూ వేగంగా పూర్తయ్యేలా చూడాలని స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి కోరారు. గురువారం ఆయన జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. నియోజకవర్గంలోని మచ్చ బొల్లారం డివిజన్‌లోని చెరువుల పరిరక్షణ, అభివృద్ధి, బ్యూటిఫికేషన్ పనులు, ఎఎస్ రావునగర్ రోడ్డు పనులు త్వరగా చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తేవటం, సిఆర్‌పిఎఫ్ రోడ్డును మల్కాజిగిరి నియోజకవర్గంలో చేపట్టటం, సిసి రోడ్లు, బాక్స్‌డ్రైన్లు, పార్కుల అభివృద్ధి వంటి మౌలిక సదుపాయాలను పెంపొందించటం లాంటి విషయాలపై ఎమ్మెల్యే ప్రతిపాదనలు సమర్పించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



## 24న కొడంగల్‌కు ముఖ్యమంత్రి రాక

**ప్రజాపక్షం/వికారాబాద్ :** ఈ నెల 24న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొడంగల్‌కు వస్తున్న సందర్భంగా కొడంగల్ మున్సిపల్ పరిధిలోని ఎంకేపల్లి గ్రామ శివారులో రెండు ఎకరాల భూమిలో అక్షయ పాత్ర కిచెన్ షెడ్‌కు భూమిపూజ కోసం స్థలాన్ని జిల్లా ఎస్పీనారాయణ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో చర్చించి ఇట్టి స్థలానికి సంబంధించిన మ్యాప్ ను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం హకీంపేట్ శివారు నందు ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ కలెక్టర్ హర్ష్ చౌదరి, కొడంగల్ ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, డిఎస్‌పి శ్రీనివాస్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



## మచ్చబొల్లారంలో మాడల్ స్మశానవాటిక

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** మచ్చబొల్లారం డివిజన్ సంజీవరెడ్డి గార్డెన్ సమీపంలో ఉన్న స్మశాన వాటికను మాడల్ ముక్తధామం స్మశానవాటికగా పూర్తి సౌకర్యాలతో కోటి 90 లక్షల రూపాయల వ్యయంతో తీర్చిదిద్దుతున్నామని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి బొల్లారం కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్‌లు తెలిపారు. మచ్చబొల్లారం, ఆల్వాల్, రిసాలాబజార్, కంటోన్మెంట్ తదితర ప్రాంతవాసులకు ఉపయోగపడే ఈ స్మశానవాటికలో కొత్త ఆధునిక ప్రవేశ ఆర్చి నిర్మాణం, మహిళలు, పురుషుల కోసం వేర్వేరుగా బాత్‌రూంలు, వాష్‌రూంలు, డ్రైనేజి సౌకర్యం, ప్రార్థనా గది, కొత్త దహనవేదికల నిర్మాణం, కొత్త గ్యాలరీల నిర్మాణం, ధ్యాన గది, కాపలాదారుడి గది, మౌలిక సదుపాయాలతో పాటు సుందరీకరణ పనులు మాడల్ స్మశాన వాటికలో తీర్చిదిద్దుతామని మైనంపల్లి తెలిపారు. దీని కోసం నిధులు మంజూరు చేయించిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లిని సత్కరించారు.




## ఫైనాన్స్ లిట్రసీపై విద్యార్థులకు అవగాహన

**ప్రజాపక్షం/దుండిగల్:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బౌరంపేటలో ఫైనాన్సు లిటరసీ పైన విద్యార్థులకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సయ్యద్ రుక్సానా, అసిస్టెంట్ మేనేజర్ యూనియన్ బ్యాంకు గండి మైసమ్మ పాల్గొని విద్యార్థులకు ఫైనాన్స్ లిట్రసిపైన అవగాహన కల్పించారు. ప్రధానంగా బ్యాంకింగ్ సేవలు, పొదుపు ఖాతాల నిర్వహణ ప్రాధాన్యత, ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఆన్లైన్ సేవలు, సైబర్ మోసాలు, ఆన్లైన్ గేమ్స్ వలన జరిగే నష్టాలు తదితర అంశాలపై విద్యార్థులకు స్పష్టంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.రామ్‌రెడ్డి, ఉపాధ్యాయులు ధన్ రాజ్, జయంతి, రేణుక, రాజు, లక్ష్మీనరసమ్మ, మల్లేశప్ప, తదితరులు పాల్గొన్నారు.



## ఎఐసిసి కార్యదర్శి జెట్టి కుసుమ్ కుమార్‌కు ఘన సత్కారం

**కూకట్‌పల్లి/ప్రజాపక్షం :** అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) కార్యదర్శిగా, ఒడిశా రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జీగా నియమితులైన సీనియర్ నాయకుడు జెట్టి కుసుమ్ కుమార్‌ను గురువారం కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య నాయకులు కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ పటిష్టత కోసం నిరంతరం కృషి చేస్తున్న జెట్టి కుసుమ్ కుమార్‌కు జాతీయ స్థాయి బాధ్యతలు దక్కడం పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఒడిశా రాష్ట్ర ఇన్‌చార్జీగా ఆయన తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి, పార్టీకి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ మాజీ అధ్యక్షులు శేరి సతీష్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గొట్టిముక్కల జశ్వంత్‌రావు, సంజీవరావు, మాజీ ఉపాధ్యక్షురాలు రేష్మ, రాజేష్‌గౌడ్, మాకదూమ్, శ్రీధర్‌చారి, తదితరులు పాల్గొన్నారు.

## పెద్దేముల్ నూతన ఎస్‌ఐగా శంకర్

**ప్రజాపక్షం/పెద్దేముల్:** పెద్దేముల్ మండల సబ్‌ఇన్‌స్పెక్టర్ కె.వేణుకుమార్‌పై బదిలీ వేటు పడింది. ఈ మేరకు జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి పెద్దేముల్ ఎస్‌ఐ కె. వేణుకుమార్‌ను బదిలీచేస్తూ ఉత్తుర్వులు జారీ చేశారు. అదే ఉత్తర్వులో పెద్దేముల్ నూతన ఎస్‌ఐగా పి.శంకర్‌ను నియమిస్తూ ఉత్తుర్వులు జారీ చేశారు. అయితే గత రెండు రోజుల క్రితం ఓ కేసులో విచారణ పేరుతో అనుమానితుడిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన ఆరోపణలు ఎదుర్కొన్న ఎస్‌ఐ కె. వేణు కుమార్‌పై బదిలీ వేటు పడినట్లు తెలుస్తుంది. వికారాబాద్ సిసిలో విధులు నిర్వహిస్తున్న పి. శంకర్‌ను పెద్దేముల్ మండల నూతన ఎస్‌ఐగా నియమించారు.

# ప్రజల కోసం పోరాడేది...సిపిఐ

### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ



**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నటువంటి బస్సు ప్రచార జాత గురువారం వివిధ జిల్లాలను ముగించుకొని జగద్గిరిగుట్ట గిరినగర్ షాపూర్‌నగర్‌కు వచ్చింది. ఈ జాతాకు భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలివుల్ల ఖాద్రి, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు ఉప్పలయ్య, రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి డిజె నరేంద్ర ప్రసాద్‌లు పాల్గొన్నారు. అనంతరం సిపిఐ కుత్బుల్లాపూర్ మండల సమితి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి, జగద్గిరిగుట్ట గిరి నగర్ షాపూర్ నగర్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్నటువంటి సందర్భంలో దేశవ్యాప్తంగా జయంతి ఉత్సవాలను నిర్వహించుకుని ఖమ్మంలో లక్షలాదిమంది ప్రజలతో బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆ బహిరంగ సభను జయప్రదం చేయడానికి రాష్ట్రవ్యాప్తంగా జాతాలను నిర్వహిస్తూ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి పోరాటాలను ప్రజలకు తెలియజేస్తూ, కమ్యూనిస్టు పార్టీ నిర్వహించినటువంటి సాయుధ పోరాటం దానివల్ల 3000 గ్రామాలను విముక్తి చేయడం, 10 లక్షల ఎకరాలను పేద ప్రజలకు పంచిన చరిత్ర కేవలం కమ్యూనిస్టు పార్టీకి మాత్రమే ఉందన్నారు.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో గుబురు గుట్ట, గిరినగర్, మగ్దుమ్‌నగర్, భగత్‌సింగ్ మార్క్స్ రవి నారాయణరెడ్డి నగర్, లెనిన్ నగర్, శ్రీనివాస్ నగర్ లాంటి అనేక కాలనీలను ఏర్పాటు చేసిన ఘనత స్థానిక సిపిఐ నాయకత్వానికి ఉందని అన్నారు. ఈ జాతాకు సిపిఎం మండల కార్యదర్శి కె.లక్ష్మణ్ నేతృత్వంలో సిపిఎం, సిఐటి నాయకులు స్వాగతం పలికి శాలువాతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు ఎండి యూసుఫ్, జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు హరినాథ్‌రావు, శ్రీనివాస్, సీనియర్ నాయకులు యేసురత్నం, వెంకటేష్, ప్రజానాట్య మండలి అధ్యక్షులు ప్రవీణ్, బాబు, మహిళా సమైక్య అధ్యక్షురాలు హైమావతి, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు నరసింహారెడ్డి, సదానంద్, సహదేవ రెడ్డి, వెంకటేష్, దుర్గయ్య, సీనియర్ జర్నలిస్టు డప్పు రామస్వామి, నరసయ్య, వీరస్వామి, సామేల్, కీర్తి, శ్రీనివాస్, చారి, వెంకటాచారి, బాలరాజు, ఇమామ్, జార్జ్, బక్కరి మల్లేష్, కె. శ్రీనివాస్, మహేందర్, కనకయ్య, చంద్రకాంత్, అల్లా తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికోసం అధికారులు సమన్వయంతో పనిచేయాలి

* డిసెంబర్1 నుండి 9వరకు ప్రజాపాలన వారోత్సవాలు
* మండల స్థాయి రివ్యూ మీటింగ్‌లో ఎమ్మెల్యే బిఎంఆర్



**ప్రజాపక్షం/తాండూరు:** గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి కోసం అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ముందుకు సాగాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సూచించారు. తాండూరు ఎంపిడిఒ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో నిర్వహించిన రివ్యూ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ డిసెంబర్ 1నుండి 9వరకు నిర్వహించే ప్రజాపాలన వారోత్సవాలలో భాగంగా అన్ని గ్రామాలలో పర్యాటిస్తానని, అప్పటి వరకు గ్రామాలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. గ్రామాలలో తాగునీటి ఇబ్బందులు రాకుండా జాగ్రతలు తీసుకోవాలన్నా రు. మిషన్ భగీరథ సరఫరాలో నిర్లక్ష్యం వహించొద్దని అధికారులను హెచ్చరించారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సహకారం అవసరమని, అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అధిక వర్షపాతం వల్ల పంటలు పాడై రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని, పత్తి రైతులకు పత్తి విక్రయా సమయంలో ఇబ్బందులు రాకుండా వ్యవసాయాధికారులు చూడాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పురోగతి సాధించాలని హౌసింగ్ ఎఇ, పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పనులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఏదైన సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎంజిఎన్‌ఆర్‌ఈజిఎస్ కింద ఈ సంవత్సరం అన్ని గ్రామాలలో నూతన గ్రామ పంచాయతీ భవనాలు, పాఠశాల భవనాలు, పాఠశాల ప్రహరీ వాల్‌లు, కిచెన్ షెడ్‌లు, టాయిలెట్లు, అంగన్‌వాడీ భవనాలు, గోదాములు మంజూ రు చేస్తామని, అందుకుగాను ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి, ఎంపిడిఒ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని విద్యను అభ్యసించాలి

### కలెక్టర్ ప్రతీక్‌జైన్




**ప్రజాపక్షం/వికారాబాద్ :** ప్రపంచ మేధావిగా గుర్తింపు పొందిన అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని విద్యను అభ్యసించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. గురువారం అంతర్జాతీయ బాలల హక్కుల, జాతీయ గ్రంథాలయ దినోత్సవాల సందర్భంగా జిల్లా గ్రంథాలయ ముగింపు సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహనీయుల మార్గంలో వారి స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కొలంబియా యూనివర్సిటీలో ఆర్థిక శాస్త్రంలో పట్టభద్రులయ్యారని, భారత ప్రజలకు మంచి రాజ్యాంగాన్ని రూపొందించారని కలెక్టర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రతి ఒక్కరు వివిధ భాషల పట్ల పట్టును సాధించుకోవడం వల్ల కొత్త కొత్త విషయాలు తెలుసుకోవడానికి వీలవుతుందని తెలిపారు. చదువుతో పాటు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా చురుగ్గా పాల్గొనాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ఒక్కరు చిన్నప్పటి నుండే చదువు ద్వారానే సమాజంలో మంచి గుర్తింపు తీసుకువస్తుందని, మన తల్లిదండ్రులకు కూడా గౌరవాన్ని పెంపొందించే దిశగా ప్రతి ఒక్కరు మెలగాలని కలెక్టర్ తెలిపారు.

చదువే ఒక ఆయుధంగా మలుచుకొని జీవితాన్ని గొప్పగా తీర్చిదిద్దుకోవాలని కలెక్టర్ సూచించారు. భాష ద్వారానే మన భావాన్ని తెలుపవచ్చని అందుకే ప్రతి భాష మీద పట్టు సాధించుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్రంథాలయ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా, అదేవిధంగా పోటీపరీక్షలకు సిద్ధమయ్యే విధంగా గ్రంథాలయంలో సౌకర్యాలు కల్పించామన్నారు. గ్రంథాలయ అభివృద్ధికి కలెక్టర్ కృషి అభినందనీయం అని కొనియాడరు. ఈ సందర్భంగా బాలల హక్కులపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సురేష్‌బాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను పరిరక్షించండి

### ప్రజా సంఘాల ఆధ్వర్యాన సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు

**ప్రజాపక్షం/తాండూరు:** ప్రభుత్వ భూములను అక్రమ పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేసి అందుకు సహకరించిన అధికారులపై, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తాండూరు నియోజకవర్గ ప్రజా సంఘాల ఆధ్వర్యాన తాండూరు సబ్‌కలెక్టర్ అందజేసిన ఫిర్యాదులో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మైనార్టీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ వాహబ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బుగ్గప్ప, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు చంద్రయ్య, తెలంగాణ మైనార్టీ హక్కుల పోరాట సమితి తాండూరు నియోజకవర్గ ఇంచార్జీ సాధిక్‌లు మాట్లాడుతూ తాండూరులో ప్రభుత్వ భూములను అక్రమంగా రిజిస్టేషన్ చేసిన గతంలో ఇక్కడ పనిచేసిన ఆర్డివో, ఇంచార్జీ మున్సిపల్ కమీషనర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. తాండూరు పట్టణంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని అక్రమదారుల నుంచి వెంటనే స్వాధినం చేసుకోవాలని వారు డిమాండ్ చేశారు. తాండూరులో ప్రభుత్వ భూములకు రక్షణ కరువైదని మండిపడ్డారు. తాండూరు పట్టణంలోని నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ భూములను కాపాడడంలో రెవెన్యూ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. ప్రభుత్వభూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన అప్పటి సబ్ రిజిస్ట్రార్, తాండూరు డివిజన్ ఆర్డీఒపై, మున్సిపల్ కమీషనర్‌లపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అగ్గనూర్ గ్రామంలో కల్వర్టును అక్రమించిన, ప్రభుత్వ భూమిలో వెంచర్ చేసిన రైతులకు దారి లేకుండా చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాం డ్ చేశారు. వెంటనే చర్యలు తీసుకోకుంటే ప్రజా సంఘాల ఆధ్వర్యాన పెద్దఎత్తున్న ఆందోళన చేపడతామని హెచ్చరించారు.





## 50మంది విద్యార్థులు ఉన్న చోట హెచ్‌ఎం పోస్టు

**ప్రజాపక్షం/వికారాబాద్ :** గురువారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో పిఎస్‌ఎం ల సమావేశం తుప్పలి అనంద్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి పిఎస్ హెచ్‌ఎంఎ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మురళీధర్‌గౌడ్ పాల్గొని మాట్లాడుతూ 50మంది పిల్లలు ఉన్నచోట ఎచ్‌ఎం పోస్టును ప్రభుత్వం తప్పనిసరిగా నియమించాలని తెలిపారు. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని తెలిపారు. పిఎస్ హెచ్‌లకు జాబ్‌చార్ట్ ఉండాలని తెలిపారు. ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయింపు ఇవ్వాలని తెలిపారు. పై విషయాలపై క్షుణ్ణంగా చర్చించి ప్రభుత్వానికి అందజేస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జనార్ధన్, మురళి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, కోశాధికారి కిషన్ బాలరాజ్, రాష్ట్ర కార్యదర్శి, వెంకటయ్య, వీరేశం పద్మనాభం, నరసింహులు, రత్నం బాబు, వీరేశం, చంద్రయ్య, రాములు, మహేందర్, రాము, స్వరూప, వెంకటయ్య, తదితరుల పాల్గొన్నారు.



## మున్సిపల్ కార్మికులపై సూపర్‌వైజర్‌ల పెత్తనం అరికట్టాలి

### ఎఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలబిందెల శ్రీనివాస్

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పని చేసే సిబ్బందిని, కార్మికులను కొంతమంది సూపర్‌వైజర్లు ఇబ్బందులకు గురిచేస్తున్నారన్న విషయం తమ దృష్టికి వచ్చిందని, అందుకే ఎఐటియుసి ఆధ్వర్యంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ షబ్బీర్ అలీ, శానిటైజర్ ఇంచార్జ్ జయ్ రాజ్ కి ఫిర్యాదు చేశామని, ఎఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలబిందెల శ్రీనివాస్ తెలిపారు. గతంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మూడు గ్రామాలుగా ఉండేదని అప్పుడు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో కార్మికులు పనిచేసే వారికీ ఆ గ్రామపంచాయితీ జీతాలు ఇచ్చేది అని గుర్తుచేశారు. అప్పుడు కార్మికులకు ఎలాంటి కష్టం వచ్చిన కార్మిక సంఘం పేర్లు ఏదైనా బాచుపల్లి, ప్రగతినగర్‌లో చల్ల సుధీర్ రెడ్డి, నిజాంపేట్ ఆశి, యాదయ్య, నాయకత్వం వహించేవారని అన్నారు. వారి నాయకత్వంలో కార్మికులు, సిబ్బంది పనిచేసే వారు అని అన్నారు. ఇప్పుడు ఉమ్మడి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు అయిన తరువాత కొంతమంది స్వార్థ రాజకీయాలకోసం అనేక విధాలుగా కార్మికులను సూపర్‌వైజర్లు, వార్డు ఆఫీసర్‌లు ఇబ్బంది పెడుతున్నారని, నేటికీ ఎఐటియుసి ఆధ్వర్యంలో అందరిని కలుపుకొని అనేక పోరాటాలు నిర్వహిస్తున్నాం అన్నారు. కార్మికులకు ఇబ్బందిని కల్గించే సూపర్‌వైజర్లను, ఇతరులను బదిలీ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి మున్సిపల్ అధ్యక్షులు ఆశి యాదయ్య, పొన్నికంటి దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.




## మోడరన్ హైస్కూల్‌లో ఉచిత వైద్య శిబిరం

**ప్రజాపక్షం/కాప్రా :** ముందు జాగ్రత్తగా ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వివిధ వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరిపించుకొంటూ వైద్యులను సంప్రదిస్తుండాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మీర్పేట శాఖ ఆధ్వర్యంలో అపోలో ఆస్పత్రి, సియోన్ కాన్సర్ క్లినిక్, ఎమ్ఎస్‌రెడ్డి లయన్ కంటి ఆస్పత్రి సహకారంతో గురువారం మల్లాపూర్ డివిజన్‌లోని సూర్యనగర్ కాలనీ మోడరన్ హైస్కూల్‌లో నిర్వహించిన మెగా హెల్త్ ఉచిత క్యాంపులో ఆయన పాల్గొన్నారు. సామాజిక సేవల్లో భాగంగా వివిధ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలు సామాన్య ప్రజానీకానికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఇన్నారెడ్డి, ఇతర ప్రతినిధులు రాంచందర్, రమేష్, సత్యరెడ్డి, పద్మరెడ్డి, అంజయ్య, రవీందర్‌రెడ్డి, నర్సింగరావులతో పాటు స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్న ఈ ఉచిత వైద్య శిబిరంలో దంత పరీక్షలు, కంటి పరీక్షలు, కార్డియాలజీ, ఇఎన్‌టి వైద్య నిపుణులు వ్యాధి నిర్ధారణ పరీక్షలు, వైద్య పరీక్షలు, ఉచిత మందుల పంపిణీ చేసారు.

## ఉప్పల్ భగాయత్ హెచ్‌ఎండిఎ లేఔట్‌లో మద్యం దుకాణం వద్దు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ఉప్పల్ భగాయత్ హెచ్‌ఎండిఏ లేఔట్‌లో మద్యం దుకాణ ఏర్పాటుకు అనుమతించవద్దంటూ ఉప్పల్ భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. గురువారం ఈ మేరకు అసోయేషన్ ప్రతినిధులు మేకల మధుసుధన్‌రెడ్డి, శ్రీహరి, శ్రీనివాసరెడ్డి శర్మలు స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, జిహెచ్‌ఎంసి ఉప్పల్ డిప్యూటి కమిషనర్ రాజు, ఎక్సైజ్ మల్కాజిగిరి సూపరింటెండెంట్ నవీన్, సిఐ ఓంకార్‌లను కల్సి వినతిపత్రాలను సమర్పించారు. అపంతనం వారు మాట్లాడుతూ లేఅవుట్ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారని, దీనిపక్కనే ఒకవైపు కాలభైరవుడి ఆలయం, మరో వైపు 8 ఎకరాల పార్కు ఉందని, ఇక్కడికి నిత్యం వచ్చే భక్తులు, వాకర్స్, చిన్న పిల్లలకు మద్యం దుకాణం ఏర్పాటు చేయటం వల్ల తాగుబోతులతో అసౌకర్యంగా ఉంటుందన్నారు. గతంలో తమ అసోసియేషన్ ఈ ప్రాంతంలో ఓయో రూంలు, హాస్టళ్లు, మద్యం దుకాణాలు ఏర్పాటు చేయరాదని తీర్మానం సైతం చేసామని తెలిపారు.





## పిఎసిఎస్ చైర్మన్ పి.లక్ష్మారెడ్డికి ఉత్తమ అవార్డు

**ప్రజాపక్షం/పెద్దేముల్:** హైదరాబాద్‌లో జరిగిన సహకార వారోత్సవాలలో భాగంగా సహకార శాఖ నుండి వికారాబాద్ జిల్లా తట్టేపల్లి వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ పి. లక్ష్మారెడ్డికి ఉత్తమ వార్డు వరిచింది. తట్టేపల్లి వ్యవసాయ ప్రాథమిక సహకారం సంఘాన్ని రెండు పర్యాలు చైర్మన్‌గా కొనసాగుతూ రైతులకు ఉత్తమసేవలు అందింజేసిన పి. లక్ష్మారెడ్డికి సహకార సంఘం నుండి ఉత్తమ అవార్డు అందుకున్నారు. అంతే గాక తట్టేపల్లి సహకారం సంఘం రూ.2కోట్లతో నిధులతో కొనసాగుతున్న ఈ సహకార సంఘాన్ని రూ.17కోట్లకు తీసుకపోవడంలో చైర్మన్ పి. లక్ష్మారెడ్డి ఎంతో కృషి చేశారని, ఆయన సేవలకు గాను తట్టేపల్లి సహకార సంఘానికి ఉత్తమ అవార్డు వరిచింది. ఈ మేరకు సహకార వారోత్సవాలలో తెలంగాణ సహకార యూనియన్ ఎండి న్నపూర్ణ, ప్రిన్సిపల్ భూక్య వెంకన్న, డిసిఓ నాగార్జున, ఇతర అధికారులు పాల్గోన్నారు.

## బకాయిలు చెల్లించండి సారూ..

ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో అవుట్‌సోర్సింగ్ విధానంలో నిర్వహిస్తున్న కార్మికులకు గత పది నెలల నుంచి వేతనాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పది నెలలుగా వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో వేతనాలు రాక తమ కుటుంబాలను పోషించలేకపోతున్నామని, ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకుండాపోయిందని వాపోతున్నారు. ప్రభుత్వం నుండి నిధులు రాలేదు.. ఏజెన్సీలతో మాట్లాడండి అంటూ అధికారులు దాటవేయడంలో అంతర్యమేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ అధికారులను అడిగితే ప్రభుత్వం నుండి నిధులు రాలేదని, వస్తే ఇచ్చేందుకు అభ్యంతరం ఏమి లేదని చెప్పి దాటవేస్తున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి అద్దెలు, పిల్లల చదువులకు, నిత్యావసర వస్తువులు కొనుగోలు చేయలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. పది నెలల పాటు నిలిచిపోయిన వేతనాలను తక్షణమే మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై నిర్లక్ష్య వైఖరీ వీడి, బకాయిలను విడుదల చేసి ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని వారు కోరారు.

## స్థానిక ఎన్నికలకు సర్వం సిద్ధం

మండల అభివృద్ధి అధికారిని అపర్ణ

ప్రజాపక్షం/షాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు మండల అభివృద్ధి అధికారిని అపర్ణ వివరించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల ఓటరు జాబితాను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో అతికించిన ఓటరు లిస్ట్‌లో తప్పులు ఉంటే వెంటనే గ్రామ పంచాయతీ కార్యదర్శులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



## డివిజన్ అభివృద్ధికి ప్రాధాన్యత

కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్

ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : హస్తినాపురం డివిజన్ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యులు బానోతు సుజాత నాయక్ అన్నారు. గురువారం జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొని పలు కాలనీలకు అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయించారు. డివిజన్‌లోని అనుపమ నగర్, సరస్వతి నగర్, హస్తినాపురం నార్త్ ఎక్స్‌టెన్షన్ లకు నూతనంగా సిసి రోడ్ల నిర్మాణానికి, కాలనీలకు మౌలిక వసతులు కల్పనకు నిధులు మంజూరు చేయించినట్టు తెలిపారు. హస్తినాపురం డివిజన్ అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. అభివృద్ధి పనులకు కాలనీ సంక్షేమసంఘాలు సహకారం ఉండాలని కోరారు.

## పనుల పురోగతిపై ఎమ్మెల్యే సమీక్ష



ప్రజాపక్షం/మియాపూర్: శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో జరుగుతున్న హెచ్‌సిటి ప్రాజెక్ట్ పనులు, ఎస్‌ఎన్‌డిపి నాలాల విస్తరణ పనుల పురోగతిపై, మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గాంధీ అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. సమావేశంలో డిసి ప్రశాంతి, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, హెచ్‌సిటి ప్రాజెక్ట్ ఎస్ఎన్‌డిపి విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇటీవల సిఎం రేవంత్ రెడ్డి రూ.1606 కోట్ల నిధులు కేటాయించడం పట్ల ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పనులను త్వరితగతిన, నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రణాళికాబద్ధంగా పనులు జరగాలని అధికారులను సూచించారు. కార్యక్రమంలో రఘునాథ్ రెడ్డి, ప్రాజెక్ట్ విభాగం ఇఇ నామ్యా, డిఇ హరీష్, బాబు, ఎస్ఎన్‌డిపీ ఇఇ శ్రీనాథ్ రెడ్డి, డిఇ ధీరజ్ పాల్గొన్నారు.

## పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే



ప్రజాపక్షం/శంషాబాద్ : శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో మహేష్ గురు స్వామి కరాచములచే గురుస్వామి నరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించిన శ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొన్నారు. భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే భక్తజనాలతో మాట్లాడి వారి ఆధ్యాత్మిక విశ్వాసాన్ని అభినందించారు. ఈ ప్రాంతంలో శాంతి, సామరస్యం, సౌభ్రాతృత్వం మరింత వికసించాలని కాంక్షించారు. కార్యక్రమంలో నార్సింగ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దూడల వెంకటేష్‌గౌడ్, బండి గోపాల్ యాదవ్, మేకల వెంకటేష్, శ్రీకాంత్‌గౌడ్, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

## పార్కు స్థలం అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్ సస్పెన్షన్

హర్షం వ్యక్తం చేస్తున్న శ్రీపురం కాలనీ వాసులు

ప్రజాపక్షం/ఎల్‌బి నగర్: బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని శ్రీపురం కాలనీలో ఉన్న పార్కు స్థలంను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన వనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్ శివశంకర్. మూడు నెలల క్రితం వనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్ రాజేష్ కుమార్‌ను అవినీతి నిరోధక శాఖ అధికారులు పట్టుకోగా.. అతని స్థానంలో సీనియర్ అసిస్టెంట్ ఉన్న శివశంకర్‌ను ఇంచార్జి బాధ్యతలు అప్పగించారు. పార్కు స్థలం విషయంలో బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో శ్రీపురం కాలనీవాసులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కలిసి పార్కు స్థలంపై వారిని వివరించారు. దీంతో సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అధికారులు విచారణ చేపట్టుతున్న సమయంలో శివశంకర్ కోర్టు ఆర్డర్ చూసి రిజిస్ట్రేషన్ చేశారు. విచారణలో పార్కు స్థలం రిజిస్ట్రేషన్ చేయడంతో శివశంకర్‌పై వేటు వేసింది. పార్కు పరిరక్షణకు కృషి చేసిన కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, మంత్రి శ్రీనివాస్‌రెడ్డిని కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి విటల్‌రెడ్డి, సికేందర్‌రెడ్డి, జంగయ్యగౌడ్, కల్లు విష్ణువర్ధన్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మి నారాయణ, దీపా, సుహాసిని, రేణుక ఉన్నారు.

## చట్టబద్ధమైన హక్కులు రక్షించండి



ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : మాదాపూర్ గుట్టల బేగంపేట్ సున్నం చెరువు అక్రమణకు గురైనదని హైడ్రా అధికారులు రెండు నెలల క్రిందట సున్నం చెరువు చుట్టూ ఉన్న స్థలాలలో ఉన్న ఫెన్సింగ్, కంఫౌండ్ వాల్‌లను తొలగించారు. పార్కు స్థలం ఏర్పాటు చేయడానికి బుల్డోజర్లతో గుంతలు తవ్వుతున్నారు. మారుతీ హిల్స్ కాలనీవాసులు తమ ప్లాట్లను సున్నం చెరువులో కలిపివేశారని తమ స్థలాలు తమ ఇవ్వాలని పోరాడుతున్నారు. కావూరి సాంబశివరావు 1980లో సర్వే నెం 12,12ఎ, 13 లలో 21 ఎకరాలలో 235 ప్లాట్లుగా, మూడు పార్కులు చేయగా 235 మంది కోనుగోళ్ళు చేశామని అందులో 165మంది తమ ప్లాట్లలో ఇళ్ళనిర్మాణాలు చేసుకున్నామని, మిగిలిన 70మంది స్థలాలు హైడ్రా అధికారులు సున్నం చెరువులో కలిపి తమ బతుకులను రోడ్డున పడేశారని అవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము హైకోర్టు నుండి తమ స్థలాలే అని స్టేటస్‌కో సైతం తెచ్చుకున్న తమ స్థలాలోకి రానివ్వకుండా చుట్టు ప్రహరి నిర్మాణం చేపట్టరాని, ముఖ్యమంత్రి తమ బాధను అర్థం చేసుకొని తమ స్థలాలు తమకు దక్కేలా చూడాలని కోరారు.

## రోడ్డు కబ్జా చేసిన వారిపై చర్యలు

ప్రజాపక్షం/తుర్కయంజాల్: తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి ఎవి.నగర్ లో సర్వే నెంబర్ 634 బీరప్ప దేవాలయ రోడ్డు మార్గమును కబ్జా చేస్తున్న కొత్త కుర్మ శివకుమార్ పై చర్యలు తీసుకోవాలని కుర్మ సంఘం అధ్యక్షులు వస్పరి బాబయ్య డిమాండ్ చేశారు.గురువారం కుర్మ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కమిటీ సభ్యులు మాట్లాడుతూ దేవాలయ రోడ్డు మార్గాన్ని కబ్జా చేస్తున్న అతనిపై చర్యలు తీసుకొని,రోడ్డు మార్గాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గుండ నరసింహ, బొడ్డు కొమరయ్య,గుండా రాజు,బండారి బాబు,కుర్మ సంఘం సభ్యులు బొడ్డు మల్లేష్,బిక్షపతి,కొత్తకుర్మ కుమార్ పాల్గొన్నారు

## పలు అభివృద్ధి పనులకు జిహెచ్‌ఎంసి స్థాయీసంఘం గ్రీన్ సిగ్నల్

ప్రజాపక్షం/హైదరాబాద్ : మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) స్థాయీసంఘం సమావేశం నగరంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో గురువారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన స్థాయీసంఘం సమావేశం జరిగింది. సమావేశంలో 18 ఎజెండా అంశాలు, 6 ఐటమ్‌లకు స్థాయీసంఘం ఆమోదం తెలిపింది. సమావేశానికి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, సభ్యులు బొంతు శ్రీదేవి, బానోతు సుజాత, సయ్యద్ మిన్హాజుద్దీన్, సమీనా బేగం, అబ్దుల్ వాహెబ్, పర్వీన్ సుల్తానా, మహ్మద్ సలీం, డా.ఆయేషా హుమేరా, మహాలక్ష్మి రామన్ గౌడ్, సి.ఎన్.రెడ్డి, మహమ్మద్ బాబా ఫసియుద్దీన్, బూరుగడ్డ పుష్ప హాజరయ్యారు. అదనపు కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, వివిధ విభాగాల ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



### బిజెపి కార్పొరేటర్ల నిరసన ప్రదర్శన

నగర అభివృద్ధి నిధుల కేటాయించాలని, సమస్యలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ జిహెచ్‌ఎంసి స్థాయీసంఘం సమావేశం మందిరం ఎదుట బిజెపి కార్పొరేటర్లు బైఠాయించారు. నిరసన చేపట్టిన కార్పొరేటర్లను పోలీసులు అరెస్ట్ చేసి, అక్కడి నుంచి బలవంతంగా తరలించారు. దీంతో ఇరుపక్షాల మధ్య తోపులాట చోటు చేసుకుంది. దీంతో జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో కొంత ఉద్రిక్తత చోటు చేసుకుంది. శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేస్తున్న కార్పొరేటర్లపై మేయర్, కాంగ్రెస్ పార్టీ పోలీసుల ద్వారా పాశవిక దాడికి పాల్పడ్డారని బిజెపి కార్పొరేటర్ శ్రవణ్ ఆరోపించారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కింద ఇచ్చిన రూ. 113 కోట్లను చెరువుల పునరుద్ధీకరణకు ఎందుకు వాడటం లేదని, అన్ని డివిజన్‌లకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అడిగిన ప్రశ్నలకు మేయర్ సమాధానం చెప్పకుండా, ఏకంగా 100మంది పోలీసులను ఉపయోగించి తనతో పాటు సరూర్ నగర్ ఆకుల శ్రీవాణి, మూసాపేట్ మహేందర్‌తో పాటు ఇతరులపై క్రూరంగా దాడి చేయించి, అరెస్టు చేయించిందని శ్రవణ్ చెప్పారు.

**కార్పొరేటర్‌లపై దాడిని ఖండించిన బిజెపి చీఫ్ రాంచందర్ రావు...** బిజెపి కార్పొరేటర్లపై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలు, కేంద్ర నిధుల వినియోగంపై వివరణ అడగటం ప్రజాస్వామ్యంలో తమ హక్కు అని, దాడి చేయించడం దుర్మార్గమని విమర్శించారు. అభివృద్ధిపై ప్రశ్నలు అడిగినందుకే అధికార పార్టీ నియంతృత్వ వైఖరితో ప్రతీకార చర్యలకు పాల్పడిందన్నారు. మేయర్, కమిషనర్లు తక్షణమే క్షమాపణ చెప్పాలని, దాడికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, అన్ని వినతిపత్రాలపై నిర్ణీత సమయంలోగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



## సుందరీకరణ పనులు వెంటనే పూర్తిచేయాలి : మేయర్



ప్రజాపక్షం/హైదరాబాద్ : జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయం ప్రాంగణంలో గురువారం సాయంత్రం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రగతిలో ఉన్న సుందరీకరణ పనులను పరిశీలించారు. ఫౌంటైన్, ల్యాండ్ స్కేపింగ్, మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాలు, పెయింటింగ్ పనులు, నూతన బోర్డ్ ఏర్పాటు తదితర పనులను పరిశీలించారు. ఈ నెల 25వ తేదీన జిహెచ్‌ఎంసి సాధారణ సర్వసభ్య సమావేశం రోజున సుందరీకరణ పనులను ప్రారంభించాల్సి ఉన్నందున పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కృషి

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి

ప్రజాపక్షం/హైదరాబాద్ : విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా నాణ్యమైన విద్యాబోధన అందించాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి ఉపాధ్యాయులకు సూచించారు. నందమూరి బసవ తారక నగర్ (ఎన్‌బిటి నగర్) లోని ప్రైమరీ, ఉన్నత పాఠశాలలను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు గుణాత్మకమైన విద్యతో పాటు సమయానికి నాణ్యమైన ఆహార పదార్థాలను అందించడం, తరగతి గదులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. పరీక్షల సమయం సమీపిస్తున్న తరుణంలో, ఉత్తీర్ణత శాతం మెరుగుపరచడానికి ప్రత్యేక తరగతులను నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రైమరీ, ఉన్నత పాఠశాలలతో పాటు భవిత కేంద్రాన్ని కూడా సందర్శించిన కలెక్టర్, భవిత కేంద్రంలోని పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, వారికి అందుతున్న వైద్య సేవలు, విద్యాబోధన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉన్నత పాఠశాలలో సబ్జెక్టుల సిలబస్ పూర్తయిందా లేదా అని ప్రశ్నించారు. ప్రైమరీ పాఠశాల గోడలపై ఉన్న వివిధ రకాల ఆరట్స్‌ను పరిశీలించి, పిల్లలతో ముఖాముఖిగా మాట్లాడారు. అలాగే క్రీడా మైదానాన్ని సందర్శించి, విద్యార్థులకు విద్యతో పాటు క్రీడల్లో రాణించే విధంగా అవసరమైన తర్ఫీదు ఇప్పించి, ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనం వివరాలపై ఉపాధ్యాయులతో మాట్లాడి, విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలను పరిశీలించారు. 'విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి, సబ్జెక్టులపై ఏకాగ్రత ఉంచాలని కలెక్టర్ ఉద్బోధించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, హెచ్‌ఎం రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక సౌకర్యాలు కరువు

తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత


ప్రజాపక్షం/షాద్‌నగర్/కేశంపేట/కొత్తూరు: అసౌకర్యాల మధ్య నడుస్తున్న ప్రభుత్వ ఆసుపత్రులను మెరుగు పరిచేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టి కేంద్రీకరించాలని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. గురువారం జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి రోగులతో నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొత్తూరు మండలం జెపి దర్గాలో బాబాకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేశంపేట మండలం బోదునంపల్లి గ్రామంలో భూ నిర్వాసితులతో నష్ట పరిహారంపై చర్చించారు. త్రిపుల్‌ఆర్ రోడ్డు ఎటు నుండి ఎక్కడికి వెళ్తుందనే విషయాలను భూ బాదితుల నుండి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సి కవిత మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని, వైద్యుల సంఖ్యను పెంచి నాణ్యమైన వైద్య సేవలు అంధించాలని డిమాండ్ చేశారు. శిథిలావస్థకు చేరుకున్న ఆసుపత్రి నుండి వంద పడకల ఆసుపత్రికి తరలించాలని, నాణ్యమైన వైద్యసేలు అంధించేందుకు సిబ్బందిని నియమించాలని పేర్కొన్నారు. పేదల ఆరోగ్య స్థితిగతులపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించేందుకు కృషి చేయాలని కోరారు. త్రిపులార్‌లో భూములు కొల్పోతున్న భూ నిర్వాసితులకు బహిరంగ మార్కెట్ ధరలు కట్టించేందుకు చర్యలు తీసుకోవాలని, రైతులకు భరోసానివ్వకుంటే భూ పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. అధికారంలోకి వస్తే లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మిస్తామని చెప్పినా కాంగ్రెస్ ప్రభుత్వం నేడు ఎందుకు నిర్లక్ష్యం చేస్తుందో చెప్పాల్సిన అవసరం ఉందని కవిత డిమాండ్ చేశారు. షాద్‌నగర్ ప్రాంతానికి లక్ష్మీ దేవిపల్లి ప్రాజెక్టు ఎంతో ముఖ్యమని, దాన్ని నిర్మాణంతో తీవ్ర జాప్యం చోటు చేసుకుంటుందని ఆరోపించారు. రైతులపై ఏమాత్రం శ్రద్ధ ఉన్నా లక్ష్మీ దేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి ముస్లిం మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండి ముస్తాఫా, షాద్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు రమేష్ కురుమతోపాటు జాగృతి నేతలు పాల్గొన్నారు.



## తక్కువ నీటితో ఎక్కువ దిగుబడులు

యాచారంలో రైతుల సమావేశంలో రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

ప్రజాపక్షం/యాచారం : రైతులు తక్కువ నీటితో ఎక్కువ దిగుబడులు వచ్చే పంటలను సాగు చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు కమిషన్ చైర్మేన్ ముదిరెడ్డి కొదండారెడ్డి అన్నారు. గురువారం యాచారం మండల పరిధిలోని చౌదర్ పల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ, ఉద్యాన వన శాఖ సమన్వయంతో తక్కువ నీటితో వరి పంటలు వేసే సాగును కాశిమల్ల వెంకటరాములు పోలంలో అయన పరిశీలించారు.అనంతరం యాచారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సంధర్బంగా అయన మాట్లాతూ తక్కువ పెట్టుబడితో రైతులు అధిక దిగు బడులు పోందాలన్నారు. యాచారం మండల పరిధిలోని చౌదర్ పల్లి, మొండిగౌరెల్లి, గడ్డమల్లాయగూడ గ్రామాలను పైలేటు ప్రాజెక్ట్ తీసుకున్నామన్నారు. కూరగాయలు పండిచే రైతులను అదుకోవడానికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని తెలిపారు.రైతుల సౌకర్యార్థం యాచారం మండల కేంద్రంలో రైతు బజార్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అందుకోసం స్థలం చూసినట్లు తెలిపారు.మార్కేటు సౌకర్యం కల్పిస్తామన్నారు.దళారి వ్యవస్థను అరికట్టడానికి తమ వంతుగా ప్రభుత్వ పరంగా కృషి చేస్తున్నామన్నారు.రైతులకు అండగా కాంగ్రేస్ ప్రభుత్వం కృషి చేస్తుందన తెలిపారు. డ్రిప్‌తో వరి సాగు చేసే పద్ధతిని అందరు అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు కమిషన్ సభ్యులు వి.ఎన్ రెడ్డి, భవాని, కార్యదర్శి గోపాల్, జిల్లా వ్యవసాయధికారి డి.ఉష, జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి సురేశ్, పట్టు పరిశ్రమ శాఖ అధికారి ఎడిఒ సుజాత, యాచారం మండల వ్యవసాయాధికారి అర్ రవినాథ్ తదితరులు పాల్గొన్నారు.



## పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తాం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ప్రజాపక్షం/షాద్‌నగర్: ఎర్ర రాజశేఖర్ హత్యపై పూర్తి స్థాయిలో విచారణ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మెన్ వీర్లపల్లి శంకర్ వివరించారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎల్లంపల్లి గ్రామంలో హత్యకు గురైన ఎర్ర రాజశేఖర్ కుటుంబాన్ని పరామర్శించి రూ.50వేలు ఆర్థిక సహాయం చేశారు. హత్యకు గల కారణాలను మృతుడి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ మానవ మృగాలుగా వ్యవహరిస్తున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు. అట్రాసిటి బాధితులకు ప్రభుత్వం సహకారమందేలా చూడాలని షాద్‌నగర్ ఆర్‌డిఓ సరితను అదేశించినట్లు తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుండి రెండు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని, కుల దురహకాంర హత్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని బెనిఫిట్స్ త్వరగా వచ్చే విధంగా చర్య లు తీసుకోవాలని ఆర్‌డిఓ సరితను ఆదేశించడమే కాకుండా బ్యాంక్ ఖాతా తెరిపించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రేమించి పెళ్ళి చేసుకున్న చంద్రశేఖర్‌కు అన్ని విధాల ప్రభుత్వం రక్షణ కల్పిస్తుందని, గ్రామానికి వచ్చిన సమయంలో పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాలని పోలీసులనుఆదేశించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ అధ్యక్షుడు కర్రోళ్ల సురేందర్, సీనియర్ నేత బాదేపల్లి సిద్దార్థ, జాంగారి రవి, ఎర్రోళ్ళ జగన్, సింగపాగ అనిల్‌కుమార్, నాగి సాయిలు, బోరిగే నరేందర్, జాంగారి జంగయ్య, కొమ్ము కృష్ణ పాల్గొన్నారు.



## త్వరితగతిన అట్రాసిటి కేసుల పరిష్కారం






రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ప్రజాపక్షం/రంగారెడ్డి:జిల్లాలో అట్రాసిటి కేసులను త్వరితగతిన పరిష్కరించాలని రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య జిల్లా యంత్రాంగానికి సూచించారు. గురువారం జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో పోలీసు, రెవెన్యూ అధికారులు, ఎస్‌సి, ఎస్‌టి అభివృద్ధి, సంక్షేమ శాఖల అధికారులు, కుల సంఘాల నాయకులతో ల్యాండ్ మరియు అట్రాసిటీ కేసులలో పురోగతి, ఎస్‌సి, ఎస్‌టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిలు, ఇతర అణగారిన వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేసే గ్రామాభివృద్ధి కమిటీలను ఎంతమాత్రం ఉపేక్షించబోమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్లలో ఫ్రండ్లీ పోలీసింగ్ విధానం పక్కాగా అమలు జరిగేలా చూడాలని, ఎస్‌సి, ఎస్‌టిలకు న్యాయం జరిగేలా రెవెన్యూ, పోలీసు అధికారులు, సిబ్బంది పనిచేయాలని సూచించారు. అధికారులు ఎస్‌సి, ఎస్‌టి గురుకుల పాఠశాలలను వసతి గృహాలను తరచు తనిఖీలు చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం మెరుగైన విద్యను అందించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమీక్షలో ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, డిఆర్‌ఓ సంగీత, డిసిపిలు సత్యనారాయణ, పూర్ణచంద్రరావు, ఉదయ్‌రెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రామరావు, జిల్లా పరిషత్ సిఇఒ సిహెచ్ కృష్ణారెడ్డి, ఆర్డీఓలు చంద్రకళ, వెంకట్ రెడ్డి, సరిత, తహసీల్దారులు, మున్సిపల్ కమిషనర్లు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### ఎర్ర రాజశేఖర్ హంతకులకు కఠిన శిక్ష

షాద్‌నగర్: ప్రేమ వ్యవహారంలో దళిత యువకుడు ఎర్ర రాజశేఖర్‌ని హత్యచేసిన వారిని కఠిన శిక్ష పడేలా చూస్తామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. గురువారం షాద్‌నగర్ డివిజన్‌లోని ఫరూఖ్‌నగర్ మండలం ఎల్లంపల్లి గ్రామం హత్యకు గురైన దళిత ఎర్ర రాజశేఖర్ కుటుంబాన్ని అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, శంషాబాద్ అదనపు డిసిపి పూర్ణచందర్, షాద్‌నగర్ ఆర్‌డిఓ సరిత, సిఐ విజయ్‌కుమార్‌తో కలిసి పరామర్శించారు. మృతుడి భార్య ఎర్ర వాణి, మృతుడి తండ్రి మల్లేష్‌లకు రూ.4.12లక్షల చెక్కును ప్రభుత్వం తరుపున అందించారు. ఈ సందర్భంగా చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ సభ్య సమాజం తలదించుకునే విధంగా ఈ సంఘటన జరగడం అత్యంత దారుణమన్నారు. మృతుడు రాజశేఖర్ కుటుంబ పరిస్థితి దయనీయంగా ఉందని, బాధిత కుటుంబానికి ఐదు ఎకరాల ప్రభుత్వ ఇవ్వడంతోపాటు హైద్రాబాద్‌లో డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. ఆర్థికంగా, ఉద్యోగ పరంగా ఆ కుటుంబాన్ని అదుకునేందుకు భరోసా కల్పిస్తామని తెలిపారు. రాజశేఖర్ కుటుంబానికి పోలీసులు రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫరూఖ్‌నగర్ మండలం ఎల్లంపల్లి గ్రామంలో దళితులకు ఆలయ ప్రవేశం చేయించేందుకు కృషి చేయాలని అధికారులను కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగయ్య, ఎస్సీ డిడి రామరావు, రాంబల్ నాయక్, నేతలు బాదేపల్లి సిద్దార్థ, జాంగారి రవి, ఎరోళ్ల జగన్ ఉన్నారు.

# క్రీడ



## దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్.. హార్దిక్ పాండ్యా, బుమ్రా దూరం

దక్షిణాఫ్రికాతో జరిగే వన్డే సిరీస్‌కు సీనియర్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, ఫాస్ట్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా విశ్రాంతి ఇచ్చే అవకాశం ఉంది. ఇరుజట్ల మధ్య మూడు మ్యాచుల సిరీస్ నవంబర్ 30న ప్రారంభం కానున్నది. గాయం కారణంగా హార్దిక్ కొంతకాలంగా క్రికెట్‌కు దూరంగా ఉన్నాడు. దక్షిణాఫ్రికా తో జరిగే వన్డే సిరీస్‌లో పాల్గొనే అవకాశం లేదు. ప్రస్తుతం హార్దిక్ టీ20 క్రికెట్ పై దృష్టి సారించిన ట్లుగా భావిస్తున్నారు. ప్రీమియర్ ఫాస్ట్ బౌలర్ల పనిభారాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ వన్డే సిరీస్ నుంచి బుమ్రాకు విశ్రాంతినిచ్చే అవకాశం ఉంది. సెప్టెంబర్‌లో జరిగిన ఆసియా కప్ సందర్భంగా హార్దిక్ గాయం కార ణంగా పాకిస్తాన్‌తో జరిగే ఫైనల్‌లో ఆడలేకపో యాడు. హార్దిక్ గాయం నుంచి కోలుకుంటున్నాడు. ఈ తరుణంలో నేరుగా మళ్లీ 50 ఓవర్ల క్రికెట్ ఆడడం ప్రమాద కరమయ్యే అవకాశం ఉంది. హార్దిక్ టీ20 ప్రపంచకప్‌పై దృష్టి సారిం చాడు. తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకునేం దుకు హార్దిక్ మొదట సయ్యద్ ముస్తా ఖ్ అలీ ట్రోఫీలో బరోడా తరఫున బరిలోకి దిగనున్నాడు. ఆ తర్వాత దక్షిణాఫ్రి కా, న్యూజిలాండ్‌తో జరిగే టీ20 సిరీస్ లో బరిలోకి దిగనున్నాడు. న్యూజి లాండ్‌తో భారత్ మూడు వన్డేలు సైతం ఆడుతుంది. ఐపీఎల్ తర్వాత సీనియర్ ప్లేయర్లు 2027 వన్డే ప్రపంచకప్‌పై దృష్టి సారించనున్నారు. ఇది లా ఉండగా.. ఈ నెల 22 నుంచి దక్షిణాఫ్రికాతో జరగనున్న రెండో టెస్ట్ కోసం భారత జట్టు గౌహతికి చేరు కుంది. రెండు మ్యాచుల సిరీస్‌లో ప్రస్తుతం భారత్ 0–1 తేడాతో వెనుకపడింది. సిరీస్‌ను సమం చేయాలని భావిస్తుంది. అయితే, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ గాయపడడం టీమిండియాను కలవరపెడుతున్నది. రెండో మ్యాచ్‌కు అందుబాటులో ఉంటాడా? లేదా? అన్నదాంట్లో స్పష్టత లేదు.

## చరిత్ర సృష్టించనున్న పంత్..



టీమిండియా స్టార్ వికెట్ కీపర్ రిషభ్ పంత్ చరిత్ర సృష్టించను న్నాడు. దిగ్గజ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ తర్వాత టీమిండియా టెస్ట్ కెప్టెన్సీ బాధ్యతలు అందుకున్న వికెట్ కీప ర్‌గా నిలవనున్నాడు. గౌహతి వేదికగా శని వారం నుంచి సౌతాఫ్రి కాతో ప్రారంభమయ్యే రెండో టెస్ట్‌తో రిషభ్ పంత్ ఈ ఫీట్ సాధించ నున్నాడు. ఈ మ్యాచ్‌కు శుభ్‌మన్ గిల్ దూరం కానున్నాడు. తొలి టెస్ట్ సందర్భంగా మెడ గాయానికి గురైన శుభ్‌మన్ గిల్ ఇంకా కోలుకోలేదు. బుధవారం భారత జట్టుతో కలిసి అతను గౌహతి వెళ్లినా.. మ్యాచ్ సమయానికి ఫిట్‌నెస్ సాధించే అవకాశాలు లేవు. శుభ్‌మన్ గిల్ గాయంపై బిసిసిఐ అప్‌డేట్ ఇచ్చినా.. రెండో టెస్ట్‌కు అతన్ని దూరంగా ఉంచాలని టీమిండియా మేనేజ్‌మెంట్ నిర్ణ యించినట్లు తెలుస్తోంది. శుభ్‌మన్ గిల్ గైర్హాజరీలో టీమిండియాను నడిపించిన వైస్ కెప్టెన్ రిషభ్ పంతే.. రెండో టెస్ట్‌లోనూ సారథ్యం వహించనున్నాడు. పూర్తి స్థాయి కెప్టెన్‌గా రిషభ్ పంత్‌కు ఇదే తొలి టెస్ట్ మ్యాచ్. అతనే కెప్టెన్‌గా బరిలోకి దిగితే.. ధోనీ తర్వాత భారత జట్టును నడిపించిన రెండో వికెట్‌కీపర్‌గా చరిత్రకెక్కుతాడు. 2014 వరకు ధోనీ టెస్ట్‌ల్లో టీమిండియాను నడిపించిన సంగతి తెలిసిందే. సుదీర్ఘ ఫార్మాట్‌లో భారత జట్టును నడిపించిన ఏకైక వికెట్ కీపర్ అతనే కావడం గమనార్హం. సౌతాఫ్రికాతో రెండో టెస్ట్‌తో రిషభ్ పంత్ ఈ జాబితాలో చేరనున్నాడు.

## భారత్ ఖాతాలో ఐదో స్వర్ణం..!

### ఇందూరు బిడ్డ పసిడి పంచ్..



భారత మహిళా బాక్సర్ నిఖత్ జరీన్ పసిడి పంచ్ విసిరింది. విశ్వవేదికపై తన పంచ్ పవర్ చూపించిన ఇందూరు బిడ్డ దేశానికి ఐదో బంగారు పతకం అందించింది. వరల్డ్ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో చెలరేగిపోయిన నిఖత్ 51 కిలోల విభాగంలో ప్రత్యర్థి గ్జువాన్ యూ గువోను మట్టికరిపించి విజేతగా నిలిచింది. పారిస్ ఒలింపిక్స్‌లో నిరాశపరిచిన తను.. ఇప్పుడు యావత్ దేశం, తెలంగాణ రాష్ట్రం గర్వపడే విజయం సాధించింది. స్వదేశంలో జరుగుతున్న వరల్డ్ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో నిఖత్ జరీన్ తడాఖా చూపించింది. రెండుసార్లు వరల్డ్ ఛాంపియన్ అయిన ఆమె.. గ్రేటర్ నోయిడాలో ప్రత్యర్థులపై పంచ్‌ల వర్షం కురిపిస్తూ ఫైనల్ చేరింది. సెమీస్‌లో ఉజ్బెకిస్థాన్ బాక్సర్ గనీవ గుల్సేవర్‌పై సంచలన విజయంతో టైటిల్ పోరుకు దూసుకెళ్లింది నిఖత్. కఠినమైన గుల్సేవర్‌ను ఓడించి ఉత్సాహంతో ఫైనల్లోనూ జోరు చూపింది నిఖత్. తనదైన దూకుడుతో చైనీస్ తైపీకి చెందిన గువో యూ గ్జువాన్‌ను చిత్తు చిత్తుగా ఓడించింది. మ్యాచ్ ఆసాంతం ఆధిపత్యం చెలాయించిన భారత బాక్సర్ 50తో విజేతగా నిలిచింది. ఇదే పోటీల్లో నలుగురు భారత బాక్సర్లు స్వర్ణంతో మెరిశారు. 48 కిలోల విభాగలో మీనాక్షి హుడా, ప్రీతి పవార్(54 కిలోలు), అరుంధతి (70 కిలోలు), నుపుర్ షోరాన్(84 కిలోలు) దేశానికి పసిడి పతకం అందించి మురిసిపోయారు. పారిస్ ఒలింపిక్స్‌లో నిఖత్ 50 కిలోల విభాగంలో బరిలో నిలిచింది. ఒలింపిక్ ట్రయల్స్‌లో దిగ్గజ బాక్సర్ మేరీ కోమ్‌ను ఓడించిన ఆమె ఈసారి పతకం గెలవడం ఖాయం అనిపించింది. కానీ, అంచనాలు తప్పాయి. అయితే.. తొలి రౌండ్‌లోనే ఆమెకు చైనా బాక్సర్ వూ యూ చెక్ పెట్టింది. దాంతో, పోటీ పడేందుకు 50 కిలోల నిర్ణీత బరువు ఉండేందుకు నిఖత్ రెండు రోజులుగా పడ్డ శ్రమ అంతా వృథా అయింది.

ఫోకస్

## 'హ్యూమన్ కాటర్‌పిల్లర్' రాండియన్



ప్రిన్స్ రాండియన్ అనగానే చేతులు, కాళ్ళు లేకుండా, 1871, అక్టోబర్ 12న జన్మించిన ఓ వ్యక్తి గుర్తుకొస్తాడు. 'హ్యూమన్ కాటర్‌పిల్లర్' అని పిలిచే అతని మానవ సంకల్ప శక్తికి యావత్ ప్రపంచం జేజేలు పలికింది. టెట్రాఅమెలియా సిండ్రోమ్ అనే అరుదైన రుగ్మతతో అతను జన్మించాడు. దీని కారణంగా అతనికి చేతులు, కాళ్ళు లేవు. కేవలం మొండెం మాత్రమే ఉంది. కానీ అతను నిరాశ చెందలేదు. తన శరీర నిర్మాణం గురించి పదేపదే ఆలోచిస్తూ మనసు పాడు చేసుకోలేదు. మరెవరైనా అలాంటి పరిస్థితుల్లో తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురయ్యేవారు. జీవితంలో ఏమీ మిగల్లేదని నిర్ధారణకు వచ్చేవారు. మానసికంగా కుంగిపోయేవారు. కానీ, ప్రిన్స్ రాండియన్ మాత్రం అందుకు భిన్నంగా ప్రవర్తించాడు. నిరాశకు బదులు గా తన జీవితాన్ని పూర్తి స్థాయిలో నిలబెట్టుకున్నాడు. ఉపాధులు లేకపోవడంతో, అతను తన నోరు, భుజాల తోనే పనులు చేసేవాడు. పుస్తకాలు రాసేవాడు. చిత్రాలు కూడా గీసేవాడు. 1932లో విడుదలైన క్లాసిక్ సిని మా 'ఫ్రీక్స్' లో అతను సొంతంగా సిగరెట్ మడవడం పనులు చేసి, ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురి చేశాడు. అందులో ఎలాం టి మాయాజాలం లేదు. అది, వ్యక్తి సంకల్పం ఎంతటి గొప్ప ఫలితాలనిస్తుందో నిరూపించే పాఠం. అతను బాధకు, శోకానికి కా దు.. స్వాతంత్ర్యానికి, ప్రేరణకు మార్గదర్శకుడయ్యారు. సాధారణ మనుషుల మాదిరే పెళ్లి చేసుకున్నాడు. పిల్లలు కన్నాడు. ప్రపంచమంతా తిరిగి ప్రదర్శనలు ఇచ్చి అందరికి ఆశాజనకమైన జీవితం ఎలా కొనసాగించవచ్చో చూపించాడు. 1934 డిసెంబర్ 19న తుదిశ్వాస విడిచిన ప్రిన్స్ రాండియన్ జీవితం మనకు ఆశావహ దృక్పథాన్ని అందిస్తుంది. మన శరీరం బలం కాదు, మన సంక ల్పం కూడా బలమేనని అతని జీవితం మనకు స్పష్టం చేస్తుంది. చి న్నచిన్న విషయాలకు లేదా ఎదురయ్యే కష్టాలను జీవితాలను చా లించుకోవాలనుకునే వారు ప్రిన్స్ రాండియన్ జీవితం నుంచి స్ఫూ ర్తి పొందాలి. సమస్యలను ఎదిరించి, పరిస్థితులను తనకు అనుకూలంగా మార్చుకొని ఎలా జీవించాలో నేర్చుకోవాలి.

## ప్రపంచ పౌరురాలు ఎలిజబెత్ సామన్స్



ఒకప్పుడి సోవియట్ యూనియన్‌లో అమెరికా తరఫున సాంస్కృతిక రాయబారిగా వ్యవహరించిన ఎలిజబెత్ సామన్స్ 'ప్రపంచ పౌరురాలు' అనే పేరు సంపాదించింది. 30 ఏళ్లకు పైగా ఆమె అమెరికా ఇన్ఫర్మేషన్ ఏజెన్సీ తరఫున రష్యాలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించింది. అమెరికా, రష్యా మధ్య అప్పట్లో నెలకొన్న 'ప్రచ్ఛన్న యుద్ధం' యొక్క ఎక్కువ భాగాన్ని కవర్ చేసిన ఈ ప్రాజెక్టు, సోవియట్ యూనియన్ పతనానికి సుమారు ఏడాది ముందే ముగిసింది. ప్రాజక్టు ప్రారంభం నుంచి చివరి వరకూ అంతా తానైన నడిపించిన ఎలిజబెత్ ఓ అంధురాలు. అయితేనేం, ఆమె లక్షలాది మంది సామాన్యుల కంటే మెరుగైన ప్రతిభ కనబరచింది. ఎలిజబెత్ జీవన ప్రస్థానం ఎంతో స్ఫూర్తిదాయకం. స్విట్జర్లాండ్‌లో ఎక్స్ఛేంజ్ విద్యార్థిని కావడం నుంచి హంగేరిలో పీస్ కార్ప్స్ వలంటీర్‌గా పని చేయడం వరకూ... నోవోసిబిర్స్క్‌లో ఉపాధ్యాయురాలిగా సేవలు అందించడం నుంచి విద్యాంగుల హక్కుల కోసం పోరాటాల వరకూ.. స్వస్థలమైన ఒహియోలో రచయిత్రిగా ఎదగడం నుంచి మానవ హక్కుల ఉద్యమకారిణిగా పనిచేయడం వరకూ ఎలిజబెత్ జీవన ప్రయాణం ఒక గొప్ప స్ఫూర్తిదాయక పాఠం. ఆమె సాహసాలు, విజయాలు అనంతరం. కళలు, సాహిత్యం, అంతర్జాతీయ వివాహాలు, అమెరికాతోపాటు రష్యాలోనూ దివ్యాంగుల హక్కుల కోసం పోరాటం, విస్తృతంగా ప్రయాణించడం ఆమెకు మాత్రమే సాధ్యం. ఎలిజబెత్ సేవలకు ఎల్లలు లేవు. తరతమ భేదాలు అసలే లేవు. ఆమె దేశాల కోసమో.. ప్రాంతాల కోసమోకాదు.. ప్రపంచ మానవాళి కోసం శ్రమించింది. 1966లో జన్మించిన ఎలిజబెత్ పుట్టుకతోనే అంధురాలు. తల్లి జపాన్‌లో పని చేసిన అనుభవం ఉన్న ఓ నర్స్. తండ్రి ఓ లైబ్రేరియన్. ఒహియోలోని మౌంట్‌వెర్నన్ అనే మారుమూల ప్రాంతం నుంచి ఎలిజబెత్ యావత్ ప్రపంచం అబ్బురపడేలా అసాధారణ ప్రతిభ కనబరచింది. ఎన్నో రంగాల్లో సేవలు అందించింది. ప్రత్యేకించి దివ్యాంగుల హక్కుల కోసం గళం విప్పింది. అందరికీ ఆప్తురాలైంది. ప్రపంచ పౌరురాలిగా కీర్తిప్రతిష్టలు గడించింది.



## వృద్ధాప్యంలో మతిమరుపు..



వయసు పెరిగేకొద్దీ మతిమరుపు పెరుగుతుందనే అపోహ చాలా మంది లో ఉంది. కానీ, ఇది అర్ధసత్యం మాత్రమే. ఎందుకంటే వృద్ధాప్యంలో జ్ఞాపకశక్తి తగ్గేమాట కొంత వాస్తవమే అయినా ఇది అందరికీ రావాలనేం లేదు. ముఖ్యంగా తీవ్రమైన ఒత్తిడి, ఆందోళన, కుంగుబాటు వంటి సమస్యల్లో కూడా ఇలాంటి లక్షణాలు కనబడే అవకాశం లేకపోలేదు. వృద్ధాప్యంలో కుంగుబాటు (డిప్రెషన్) ఎక్కువగా ఉంటుంది. జీవితకాలంలో తాము నేర్చుకున్న పాఠాలు.. తమకు ఎదురైన అనుభవాలను తర్వాతి తరాలకు చెప్పాలనే తపన, తాము చేసిన పొరపాట్లు భవిష్యత్ తరాలు చేయకూడదనే అభిప్రాయం వృద్ధుల్లో అధికంగా కనిపిస్తుంది. దీనినే చాలా మంది చాదస్తంగా పేర్కొంటూ ఉంటారు. చెప్పిందే మళ్లీ మళ్లీ చెప్తున్నారంటూ తప్పు పడతారు. కానీ, వారిలోని మానసిక ఘర్షణను అర్థం చేసుకోవాలి. అదే సమయంలో, వయసు పెరుగుతున్నకొద్దీ వచ్చే సమస్యల నుంచి బయటపడడానికి ప్రయత్నాలు మొదలు పెట్టడం ప్రతి ఒక్కరికీ అత్యవసరం. ఎంత వయసు వచ్చినా శరీరాన్నీ, మెదడునూ చురుకుగా ఉంచుకోవాలి. నిత్యం వ్యాయామం చెయ్యటం ఎంత అవసరమో మెదడుకు పదును పెడుతుండటం కూడా అంతే అవసరం. ఇందుకోసం ఎప్పుడూ ఏదో ఒక కొత్త పని, కొత్త విద్య నేర్చుకోవటానికి ప్రయత్నించటం, కొత్త పుస్తకాలు చదవటం, చదరంగంపదకేళిచిన్నచిన్న లెక్కలు చెయ్యటం వంటి పనుల్లో తలమునకలు కావటం మంచి ది. సామాజిక సంబంధాలు చురుకుగా ఉంచుకోవటం, తమ వయసు వారితో కలిసి గడపటం, మద్యం వంటి అలవాట్లకు దూరంగా ఉండటమూ అవసరం. ముఖ్యంగా అల్జీమర్స్ వంటి కొన్నికొన్ని తీవ్ర సమస్యల్లో కనబడే మొదటి లక్షణం కూడా మతిమరుపే కాబట్టి దీన్ని నిర్లక్ష్యం చెయ్యకూడదు. ఇలా అనిపించినప్పుడు ఒక్కసారి వైద్యులతో చర్చించటం అవసరం.

# కగార్ ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలే..

### ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అర్బన్ నక్సలైట్లుగా చిత్రీకరిస్తున్నారు

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు




**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రప్రభుత్వం జరుపుతున్న మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌లన్నీ ప్రభుత్వ హత్యలేనని సిపిఐ రాష్ట్ర సహాయకార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఆరోపించారు. గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఎఐటియుసి కొమురయ్య భవన్ లో సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశం లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్‌తో కలిసి శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో చేసిన ఎన్‌కౌంటర్లపై అనేక అనుమానాలు ఉన్నాయని, మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌లపై సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి న్యాయవిచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. మావోయిస్టులను కోర్టుకు సరెండర్ చేయకుండా టెర్రరిస్టుల మాదిరిగా చంపడం దుర్మార్గమన్నారు. కేంద్రప్రభుత్వం చేస్తున్న అన్యాయాలపై కమ్యూనిస్టులు ప్రశ్నిస్తే అర్బన్ నక్సలైట్‌గా చిత్రీకరిస్తున్నారన్నారు. మావోయిస్టులు కూడా పునరాలోచన చేయాలని, తమ పంథా మార్చుకొని లొంగిపోవాలని ఆయన కోరారు. తుపాకీ గొట్టం ద్వారా రాజ్యాధికారం సాధ్యం కాదని ఇప్పటికే కొందరు బయటికి వచ్చారని, మిగిలిన వారు కూడా తమ పంథా మార్చుకొని కమ్యూనిస్టులతో కలిసి రావాలని తక్కళ్లపల్లి పిలుపునిచ్చారు. దేశంలో బిజెపి ప్రభుత్వం నరహంతక పాలన సాగిస్తున్నదని, కేవలం కార్పొరేట్, పెట్టుబడిదారీ శక్తుల కోసమే పనిచేస్తున్నదన్నారు. ఇటీవల ప్రభుత్వరంగ సంస్థ ఎల్ఐసి చెందిన రూ.33 వేల కోట్లను ఆదానీ గ్రూపులో పెట్టుబడి పెట్టడమే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రజాసంక్షేమాన్ని విస్మరించి పాలన చేస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకం గా పోరాడేందుకు వామపక్ష ప్రజాతంత్ర శక్తులు ఏకమవ్వాలన్నారు. అందుకు మావోయిస్టులు కలిసి రావాలని కోరారు. రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ మాట్లాడుతూ వచ్చే డిసెంబర్ 26 నాటికి సిపిఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి అవుతున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ బస్సు జాతాలను నిర్వహిస్తున్నదన్నారు. నవంబర్ 15న జోడేఘాట్‌లో బస్సు జాతా ప్రారంభమైందని, భద్రాచలం వరకు కొనసాగుతుందని తెలిపారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే వందేళ్ల సభకు వేలాదిగా తరలి రావాలని ఈ సందర్భంగా శంకర్ పిలుపునిచ్చారు. సమావేశంలో డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, సిపిఐ జిల్లా నాయకులు మోటపలుకుల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శి జి.సుధాకర్‌రెడ్డి, పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్‌కుమార్, క్యాథరాజ్ సతీష్, మాతంగి రామ్‌చందర్, కొరిమి సుగుణ, నూకల చంద్రమౌళి, నేరెళ్ల జోసెఫ్, వేముల శ్రీకాంత్, గోలి లావణ్య, పొన్నగంటి లావణ్య పాల్గొన్నారు.

# ఎన్‌కౌంటర్ల పేరిట మావోయిస్టుల హతం దుర్మార్గం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి




**ప్రజాపక్షం/చిగురుమామిడి :** ఎన్‌కౌంటర్‌ల పేరుతో మావోయిస్టులను హతం చేయడం దుర్మార్గమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. చిగురుమామిడి మండల కేంద్రంలోని సిపిఐ మండల సమితి కార్యాలయం ముస్కు రాజిరెడ్డి స్మారక భవన్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో చత్తీస్‌ఘడ్, ఇతర ప్రాంతాల్లో అనేకమంది మావోయిస్టులను చంపారని, ఈనెల 27,28 తేదీలలో దేశంలోని అన్ని రాష్ట్రాల డిజిపి, ఐజిల సమావేశం చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో జరపాలని చూస్తున్నారన్నారు. ఆ సమావేశాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రారంభించి ప్రధాని మోడీ ముగిస్తారని తెలిసిందని, ఆలోపు మావోయిస్టులను పూర్తిగా అంతం చేయాలనే కుట్ర జరుగుతోందన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలకు పాల్పడడం మంచిది కాదన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై చెప్పు విరిగితే ఇప్పటివరకు సరైన చర్యలు తీసుకోలేదంటే కేంద్రప్రభుత్వ వైఖరిపై అనుమానం కలుగుతుందన్నారు. నియంతృత్వ ఫ్యూడల్ వ్యవస్థ పునరావృతం అయ్యే అవకాశాలు ఉన్నాయనే అనుమానం కలుగుతుందన్నారు. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడే అవకాశాలు ఉన్నాయన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం నాలుగు కాలాలపాటు ఉండాలంటే ప్రగతిశీల, లౌకిక శక్తులు, వామపక్షాలు ఏకమై కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి, ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమైతేనే బిసి రిజర్వేషన్ల పెంపు సాధ్యమవుతుందని, కానీ బిజెపి ఎటు తేల్చకపోవడం అన్యాయమన్నారు. రిజర్వేషన్ల పెంపుపై రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని పక్షాలతో పాటు బిసి సంఘాలను ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి పెంచాలన్నారు. నిరంతరం ప్రజల మధ్య ఉండి ప్రజల కోసం పనిచేసే సిపిఐ స్థానిక ఎన్నికల్లో పోటీ చేస్తుందన్నారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ వందేళ్ల ఉత్సవాల బహిరంగ సభ విజయవంతం కోసం రాష్ట్రవ్యాప్తంగా మూడు ప్రచార జాతాలు జరుగుతున్నాయన్నారు. జోడేఘాట్‌లో ప్రారంభమైన జాత 21న భద్రాచలంలో ముగియనుందని తెలిపారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందె స్వామి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, అందె చిన్నస్వామి, చాడ శ్రీధర్‌రెడ్డి, బోయిని సర్దార్ వల్లభాయ్ పటేల్, మావురపు రాజు, తేరాల సత్యనారాయణ, బూడిద సదాశివ, మండల సహాయ కార్యదర్శి పైడిపల్లి వెంకటేష్, సింగిల్‌విండో డైరెక్టర్ ముద్రకోల రాజయ్య, గోలి బాపురెడ్డి, మహిళా సమాఖ్య నాయకురాలు రాకం అంజవ్వ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ఉపాధి అవకాశాలు పెంచాలి

### మహిళా సమాఖ్య మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి పద్మావతి డిమాండ్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** మహిళలకు ఉపాధి అవకాశాలు పెంచాలని, అందుకు ప్రభుత్వం ఆర్థిక సహకారం అందించాలని మహిళా సమాఖ్య జిల్లాకార్యదర్శి కొండికంటి పద్మావతి డిమాండ్ చేశారు. గురువారం మహిళా సమాఖ్య మహబూబ్‌నగర్ పట్టణ కమిటీ కార్యదర్శి ఇందిర అధ్యక్షతన ఓల్డ్ మోతి నగర్‌లో జరిగిన సమావేశానికి ఆము హాజరై మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలు ఉపాధి కరువై అనేక అవస్థలు పడుతున్నారు. ఓవైపు నిత్యావసర ధరలు కొండెక్కి కూర్చున్నాయి. రోజు కూలీ చేసే మహిళలకు పెరుగుతున్న నిత్యావసరల ధరలు పెనుభారంగానే మారిందన్నారు. ఊర్లో ఉపాధిలేక పట్టణాలకు వలస వస్తే ఇంటి అద్దెల భారం పెరిగిపోయి పేదవాళ్లు అప్పుల పాలయ్యే పరిస్థితి వచ్చిందన్నారు. పేద, మధ్య తరగతి మ హిళలు ఇంటి అద్దెలు కట్టలేక దినదిన గండంగా గడుపుతున్నారన్నారు. గత ప్రభుత్వం మహిళలకు ఇండ్లు నిర్మించి ఇస్తామని మాటతప్పిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా అర్హులైన మహిళలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇవ్వాలని, గ్రామాల నుంచి వలస వచ్చిన మహిళల ఉపాధికి అవకాశాలు కల్పించి, ఆర్థిక సహకారం అందించాలని కోరారు. సమావేశం అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. శాఖ అధ్యక్షురాలిగా మున్ని బేగం, కార్యదర్శిగా కృష్ణవేణి, సభ్యులుగా ఆలూరు లక్ష్మమ్మ, అంజమ్మ, యాదమ్మ, జహేదా, అమీనా బేగం, షబానా, హర్షబేగం, భావన, సుభద్రమ్మ, అంజమ్మ, రహీమా బేగం ఎన్నికయ్యారు.




## కార్మికులకు అన్యాయం జరగనీయం

### వాసిరెడ్డి సీతారామయ్య



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణిలో పనిచేసే ఏ ఒక్క కార్మికుడికి అన్యాయం జరగనీయమని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పేర్కొన్నారు. గురువారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియాలోని జిడికె 2వ ఇంక్లైన్‌లో జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ సింగరేణిలో నలబై శాతం మంది కార్మికులు విధులకు హాజరు కావడం లేదని హాజరు శాతం తగ్గించేందుకు యాజమాన్యం నూట యాభై మస్టర్ల సర్క్యులర్‌ను జారీ చేసిందని, దీనిని విధులకు రెగ్యులర్‌గా హాజరయ్యే వారికి మినహాయింపు ఇవ్వాలని ఈనెల 10న జరిగిన స్ట్రక్చర్ సమావేశంలో సూచించడం జరిగిందన్నారు. సింగరేణిలో ప్రతిరోజు నలబై శాతంమంది కార్మికులు విధులకు హాజరు కావడం లేదని దీనితో బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం చూపడంతో క్రమ శిక్షణ చర్యల కింద ఈ సర్క్యులర్‌ను జారీ చేయడం జరిగిందని యాజమాన్యం పేర్కొందన్నారు. సర్క్యులర్‌తో రెగ్యులర్‌గా విధులు నిర్వహించే వారిని కూడా నెలలో 16/20 మస్టర్లు చేయలేదని వారు తమ కుటుంబ సభ్యులతో కలిసి కౌన్సిలింగ్‌కు రావాలని యాజమాన్యం నోటీసు బోర్డులో పేర్కొనడంతో చాలామంది కార్మికులు ఆందోళన వ్యక్తంచేశారని దీనిని ఎఐటియుసి తీవ్రంగా వ్యతిరేకిస్తూ కౌన్సిలింగ్ విధానం రద్దు చేయాలని కోరడంతో యాజమాన్యం అంగీకరించి ఒత్తిడి చేయమని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. కార్మికులకు, వారి కుటుంబ సభ్యులందరికీ మెరుగైన వైద్యం అందించేందుకు హైదరాబాద్‌లో సొంత కార్పొరేట్ హాస్పిటల్ ఏర్పాటు డిమాండ్ చేయడం జరిగిందన్నారు. కార్మికులకు ప్రమోషన్స్, ఖాళీపోస్టుల భర్తీ, వివిధ సం క్షేమ పథకాల అమలు, మారుపేర్లు విజిలెన్స్ కేసుల సమస్య పరిష్కారం, డిస్మిస్‌ఐన కార్మికులకు ఒకసారి అవకాశం ఇవ్వాలని తదితర కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎఐటియుసి నిరంతరం కృషి చేస్తుందన్నారు. సమావేశంలో ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, అక్బర్‌అలీ, రంగు శ్రీను, మిట్ట శంకర్, సిర్ర మల్లికార్జున్, పొన్నాల వెంకటయ్య, పెద్దెల్లి శంకర్, పి.రవి, అజీంపాషా, పర్లపెల్లి రామస్వామి, సదానందం, సానా జలపతి, అఫ్రోజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు గీత వృత్తిదారుల రాష్ట్ర సదస్సు

### గీత పనివారల సంఘం కరీంనగర్ జిల్లా కార్యదర్శి న్యాలపట్ల రాజు

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ :** గీత వృత్తిదారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 22న హైదరాబాదులో తలపెట్టిన గీత పనివారల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి న్యాలపట్ల రాజుగౌడ్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ప్రభుత్వం గీత కార్మికుల కోసం ఇచ్చిన జిఒలు కాగితాలకే పరిమితమవుతున్నాయన్నారు. గీత కార్మికులకు చెల్లించాల్సిన ఎక్స్‌గ్రేషియా బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సేఫ్టీ కిట్స్ పంపిణీ కొంతమందికే ఇచ్చారని, అర్హులైన వారందరికీ ప్రభుత్వం అందించాలని కోరారు. గీత వృత్తిదారులకు ఇచ్చే పెన్షన్ రూ.5వేలకు పెంచాలన్నారు. అర్హులైన గీత కార్మికులందరికీ గుర్తింపు కార్డులు, సేఫ్టీకిట్స్, మోటార్ సైకిల్ అందించాలని, జిఒ 560 ప్రకారం చెట్ల పెంపకానికి పది ఎకరాల భూమిని, కల్లు దుకాణాల నిర్మాణానికి భూమిని కేటాయించి ఆర్థిక సహాయం అందించాలన్నారు. స్కిల్ యూనివర్సిటీలో వృత్తిదారులకు వృత్తి శిక్షణ పరిశోధన, మార్కెటింగ్ కోర్సులు ప్రవేశపెట్టాలని, రాష్ట్ర గీత పారిశ్రామిక ఆర్థిక సహకార కార్పోరేషన్‌కు నిధులు ఇచ్చి ఎన్నికలు జరపాలని, వృత్తి ఆధునీకరణ పరిశ్రమగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర సదస్సుకు గీత కార్మికులు హాజరుకావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గీత పనివారల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్‌కుమార్‌గౌడ్, పైడిపల్లి రాజుగౌడ్, నల్లగొండ శ్రీనివాస్ గౌడ్, బుర్ర సతీష్ గౌడ్, బుర్ర చంద్రశేఖర్ గౌడ్, గట్టు కృష్ణగౌడ్ పాల్గొన్నారు.





# స్థానికం REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## అక్రమ ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ప్రజాపక్షం/ నారాయణపేట్ : నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం తెల్లవారు జామున 6:00 గంటల ప్రాంతంలో కోటకొండ శివారులో అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్ గుర్తించి పట్టుకున్నారు. కావలి నరేష్ ' ఆంజనేయులు తండ్రి శ్రీధర్, కోయిల కొండ మండలనికి చెందిన వ్యక్తి, కోయిలకొండ నుండి కొటకొండకు అక్రమంగా ఇసుక తరలిస్తుండగా రూరల్ పోలీసులు ఆపి విచారణ జరిపి, వాహనంతో సహా పోలీస్ స్టేషన్ కు తరలించి కావలి నరేష్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాముడు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు కొనసాగుతాయని, ఇలాంటి చట్ట విరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొనవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



## ట్యాంకర్‌ను ఢీకొన్న బస్సు
### డ్రైవర్ సమయస్ఫూర్తితో ప్రయాణికులు సురక్షితం
### మహబూబ్‌నగర్ జిల్లాలో ఘటన

ప్రజాపక్షం/జడ్చర్ల: ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొంది. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మం దలం మాచారం వద్ద జాతీయ రహదారిపై గురు వారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు. ఏపీలోని చిత్తూరు నుంచి 26 మంది ప్రయాణికులతో హైదరాబాద్ వెళ్తున్న జగన్ ట్రావెల్స్‌కు చెందిన ప్రైవేట్ బస్సు ముందు వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొనగా వెంటనే అప్రమత్తమైన బస్సు డ్రైవర్ ప్రయాణికులను బస్సులో నుంచి బయటికి దించాడు. అయితే ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో ట్యాంకర్‌లోని యాసిడ్ కెమికల్ బయటకు లీక్ అయింది. జడ్చర్ల పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని నివారణ చర్యలు చేపట్టారు. హైవేపై నిలిచిపోయిన ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

## ఇందిరమ్మ ఇండ్ల ప్రొసిడింగ్స్ పంపిణీ



ప్రజాపక్షం/ ఉట్కూర్ : ఉట్కూరు మండల కేంద్రంలో ఎంపిడిఓ ఆఫీసులో ఉట్కూర్ 16, నాగిరెడ్డిపల్లి 5, ఓబులాపురం 4, అవసలోని పల్లి 3 ఇందిరమ్మ ఇండ్ల ప్రొసిడింగ్ పంపిణీ చేశారు.కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విగ్నేశ్వర్ రెడ్డి, గ్రామ అధ్యక్షుడు లింగం, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్, మాజీ సర్పంచ్ సూర్య ప్రకాశ్ రెడ్డి, కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ మోట్కుర్, బాలరెడ్డి మాజీ జెడ్పిటిసి మన్నెమ్మ మైనార్టీ నాయకులు కోఆప్షన్ సభ్యులు అబ్దుల్ రెహమాన్, అర్బద్ అంజాద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## ప్రైవేట్ వాహనాలకు స్టిక్కర్లు

ప్రజాపక్షం / వీపనగండ్ల : మండల కేంద్రంలో ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రైవేట్ వాహనాలకు గుర్తింపు సంఖ్య స్టిక్కర్లను స్థానిక ఎస్సై కె రాణి అందజేశారు. ఆమె మాట్లాడుతూ ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా లైసెన్స్, వాహన ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్‌ని కలిగి ఉండాలని సూచించారు. అతి వేగంగా నడపడం, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం నేరమన్నారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు జీపు కురుమయ్య, అధ్యక్షుడు అశోక్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మీసాల వీరస్వామి, కార్యదర్శి వీరబాబు, కోశాధికారి రాంబాబు గౌడ్, శేఖర్, సాయిబాబు, రవి, సాయి, బాలకృష్ణ, మహేష్, జీప్ రాజు, శివ, ఆకుపోగల రాజు, దేవ శంకర్, రామస్వామి పాల్గొన్నారు.

# వడ్లు కొన్న వెంటనే రశీదు ఇవ్వాలి



### మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే మేఘారెడ్డి

ప్రజాపక్షం/వనపర్తిన్యూటౌన్ : రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ఇబ్బందులు కల్పించకుండా కొనుగోలు చేసి డబ్బులు త్వరగా అందే విధంగా చూడాల్సినబాధ్యత అధికారులపై ఉందని రాష్ట్ర అబ్కారీ, పర్యాటకసాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆదేశించారు. గురువారం వనపర్తి జిల్లా ఐడిఓసిలో వారుజిల్లాకలెక్టర్‌ఆదర్శ్ సురభి కలిసి ఐకెపి, సహకార సంఘం కొనుగోలు కేంద్రాల యజమానులు, రైస్ మిల్లర్లు, ఎపియంలతో సమీక్ష నిర్వహించారు. వారు మాట్లాడుతూ రైతులు వడ్లు కొనుగోలు కేంద్రానికి వడ్లు తెచ్చినప్పుడు 17 శాతం తేమ శాతం, తాలు, మట్టి లేకుండా చూసుకొని తూకం చేసి అక్కడే రైతుకు రశీదు ఇవ్వాలన్నారు.అలాజరక్కపోవడంతో రైతులు రైస్ మిల్లు చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో కొనుగోలు కేంద్రాలకు రానున్న దాదాపు 3.50లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను తరలించడానికి 350 లారీలు అవసరం అవుతాయి, కానీ ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లు పూర్తి స్థాయిలో లారీలు పెట్టకపోవడం వల్ల, రైస్ మిల్లులోవడ్లు సకాలంలో దించుకోకపోవడంవల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మిల్లర్లు మిల్లుకు వచ్చిన దాన్యం నుండి ఒక్కకిలో కూడా తరుగు తీయడానికి వీలు లేదని హెచ్చరించారు. జిల్లాలో మొత్తం 396 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు చేసి ఇప్పటి వరకు 330 కొనుగోలు కేంద్రాలుప్రారంభించినట్లు కొల్లాపూర్ ప్రాం తంలో వరి కోతలు ఆలస్యంగా ప్రారంభించనున్నట్లు కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. శాసన సభ్యులు తూడి మేఘారెడ్డి మిగతా రాష్ట్రాల్లో మిల్లర్లు వంద శాతం బ్యాంకు గ్యారంటీ ఇస్తున్నారని, ఇక్కడ కేవలం 10 శాతం బ్యాంకు గ్యారం టీ ఇవ్వడానికి ఇబ్బందులు ఏమున్నాయని మిల్లర్లను ప్రశ్నించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్ ఖీమ్య నాయక్, వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ బి.శ్రీనివాస్‌గౌడ్, పెబ్బేరు మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమోదిని, గ్రంథాలయ చైర్మన్ గోవర్ధన్ సాగర్, జిల్లా దిశ కమిటీ సభ్యురాలు దనలక్ష్మి, శంకర్ నాయక్, జిల్లా అధికారులు, రైస్ మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, ఎపీఎంలు, ఎఈఓలు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్: ప్రభుత్వ నిబంధనల ప్రకారం 17శాతం తేమ ఉన్న ధాన్యాన్ని కొనుగోలుచేయాలని, తేమశాతం పేరుతో రైతులను ఇబ్బంది పెట్టవద్దని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. కుడికిల్ల, నార్లాపూర్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలనుప్రారంభించారు. కొనుగోలుచేసిన ధాన్యానికి సంబంధించి రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదుచేయాలని, రైతుల అకౌంట్లోకి డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. రైతులందరూ తమ ధాన్యాన్ని దళారులకు కాకుండా కొనుగోలు కేంద్రాల్లోనే క్రయవిక్రయాలు జరపాలన్నారు.

## పుస్తక పఠనంతోనే వికాసం



ప్రజాపక్షం/వీపనగండ్ల : విద్యార్థులు పుస్తక పఠనం చేయడం వలన జ్ఞానాన్ని, సమయస్ఫూర్తిని పెంపొందించు కోవచ్చు అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జ్ వి.రజని అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి వి.రజని విద్యార్థులకు ఆర్టికల్ (14), ఆర్టికల్ (19), ఆర్టికల్ (21) ప్రాముఖ్యతను వివరించారు. బాల కార్మికుల నిర్మూలన చట్టం, మోటర్ వాహనాల చట్టం, ఉచిత, నిర్బంధ విద్య హక్కు చట్టం, సైబర్ క్రైమ్స్, డ్రగ్ అబ్యూస్ గురించి అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ శివ గౌడ్, సీనియర్ లెక్చరర్ లక్ష్మీ నారాయణ, స్టూడెంట్స్ కౌన్సిల్ కల్పన, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భానుప్రకాష్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## న్యాయవాది క్షమాపణ చెప్పాలి
### రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం
### రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ జహంగీర్

ప్రజాపక్షం/వనపర్తి:వనపర్తి పట్టణంలోని దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘంఆధ్వర్యంలో సంఘ ప్రతినిధులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టణంలోదాదాపు 50 సంవత్సరాలుగా డాక్యుమెంట్ రైటర్లు ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలందిస్తూ తమ జీవనం కొనసాగిస్తున్నారని గుర్తు చేశారు. నాడు చేతిరాతతో డాక్యుమెంట్లు సిద్ధం చేసే పరిస్థితి నుండి నేటి కంప్యూటరైజ్ వరకు, అన్ని మార్పులకు అనుగుణంగా రైటర్లు నైపుణ్యాన్ని పెంచు సేవలందిస్తున్నారని తెలిపారు. ఇటీవల ఒక న్యాయవాది పత్రికలలో డాక్యుమెంట్ రైటర్లు కట్, కాపీ, పేస్ట్‌చేస్తారన్నవ్యాఖ్యలనుసంఘంఖండించింది. సంఘ నాయకులుమాట్లాడుతూ...లీగల్ అవగాహన లేకపోతే, డాక్యుమెంట్ రైటర్లు సిద్ధం చేసిన పత్రాలు బ్యాంకుల్లో లోన్లకు ఎలా అర్హత పొందుతున్నాయి? కోర్టుల్లో ఎలా చెల్లుబాటు అవుతున్నాయి? అని ప్రశ్నించారు. ఆయనచేసిన వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పాలన్నారు.రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ జహంగీర్, వనపర్తి జిల్లా అధ్యక్షుడు సంద రమేష్, వనపర్తి సబ్ ఆఫీస్ అధ్యక్షుడు కాటమోని కృష్ణగౌడ్, సీనియర్ డాక్యుమెంట్ రైటర్‌ఆదిల్, ప్రధాన కార్యదర్శి సి.ఎల్ శివ జయ రాములు ఉన్నారు.

## చిన్న నిర్లక్ష్యమే పెద్ద ప్రమాదానికి దారితీస్తుంది!
### వనపర్తి రూరల్ ఎస్ఐ జలందర్‌రెడ్డి



ప్రజాపక్షం/ వనపర్తి : గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలో వనపర్తి రూరల్ పోలీసుల నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో ఓ ఆటోలో సామర్థ్యానికి మించి 18మంది రాక్ వుడ్ స్కూల్ పిల్లలను ప్రమాదకరంగా తీసుకెళ్తున్న ఆటోను రూరల్ ఎస్సై, ట్రాఫిక్ ఎస్సైలు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.కేసు నమోదు చేసి ఆర్టీఓ విభాగానికి అప్పగించారు. పాఠశాల విద్యార్థులను తరలించే ప్రతి డ్రైవర్, వాహన యజమాని తప్పనిసరిగా భద్రతా నిబంధనలు పాటించాలి. ఆటోలు లేదా ఇతర వాహనాల్లో సామర్థ్యానికి మించి పిల్లలను ఎక్కించడం చట్టవిరుద్ధమే కాకుండా వారి ప్రాణాలకు ముప్పు కలిగించే ప్రమాదకర చర్య. పిల్లల భవిష్యత్తు వారి తల్లిదండ్రులకే కాదు..సమాజానికి అమూల్యం. అందుకే తల్లిదండ్రులు, పాఠశాల నిర్వాహకులు తమ పిల్లలను వాహనాల్లో ఎలా తీసుకెళ్తున్నారు అన్న విషయంపై అప్రమత్తంగా ఉండాలి. నిర్లక్ష్యంపై ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ ఉండదని వనపర్తి పోలీసులు స్పష్టం చేశారు.

## ట్రేడ్ లైసెన్స్ షెడ్యూల్ విడుదల

ప్రజాపక్షం/హైదరాబాద్ : జిహెచ్ఎంసి 2026 సంవత్సరానికి కొత్త ట్రేడ్ లైసెన్స్‌ల జారీ, అలాగే ఇప్పటికే ఉన్న ట్రేడ్ లైసెన్స్‌ల రిన్యూవల్ కోసం షెడ్యూల్‌ను ప్రకటించింది. 2026 జనవరి 1 నుండి డిసెంబర్ 31 వరకు గల కాలానికి వర్తించేలా లైసెన్స్‌లు జారీ చేయనున్నారు. సాధారణంగా ట్రేడ్ లైసెన్స్ గడువు ముగియడానికి 30 రోజుల ముందే దరఖాస్తు చేసుకోవాలి. అయితే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉండటంతో, దరఖాస్తుల చివరి తేదీని పొడిగిస్తూ డిసెంబర్ 20, 2025 వరకు జరిమానా లేకుండా దరఖాస్తు చేసుకునేందుకు జిహెచ్ఎంసి వీలుకల్పించింది.

### సవరించిన షెడ్యూల్ ఇలా..

–డిసెంబర్ 20, 2025 వరకు– జరిమానా లేదు

–ఫిబ్రవరి 19, 2026 వరకు –25 శాతం జరిమానా (60 రోజుల ఆలస్యం వరకు)

–ఫిబ్రవరి 20, 2026 నుండి –50 శాతం జరిమానా (60 రోజులకంటే ఎక్కువ ఆలస్యం)

వ్యాపారులు, దుకాణాలు, సంస్థలు నిర్ణయించిన గడువుల్లోపే ట్రేడ్ లైసెన్స్ రిన్యూవల్ లేదా కొత్త లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకుని జరిమానాల నుంచి మినహాయింపు పొందాలని జిహెచ్ఎంసి సూచించింది. దరఖాస్తులు జిహెచ్ఎంసి వెబ్‌సైట్, మీ సేవ కేంద్రాలు, లేదా జిహెచ్ఎంసి సర్కిల్ సిటిజన్ సర్వీస్ సెంటర్‌లలో అందుబాటులో ఉంటాయి.

# సమష్టి కృషితో పకడ్బందీగా పంచాయతీ ఎన్నికలు
### కలెక్టర్ బదావత్‌సంతోష్



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు జిల్లాల యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని రాష్ట్ర ఎన్నికల కమీషనర్ రాణికుముదిని జిల్లాల కలెక్టర్లు, ఎస్పిలకు సూచించారు. గురువారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లు, ఎస్పిలతో స్థానిక సంస్థల ఎన్నికలపై వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్, జిల్లా ఎస్పి గైక్వాడ్ వైభవ్‌రఘునాథ్ నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ నుండి వీడియోకాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలోని 20 మండలాల పరిధిలో ఉన్న ఎంపిటిసి, జడ్పిటిసి స్థానాలకు స్థానిక సంస్థల ఎన్నికలనిర్వహణ ఏర్పాట్లపై కలెక్టర్ ఈసందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమీషనర్ రాణి కుముదినికి వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల అధికారి సూచనలమేరకు జిల్లాలో సిబ్బంది, భద్రతాపరమైన అంశాలపై తీసుకుంటున్న జాగ్రత్తలు తదితర వివరాలను వివరించారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఓటర్ జాబితా పక్కాగా నిర్వహించి ఎన్నికలను సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. వీడియోకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ దేవసహాయం, జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు, డిప్యూటి సిఇఓ గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే మేఘారెడ్డితో భేటీ

ప్రజాపక్షం / పెబ్బేరు : పెబ్బేరు పట్టణ ఇలవేల్పు శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయ నిర్మాణానికి సంబంధించి గురువారం ఉదయం శ్రీ కృష్ణ యాదవ సంఘం సభ్యులు స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డిని తన స్వగృహంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఆలయ నిర్మాణానికి తనవంతు సాయంగా పది లక్షలు అందజేస్తానని హామీ ఇచ్చారు.నూతనంగా ఎన్నికైన శ్రీ కృష్ణ యాదవ సంఘం అధ్యక్షుడు మహేష్‌యాదవ్, సభ్యులను ఎమ్మెల్యే సన్మానించారు. జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, శ్రీకృష్ణ యాదవ సంఘం సభ్యులు ఆంజనేయులు, ఎల్లస్వామి, బీసీ వెంకట్, నీలయ్య, పూజారి చంద్రయ్య, బలరాం, శ్రీకాంత్, పట్టణ కాంగ్రెస్ నాయకులు భాను ప్రకాష్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు భాను ప్రకాష్ రెడ్డి, బుర్రమోని రాములు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు



ప్రజాపక్షం/కల్వకుర్తి : కల్వకుర్తి మండల వివిధ గ్రామాల పరిసర గ్రామాలలో గల దుందుభి వాగునుండి అక్రమంగా ఇసుక రవాణాచేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ ఇబ్రహీం తెలిపారు. గురువారం కల్వకుర్తి మండలపరిధిలోని లింగసానిపల్లి గ్రామంనుండి కల్వకుర్తి పట్టణకేంద్రంలో గల ఇందిరమ్మ నూతన ఇండ్లకు ఇసుక రవాణా చేసేందుకు అనుమతి ఇవ్వగా ఇదే అదునుగా చేసుకొని అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని లింగసానిపల్లి గ్రామానికి వెళ్లి ఇసుక రవాణాను నిలిపివేయడంతో పాటు వాగులోనికి ట్రాక్టర్లు వెళ్లకుండా కందకం తీయించడం జరిగిందని తెలిపారు. ఇకపై ఇసుక రవాణాకు ఎలాంటి అనుమతి ఇవ్వడం జరగదని అనుమతిలేకుండా ఎవరైనా ఇసుక అక్రమంగా రవాణాచేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ట్రాక్టర్ యజమానులను హెచ్చరించారు.

## టెన్త్‌లో '100%' ఫలితాలు సాధించాలి
### జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

ప్రజాపక్షం/ నారాయణపేట్ : నారాయణపేట జిల్లాలో ఈ సారి పదో తరగతి పలితాలను శత శాతం సాధించేందుకు ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లాలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో 10వతరగతి పరీక్షల గురిం చి, పాఠశాలల్లో పూర్తయిన సమ్మేటివ్ అసెస్మెంట్ 1 (ఎస్ఎ 1) పరీక్షా ఫలితాల పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్ఏ 1 పరీక్షల్లో వివిధ సబ్జెక్టులలోఎక్కువ శాతం ఉత్తీర్ణత, తక్కువ శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల పై చర్చించారు. తక్కువ ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కారణాలు అడిగి వివరణ కోరారు. చాలా మంది హెచ్ఎం లు ఉపాధ్యాయులు కొరత ప్రధాన కారణంగా జవాబిచ్చారు. అయితే ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో వీలున్న పరిస్థితులను బట్టి స్థానికంగా వేరే వారిని నియమించాలని డిఈఓకు కలెక్టర్ సూచించారు. అలాగే విద్యార్థుల ఉపస్థితి పైన సమీక్షించారు. ఎక్కువ సంఖ్యలో అనుపస్థితిలో ఉన్న విద్యార్థుల గురించి వెంటనే వారి తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థులు ఉపస్థితి మెరుగు పడటానికి చర్యలు తీసుకోవాలని హెచ్ఎంలను ఆమె ఆదేశించారు. అదేవిధంగా వివిధ సబ్జెక్టులలో ఎక్కువ మంది విద్యార్థులు ఫెయిల్ కావడం పై ఆయా పాఠశాలల ఉపాధ్యాయులతో హెచ్ ఎం లు సమీక్షలు జరిపి కారణాలు విశ్లేషించి ఫలితాలు మెరుగు పర్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు.స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, డీఈఓ గోవింద రాజులు,డీఈఓ కార్యాలయ అధికారులు విజయ్ సాగర్, రాజేందర్, అన్ని మండలాల ఎంఈఓలు, జీహెచ్ఎంలు, హెచ్ఎం లు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాపక్షం/ నారాయణపేట్ : నారాయణపేట జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాల పై అవగాహన కల్పించారు.కృష్ణ చైతన్య మాట్లాడుతూ ప్రతి ఆటో డ్రైవర్ తప్పనిసరిగా సరైన పత్రాలు (లైసెన్స్, ఆర్‌సి, ఇన్సూరెన్స్ మొదలైనవి) కలిగి ఉండాలని, వాహనాలలో అధిక సంఖ్యలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని సూచించారు. ఎవరైన ప్రయాణికులు తమ వస్తువులు బ్యాగ్ లు, ఇతర వస్తువులు వాహనంలో మరిచిపోయినట్లయితే, నిజాయితీగా వాటిని తిరిగి అందించి నీతిని చాటుకోవాలన్నారు. ప్రజలకు భద్రత, సౌకర్యం కల్పించడంలో ఆటో డ్రైవర్లు సహకరించాలని ఎస్సై కోరారు.

## కలెక్టర్‌ను కలిసిన.. తహసీల్దార్ల కార్యవర్గం



ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ (టిజిటిఏ) హైదరాబాద్ జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు జిల్లా కలెక్టర్ దాసరి హరిచందనను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. అధ్యక్షులు ప్రేమ్‌కుమార్, బాలశంకర్‌తో పాటు తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ కలెక్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు పుష్పగుచ్ఛంఅందజేశారు. అనంతరం వారు అదనపు కలెక్టర్ ఖదీరావన్, అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షుడు వెంకట్ రామిరెడ్డి, సంయుక్త కార్యదర్శి పాండు, కార్యనిర్వాహక కార్యదర్శి సునీత, సాంస్కృతిక కార్యదర్శి నిహారిక, స్పోర్ట్స్ కార్యదర్శి అన్వర్, కోశాధికారి నయ్యూముద్దీన్, టిజిటిఏ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు విజయలక్ష్మి, శ్రీదేవి, అసోసియేట్ అధ్యక్షుడు నర్సయ్య పాల్గొన్నారు.

## కెమెరాలతోనే నేరాల అదుపు

ప్రజాపక్షం/కృష్ణ: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలది కీలక పాత్ర అని సిఐ రాంలాల్ అన్నారు. గురువారం కృష్ణ మండలం గుడెబాల్లూరులో గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల భద్రత నేరాల నియంత్రణ, నిందితులను గుర్తించడానికి, గ్రామాల్లో అసాంఘికకార్యలాపాలు జరగకుండా ప్రశాంతమైన వాతవరణం కల్పించడంలో కెమెరాలు ఉపయోగపడుతాయన్నారు. ప్రతీ గ్రామంలో సిసి కెమెరాల ఏర్పాటుకు స్థానిక ఎస్ఐలు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఎస్సై నవీద్, వాకిటి నారాయణ, మద్దూర్ వెంకటేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## 42 శాతం రిజర్వేషన్ల అమలు చేశాకే ఎన్నికలు నిర్వహించాలి

ప్రజాపక్షం/జడ్చర్ల: 42 శాతం రిజర్వేషన్ల అమలు చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని సిగ్నల్ గడ్డ ధర్నా చౌక్ దగ్గర బీసీ జెఎసి, బీసీ జాగృతి సేన, బీసీ విద్యార్థి సంఘం అధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. జెఎసి నాయకులు మాట్లాడుతూ రిజర్వేషన్లు అమలు చేసే వరకు సర్పంచు ఎన్నికలను వాయిదా వేయాలని డిమాండు చేశారు. శీతకాలం పార్లమెంటు సమావేశాలలో రాహుల్ గాంధీ ఇండియా కూటమి పార్లమెంటు సభ్యులతో కలిసి బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి, బిల్లును కేంద్ర ప్రభుత్వం అమలు చేసే వరకు ఒత్తిడి తేవాలని కోరారు. దేశంలోని మెజార్టీ ప్రజలైన బీసీల 70సంవత్సరాలు ఆకాంక్షను కేంద్ర ప్రభుత్వం గుర్తించి పార్లమెంటులో బీసీ రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టి వార్డు మెంబర్ నుంచి పార్లమెంటు మెంబర్ వరకు బీసీలకు చట్టబద్ధతతో కూడుకున్న రిజర్వేషన్లు కల్పించాలని డిమాండు చేశారు. బీసీ,జేఏసీకన్వీనర్,బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణ యాదవ్, నడమింటి శ్రీనివాస్, ప్రణీల్ చందర్, యంబి శ్రీకాంత్, తెలుగు సత్యం, బాగి కృష్ణయ్య, రేణుకమ్మ, కౌన్సిలర్ ఉమాశంకర్ గౌడ్, వెంకటేశ్, ఫకీర్, జహంగీర్, సురభి, విజయ్ కుమార్, శివ రాములు, చెన్నయ్య, విజయ్, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

## ఆడపిల్లలను వేధిస్తే చర్యలు



ప్రజాపక్షం/ ధన్వాడ : ధన్వాడ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాయ్స్ హైస్కూల్లో షీటీమ్ పోలీసులు విద్యార్థులకు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని గురువారం సూచించారు. షీటీమ్ పోలీసులు బాలరాజు, కవిత మాట్లాడుతూ అమ్మాయిల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, మాట్లాడిన లేదా ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ చేసిన అమ్మాయిలతో ఫోటోలు దిగి మోసం చేసిన లేదా ఎప్పుడో దిగిన ఫోటోలను మార్ఫింగ్ చేసి వేరే వ్యక్తులకు షేర్ చేస్తానని బెదిరించినా చర్యలుంటాయన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ నేరాలు అధికమయ్యాయని, అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇరుగుపోరుగు వారికి అవగాహన కల్పించాలన్నారు.ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటి కేసులను త్వరగా పరిష్కరించాలి
### ఎంపి మల్లురవి




ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటి కేసులను త్వరగా పరిష్కరించి బాధితులకు సత్వరన్యాయం అందించాలని ఎంపి మల్లురవి అధికారులను ఆదేశించారు. గురువారంనాగర్‌కర్నూల్‌జిల్లా కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్ సమావేశమందిరంలో జిల్లావిజిలెన్స్‌అండ్ మానిటరింగ్ కమిటి పిసిఆర్ 1955, పిఓఎసిటి 1989 అమలుపై సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, ఎంపి మల్లురవి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కసిరెడ్డినారాయణరెడ్డి, విజిలెన్స్ మానిటరింగ్ కమిటిసభ్యుల సమక్షంలో సమావేశం నిర్వహించారు.ఎంపి మల్లురవి మాట్లాడుతూ ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటి కేసుల్లో విచారణ వేగంగా పూర్తిచేసి చార్జ్‌షీట్‌వేస్తే బాధితులకు న్యాయంతోపాటు ప్రభుత్వ నిబంధనలమేర కుపరిహారంవెంటనే అందజేసి, పేదప్రజలకు సరైన అవగాహన కల్పించి ఎస్‌సి ఎస్‌టిల అభ్యున్నతికి కృషిచేయాలని సూచించారు. ఎస్‌సి ఎస్‌టిలపై దాడులు జరిగినవెంటనే ఎఫ్‌ఐఆర్ నమోదుచేసి పరిహారంగా బాధితులకు రూ.25వేలు చెల్లించేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లావ్యాప్తంగా ఇప్పటికి 234 ఎస్‌సి ఎస్‌టి ఫిర్యాదులు అందగా అందులో 219కేసులు అట్రాసిటి కింద ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్లు వివరించారు. వాటిలో 170 కేసులకు చార్జిషీటు వేయడం దాఖలు అయిందని , ఇప్పటివరకు 219 కేసులకు పరిహారం మంజూరు చేశామన్నారు. పోలీస్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం, అదనపు ఎస్‌పి వెంకటేశ్వర్లు, డిఎస్‌పి బుర్రిశ్రీనివాసులు, ఎస్‌సి, ఎస్‌టి కులాలనుండి ప్రాతినిథ్యం సభ్యులు ఎల్లపోగు వెంకటస్వామి, పరుషరాం, జిల్లెలరాములు, రేణయ్య, చందర్, ఆర్‌డిఓలు , జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి మెంబర్ సెక్రటరీ ఉమాపతి, అధికారికకమిటి సభ్యులు పిడి డిఆర్‌డిఏ చిన్న ఓబులేసు, జిల్లాలేబర్ అధికారి రాజ్‌కుమార్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫిరంగి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా టిప్పు సుల్తాన్ జయంతి

ప్రజాపక్షం/పెబ్బేరు:స్వాతంత్ర్య పోరాట యోధుడు టిప్పు సుల్తాన్ 274 వ జయంతి సందర్భంగా పెబ్బేరులోనిఉర్దూమీడియంస్కూల్‌లో ఎంఐఎం ఆధ్వర్యంలో ఆయనచిత్ర పటానికి నివాళులర్పించారు. పెబ్బేరు మండల ఎంఐఎం అధ్యక్షుడు ఎం.డి ఆఫ్రోజ్ కేక్ కట్ చేసి చిన్నారులకు పంపిణీ చేశారు. పెబ్బేరు మండల ఎంఐఎం పార్టీ ఉప అధ్యక్షుడు జాకీర్, జనరల్ సెక్రటరీ అమెర్, అవాజ్ కమిటీ జిల్లా సెక్రటరీ ఖాజా ఉర్దూ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ నసిరున్నీషా పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/మాడుగులపల్లి:** మండలంలోని పాములపాడు గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా వైద్య,ఆరోగ్య అధికారి పుట్ల శ్రీనివాస్ ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం రికార్డులు, రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఓపీ విభాగం,ల్యాబ్, పేషెంట్ వార్డు,ప్రసూతి గదిని పరిశీలించారు. ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అంటువ్యాధులు, అసంక్రమిత వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని వైద్యాధికారికి, ఫీల్డ్ స్టాఫ్ కి గుర్తు చేసారు.స్కూల్ హెల్త్ ప్రోగ్రాం యొక్క ప్రాముఖ్యతను తెలియచేసారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఏ.సత్యనారాయణ స్టాఫ్ నర్స్ రాములమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ లక్ష్మి నారాయణ,ఫార్మసిస్ట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాల ఘనత

## సిపిఐకే దక్కుతుంది

సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/ కోదాడ(చిలుకూరు) :** ప్రజా సమస్యలపై నిరంతరం సమరశీల పోరాటాలను చేసిన ఘనత సిపిఐకి దక్కుతుందని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. సిపిఐ వంద సంవత్సరాల ముగింపు ఉత్సవాల సందర్భంగా ఊరూరా నిర్వహిస్తున్న ప్రచార బస్సుజాతా గురువారం చిలుకూరు మండల కేంద్రం బస్టాండ్ సెంటర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా చిలుకూరు మండల పార్టీ వారికి ఘనస్వాగతం పలికారు. పార్టీ చేసిన త్యాగాలను నేటి తరానికి తెలియజేసేందుకే ప్రచార జాతను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. డిసెంబర్ 26న ఖమ్మం నగరంలో నిర్వహించు బహిరంగ సభకు కార్యకర్తలు, నాయకులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నెలికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కార్యవర్గ సభ్యులు బాల నరసింహ, మహిళా సమైఖ్య రాష్ట్ర నాయకురాలు ఉస్తేల సృజన, పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, సాహెబ్‌అలీ, కొండ కోటయ్య, దొడ్డా వెంకటయ్య, చిలువేరు ఆంజనేయులు, పిల్లుట్ల కనకయ్య, కీసర వెంకటేశ్వర్లు, కందుకూరి వెంకటయ్య, మక్క లక్ష్మి నారాయణ, బాలేబోయిన రాంబాబు, నాగేశ్వరావు, వెంకటేశ్వర్లు, శ్రీను, మహేష్, రాము, మదు, సిపిఐ నాయకులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

## మావోయిస్టులను చంపడమంటే మానవ హననం

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు జంగిల్ రాజ్ పరిపాలనకు ఇది పరాకాష్ట

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, బాల నర్సింహ

నల్లగొండ నుండి మిర్యాలగూడ వరకూ సాగిన సిపిఐ ప్రచార బస్సుజాతా



**ప్రజాపక్షం/నల్లగొండ/మిర్యాలగూడ :** సిపిఐ వందేళ్ల చరిత్రను ప్రజానీకానికి చాటెందుకు,శతాబ్ది ఉత్సవాల ముగింపు బహిరంగ సభ విజయవంతానికి ఈనెల 15న గద్వాల్ లో ప్రారంభమైన సిపిఐ ప్రచార బస్సుజాత బుధవారం రాత్రి నల్లగొండకు చేరుకొని సభ నిర్వహించి రాత్రి బస చేశారు.గురువారం ఉదయం నల్లగొండ నుండి బయలుదేరి తిప్పర్తి,మాడుగులపల్లి,వేములపల్లి మీదుగా మిర్యాలగూడ పట్టణానికి చేరుకుంది.ఈ సందర్భంగా అయా మండలలో పార్టీ శ్రేణులు జాతాకు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. మిర్యాలగూడ బైపాస్ నుండి తెలంగాణ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి జాతకు నాయకత్వం వహిస్తున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాల నర్సింహా,ఎంఎల్సి నెల్లికంటి సత్యం,ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కురిమిద్ద శ్రీనివాస్‌లను శాలువా,పూలమాలలతో సన్మానించారు.ఈసందర్భంగా తెలంగాణ చౌరస్తాలో జరిగిన సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ దేశంలో నక్సలిజని అంతం చేయాలని దురాలోచనతో మావోయిస్టులను బూటక ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చి చంపుతూ నరహంతకులుగా బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. మావోయిస్టులను చంపుకుంటూ పోవడమంటే మానవ హననం తప్ప మరొకటి కాదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు జంగిల్ రాజ్ పరిపాలనకు ఇది పరాకాష్ట అని పేర్కొన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాల నరసింహ మాట్లాడుతూ బ్రిటిష్ వారి నుండి దేశ విముక్తి కి రాజీలేని పోరాటాలు చేస్తున్నందునే ఆనాడు పార్టీపై నిషేధం విధించారాని అన్నారు. సిపిఐ 1925 డిసెంబర్ 26న,ఆవిర్భవించి నేటికీ భారత గడ్డపై వంద ఏళ్ళు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో లక్షలాది మందితో జరిగే సిపిఐ ముగింపు ఉత్సవాలను జయప్రదం చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి,లోడంగి శ్రవణ్ కుమార్,కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు,పబ్బు వీరస్వామి,మండల కార్యదర్శులు అంజనపల్లి రామలింగం,సహాయ కార్యదర్శి ధనవత్ శాంత,జిల్లా యాదగిరి,పోలేపల్లి ఉదయ్ కుమార్, పుల్లంల అబ్రహం,నల్లగొండ పట్టణ కార్యదర్శికెవిఎస్ రెడ్డి,ప్రజానాట్యమండలిజిల్లా అధ్యక్షులు బి.జగన్,జిల్లా యాదయ్య,గజాల లక్ష్మి నర్సింహారెడ్డి,ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు ఎం డి సయిద్,రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిల్లా కంకయ్య,గిరిజన సమాఖ్య కార్యదర్శి దిరావత్ లింగనాయక్ దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వల్లపట్ల వెంకన్న,మహిళా సమాఖ్య నియోజకవర్గం అధ్యక్ష కార్యదర్శులు, ఎర్రబోతు పద్మ, దాసర్ల దుర్గమ్మ, షమీమ్ తదితరులు పాల్గొన్నారు.



## దోపిడీ పీడనలు లేని సమసమాజ స్థాపనే సిపిఐ లక్ష్యం

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్

**ప్రజాపక్షం/గరిడేపల్లి :** భారతదేశంలో ఏనాటికైనా ఎర్రజెండా నాయకత్వంలో దోపిడి పీడనలు లేని సమసమాజాన్ని సాధించడమే సిపిఐ లక్ష్యమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాల నరసింహ, సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్‌లు అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ శత జయంతి ఉత్సవాల సందర్భంగా సిపిఐ రాష్ట్ర కమిటి నాయకత్వంలో జరుగుతున్న బస్సు ప్రచార జాత గురువారం గరిడేపల్లి మండలానికి విచ్చేసింది. ఈ జాతాకు సిపిఐ మండల నాయకత్వం భారీ మోటర్ సైకిల్ ర్యాలీతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోకల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ సిపిఐ వంద సంవత్సరాలుగా పేద ప్రజల పక్షాన అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే ముగింపు ఉత్సవాలకు అత్యధిక సంఖ్యలో ప్రజలు హాజరై ఖమ్మం బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కురుమద్ది శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు సృజన, రాష్ట్ర సమితి సభ్యుడు ఉస్తెల నారాయణరెడ్డి, మండల కార్యదర్శి కడియాల అప్ప య్య, అమరారపు పున్నయ్య, ముళ్ల జానయ్య, పోటు బుజ్జిబాబు, చవ్వా వెంకన్న, త్రిపుర సుధాకర్ రెడ్డి, యడ్ల అంజిరెడ్డి, ఈశ్వరాచారి పాల్గొన్నారు.

## వందేళ్ల పోరాట చరిత్ర సిపిఐదే



సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/వేములపల్లి:** వంద సంవత్సరాల సిపిఐ చరిత్రలో బడుగు ,బలహీన వర్గాల కోసం ఎన్నో రాజీ లేని పోరాటాలు చేసిందని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎం ఎల్ సి నెల్లికంటి సత్యం అన్నారు. ఈనెల 15 న గద్వాల్ లో ప్రారంబమైన బస్సు జాత గురువారం వేములపల్లి మండలంకు చేరుకుంది. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు జాతాకు పెద్ద ఎత్తున స్వాగతం పలికరు. ఈసందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఎం ఎల్ సి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ప్రజల ఎజెండానే సిపిఐ ఎల్లప్పుడు పోరాడుతున్నదని అన్నారు. బిజెపి ఏ రోజు కూడా దేశం కోసం పోరాడలేదు అని,ఏ ఒక్క నాయకుడు కూడా ఒక్క రోజు జైలు కు వెళ్లలేదు కానీ,దేశభక్తి పేరుతో ఓట్లు అడుగుతారని విమర్శించారు. డిసెంబర్26 న ఖమ్మం లో లక్షలాది మంది తో జరగబోయే భారీ బహిరంగంగా సభకు సిపిఐ నాయకులు ,కార్యకర్తలు తరలి వచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి లోడంగి శ్రవణ్ కుమార్,కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి,బంటు వెంకటేశ్వర్లు, జిల్లా యాదయ్య ,వేములపల్లి మండల కార్యదర్శి జిల్లా యాదగిరి,మాడుగులపల్లి మండల కార్యదర్శి పుల్లెంల అబ్రహం,ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు బి జగన్, గణేష్ నాయక్, ,దోటి పాండరి లు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మాడుగులపల్లి :** సిపిఐ వంద ఏళ్ల ముగింపు సభ విజయవంతానికి ఈనెల 15 న, గద్వాల్ లో ప్రారంబమైన బస్సు జాత గురువారం మాడుగులపల్లి మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు జాతాకు పెద్ద ఎత్తున స్వాగతం పలి జాతాకు నాయకత్వం వహిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాల నర్సింహా,ఎం ఎల్ సి నెల్లికంటి సత్యం ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కురిమిద్దె శ్రీనివాస్ లను శాలువా పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి లోడంగి శ్రవణ్ కుమార్,కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి,మండల కార్యదర్శి పుల్లెంల అబ్రహం, సహాయ కార్యదర్శి కాంకణరాల శ్రీనివాస్ రెడ్డి,దోటి పాండరి,మల్లెపల్లి మల్లయ్య,వెంకటయ్య,గవ్వనాగిరెడ్డి,పుల్లెంల యాదమ్మ,అండాలు,లక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపోరాటాలతో పునీతమైన ఎర్రజెండా



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ (నేరేడుచర్ల) :** ప్రజాపోరాటాలతో ఎర్రజెండా పునీతమైందని వంద ఏండ్ల సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో ప్రజాఉద్యమాలకు నాయకత్వం వహించిన ఘనచరిత్ర సిపిఐదేనని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలో ప్రారంభమైన సిపిఐ 100వ వార్షికోత్సవాల ప్రచార జాతను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గత 100 సంవత్సరాలుగా భారతదేశంలో జరిగిన అన్ని ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్న ఏకైక పార్టీ సిపిఐ అని అన్నారు. జాతాలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాలనరసింహ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కురుమిద్దె శ్రీనివాస్, సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు దూళిపాళ ధనుంజయ నాయుడు, ఉస్తేల సృజన, ఉస్తెల నారాయణరెడ్డి, ఉప్పతల కోటమ్మ, మండల కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి, రావుల సత్యం, లక్ష్మి , చిలక రాజు శ్రీను, కొమ్మరాజు వెంకట్, ముళ్ళ జానయ్య, అమరారపు పున్నయ్య, బెల్లంకొండ గోవింద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## గ్రంథాలయాలను అభివృద్ధి చేస్తాం

గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు వారోత్సవాలలో వక్తలు

**ప్రజాపక్షం/భువనగిరి :** 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశం గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి.అవైస్ ఉర్ రెహ్మాన్ చిస్తి అధ్యక్షత వహించినారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హనుమంతరావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయాలను తమ నిధులతో అభివృద్ధి చేస్తామని తెలిపారు. వారంలో రెండు రోజులైనా సెల్ ఫోన్లు పక్కన పెట్టి పుస్తకాలు చదవాలని, గ్రంథాలయాలను సందర్శించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ తమ సందేశంలో ఎలక్ట్రానిక్ వస్తువులకు సోషల్ మీడియాకి దూరంగా ఉండాలని జిల్లాలోని గ్రంథాలయాలను డిజిటలైజ్ చేయాలని సూచించినారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.సుధీర్, భువనగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ బాబు రావు, వలిగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమా నాయక్, భువనగిరి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పొత్నాక్ ప్రమోద్ కుమార్, భువనగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## మత్స్యకారుల అభ్యున్నతే లక్ష్యం

చేపపిల్లలు విడుదల చేసిన ఎమ్మెల్యే బాలునాయక్



**ప్రజాపక్షం/దేవరకొండ:** మత్స్యకారుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం అని దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం దేవరకొండ మండలం కొండభీమనపల్లి చెరువు వద్ద సబ్సిడి చేపపిల్లలను మత్స్య శాఖ అధికారులతో కలిసి చెరువులో నాణ్యమైన చేప పిల్లలను విడుదల చేశారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గ వ్యాప్తంగా 241 చెరువులలో 2 కోట్లకు పైగా చేప పిల్లలను విడుదల చేస్తామని తెలిపారు. చెరువులలో చేప పిల్లలను విడవడం మత్స్య కారుల జీవనోపాధిలో వెలుగులు నింపడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం కోసం ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక చర్యగా ఆయన అభివర్ణించారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉన్నదనే విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈకార్యక్రమంలో అధికారులు ఆర్డివో రమణారెడ్డి, ఎంపిడివో డానియల్, తహశీల్దార్ మధుసూధన్‌రెడ్డి, మత్స్యశాఖ అధికారులు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, మండల పార్టీ అధ్యక్షులు లోకసాని శ్రీధర్‌రెడ్డి, రుక్మారెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మకి ఆరోగ్యం బాగాలేకపోడంతో స్కూల్‌కి రాలేకపోతున్నా

పాఠశాలకు హాజరు కాని పదవ తరగతి విద్యార్థిని సుస్మిత ఇంటికి వెళ్లిన కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** భువనగిరి మున్సిపాలిటీ సింగన్న గూడెంలోని ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్న బానోతు సుస్మిత ఇంటికి జిల్లా కలెక్టర్ హనుమంతరావు వెళ్లి ఎందుకు రోజు స్కూల్‌కి వెళ్లడం లేదని సుస్మితని అడిగి తెలుసుకున్నారు. సుస్మిత ఇంట్లో పరిస్థితి పై ఆరా తీశారు. ఇంట్లో వాళ్ళ అమ్మకి ఆరోగ్యం సరిగా లేదని, నాన్న మేస్త్రీ పనికి వెళతారని, అమ్మకి తోడుగా ఎవరు లేకపోవడం వలన ప్రతి రోజూ బడికి వెళ్లలేక పోతున్నానని కలెక్టర్‌కు వివరించిన సుస్మిత. కలెక్టర్ సుస్మిత ఇంటికి వెళ్లిన సమయంలో వాళ్ల అన్నయ్య అమ్మని తీసుకొని ఆసుపత్రికి వెళ్లడం జరిగిందని సుస్మిత కలెక్టర్‌కు తెలిపారు. మీ ఇంట్లో ఎలాంటి ఇబ్బందులు ఉన్న నేను చూసుకుంటానని హామీ ఇచ్చారు. నువ్వు మాత్రం రేపటి నుండి రోజు తప్పని సరిగా స్కూల్‌కి వెళ్ళాలని, మంచిగా చదువుకోవాలని తెలిపారు. విద్యార్థిని స్కూల్ కి రాని రోజు ఇంటి వద్ద నుండి చదువుకోవడానికి సదుపాయాలు సరిగా లేవని తెలుసుకొని సాయంత్రంలోపు స్టడీ చైర్, రైటింగ్ పాడ్ పంపిస్తామని తెలిపారు.

## కష్టపడి చదివితే దేనినైనా సాధించవచ్చు

రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీం అక్తర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** కష్టపడి చదివితే దేనినైనా సాధించవచ్చు అని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీం అక్తర్ అన్నారు. ఈనెల 14 నుండి 20 వరకు నిర్వహిస్తున్న 58 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో ముగింపులో భాగంగా గురువారం ఆయన నల్లగొండ జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ 140 కోట్ల జనాభా ఉన్న భారతదేశంలో ఇండస్ట్రీకి కావాల్సిన వస్తువులను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని, మన దేశ పౌరులు బాగా చదువుకొని మన ఇండస్ట్రీలకు సంబంధించిన వస్తువులను మనమే తయారు చేసుకునే విధంగా తయారవ్వాలి అన్నారు. రాతియుగం, చుక్కలు, చంద్రుడు, కథల పుస్తకాలు,నవలలు చదివానని,విద్యార్థులు గ్రంథాలయంలో పుస్తకాలు చదివి ప్రయోజకులు కావాలని తెలిపారు.అనంతరం ఆయన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ హాఫీజ్ ఖాన్, కార్యదర్శి బాలమ్మ,డిఎస్పి స్పెషల్ బ్రాంచ్ టి.మల్లారెడ్డి,ప్రభుత్వ బాలికల కళాశాల ప్రిన్సిపల్ సుధారాణి పాల్గొన్నారు.

## భవిష్యత్తుకు దారి గ్రంథాలయాలు

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట :** జీవితానికి వెలుతురునిస్తూ భవిష్యత్తుకు దారిచూపెట్టేవి గ్రంథాలయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సూర్యాపేట పట్టణంలోని జిల్లా గ్రంథాలయ కేంద్రంలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరై ఆయన మాట్లాడారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంటాయని వాటిని సద్వినియోగం చేసుకొని రాబోయే కాలంలో ఉద్యోగం సాధించి భవిష్యత్తులో స్థిరపడాలని ఆకాంక్షించారు. విద్యార్థులు గ్రంథాలయంలో వార్తా పత్రికలు, కథల పుస్తకాలు, నావెల్స్ చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అలాగే ప్రతిరోజు 5 పేజీలు చదివే అలవాటుగా మార్చుకోవాలని కోరారు. అనంతరం గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన వ్యాసరచణ, ఉపన్యాసం, చిత్రలేఖనం పోటీలలో ప్రతిభ చూపిన వారికి బహుమతులను అందజేశారు. మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి రూ.1లక్ష చెక్కును విరాళంగా గ్రంథాలయమునకు అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, కార్యదర్శి బాలమ్మ ఉన్నారు.

## భూముల అంశంపై శాసనమండలిలో ప్రస్తావిస్తా

సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** భారత కమ్యూనిస్టు పార్టీ ప్రచార జాతాకు నాయకత్వం వహిస్తున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాల నరసింహ, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కె శ్రీనివాస్‌లకు హుజూర్‌నగర్ మండలంలోని గోపాలపురంలో మండల పార్టీ అధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గోపాలపురం దేవాదాయ ధర్మాదాయ కౌలుదారుల సంఘం తరపున ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంకి వివిధ డిమాండ్లతో కూడిన మెమోరాండం ఇవ్వడం జరిగింది. గత రెండు వందల సంవత్సరాలుగా కౌలు చెల్లించి సేద్యం చేసుకుంటున్నామని, ఇంకా మేము కౌలు చెల్లించలేమని నామమాత్రం రేటుకు వాస్తవ సాగుదారులకి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయమై నెల్లికంటి సత్యం మాట్లాడుతూ చిన్న సన్నకారు రైతాంగానికి ఈ భూములు ఇస్తే బాగుంటుందని ఇట్టి విషయాన్ని శాసనమండలి సభలో ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు. బిసి సంక్షేమ సంఘం నాయకులు దూళిపాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బిసి నాయకులు 42 శాతాన్ని అమలు చేసేవిధంగా ప్రయత్నం చేయాలని వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం ఇవ్వడం జరిగింది. భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఖమ్మంలో నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొప్పోజు సూర్యనారాయణ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు జడ శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు ఎల్లావుల రమేష్, గుండా రమేష్, పానుపాటి వాసుదేవరావు, మండల కార్యదర్శి కందుల వెంకటేశ్వర్లు, బూరుగడ్డ శాఖ కార్యదర్శి కనకయ్య, సింగారం శాఖ కార్యదర్శి సెంబిరెడ్డి, లకారం శాఖ కార్యదర్శి శ్యామ్‌సన్, దేవాలయము రైతులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# రీల్



## కళ్యాణి ప్రియదర్శన్ కొత్త చిత్రం ప్రారంభం

మాయ, మానగరం, మాన్‌స్టర్, తానక్కరన్, ఇరుగపాత్రు, బ్లాక్ వంటి వరుసగా ఆరు విజయవంతమైన చిత్రాల తర్వాత పొటెన్షియల్ స్టూడియోస్ తమ ప్రొడక్షన్ నెంబర్ 7ను లాంచ్ చేసింది. ఈ చిత్రంలో జాతీయ స్థాయిలో ప్రశంసలు పొందిన లోక స్టార్ కళ్యాణి ప్రియదర్శన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రంలో నాన్ మహాన్ అల్లా ఫేమ్ దేవదర్శిని, వినోద్ కిషన్, కీలక పాత్రలు పోషించనున్నారు. నూతన దర్శకుడు ధీరవియం ఎస్ఎన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌లో ప్రవీణ్ భాస్కర్, శ్రీ కుమార్ దర్శకుడితో పాటు స్క్రీన్‌ప్లే సంభాషణలు రాశారు. జస్టిన్ ప్రభాకరన్ సంగీతం సమకూర్చారు గోకుల్ బెనోయ్ సినిమాటోగ్రఫీ అందించారు. అరల్ ఆర్. తంగం ఎడిటర్గా, మాయాపాండి ప్రొడక్షన్ డిజైనర్గా, ఇనాజ్ ఫర్హాన్ మరియు షేర్ అలీ కాస్ట్యూమ్స్ అందిస్తున్నారు. పొటెన్షియల్ స్టూడియోస్ బ్యానర్పై ఎస్ ఆర్ ప్రకాష్ బాబు, ఎస్.ఆర్. ప్రభు, పి.గోపీనాథ్, తంగ ప్రభహరన్ ఆర్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ఈరోజు చెన్నైలో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది.


## ఆ పాత్ర మోహన్ బాబు వల్లే సాధ్యమైంది

'కొదమసింహం' గురించి చిరంజీవి వ్యాఖ్యలు



మెగాస్టార్ చిరంజీవి కెరీర్‌లో సక్సెస్, జానర్ పరంగా చూస్తే ఒక ప్రత్యేకమైనదిగా 'కొదమసింహం' సినిమాను చెప్పుకోవచ్చు. చిరంజీవి నటించిన ఒకే ఒక కౌబాయ్ సినిమా ఇది. 1990, ఆగస్టు 9న ప్రేక్షకుల ముందుకొచ్చి ఘన విజయాన్ని సాధించిన 'కొదమ సింహం' సినిమాను ఈ నెల 21వ తేదీన 4కే కన్వర్షన్, 5.1 డిజిటల్ సౌండింగ్ తో సరికొత్తగా రమా ఫిలింస్ అధినేత కైకాల నాగేశ్వర రావు రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ ప్రెస్ మీట్‌లో స్పెషల్ వీడియో ద్వారా మెగాస్టార్ చిరంజీవి ఈ సినిమాతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ కొదమసింహం సినిమాలో నా స్టిల్ చాలా పాపులర్. నాకు ఫేవరేట్ ఫొటో అది. నాకు నచ్చిందని ప్రొడ్యూసర్స్ ఆ స్టిల్ ను ఫ్రేమ్ చేసి గిఫ్ట్ గా ఇచ్చారు. మా ఇంట్లో ఇప్పటికీ ఈ ఫొటో ఉంది. నాకు కౌబాయ్ మూవీస్ అంటే ఇష్టం. క్లింట్ ఈస్ట్‌వుడ్, గ్రెగరీ పెక్, ఒమర్ షరీఫ్ వంటి స్టార్స్ చేసిన సినిమాలను ఇష్టంగా చూస్తుండేవాడిని. నేను యాక్టర్ అయ్యాక అలాంటి కౌబాయ్ మూవీ వస్తుందని, నేను చేస్తానని ఊహించలేదు. అప్పటికి హీరో కృష్ణ చేసిన మోసగాళ్లకు మోసగాడు పెద్ద హిట్టై అన్ని రికార్డ్స్ బ్రేక్ చేసింది. అలాంటి సినిమా మళ్లీ చేయడం సాహసమే అవుతుంది. రమా ఫిలింస్ నాగేశ్వరరావు కౌబాయ్ కథతో మీతో ఒక కొత్త తరహా మూవీ చేయాలని ఉందని డైరెక్టర్ మురళీ మోహన్ రావుతో కలిసి వచ్చి నాకు కథ చెప్పారు. కథ బాగా నచ్చి వెంటనే అంగీకారం తెలిపాను. అలా కొదమసింహం సినిమా మీ ముందుకు వచ్చింది. మొదటిసారి నేను గడ్డం పెంచి నటించిన సినిమా ఇది. ఈ సినిమాలో నాకు నచ్చిన క్యారెక్టర్ మోహన్ బాబు చేసిన సుడిగాలి క్యారెక్టర్. ఈ క్యారెక్టర్‌లో ఫన్, జుగుప్స, విలనిజం అన్నీ కలిపి ఉంటాయి. మోహన్ బాబు కాకుండా మరో నటుడైతే ఈ పాత్రను ఇంత బాగా ఒప్పించి మెప్పించి ఉండేవారు కారు. అది మోహన్ బాబు వల్లే సాధ్యమైంది. విలన్‌గా బాలీవుడ్ లెజెండరీ నటుడు ప్రాణ్ నటించారు. ఆయనతో కలిసి నటించే అదృష్టం నాకు కొదమసింహం సినిమాతో దక్కింది. కైకాల సత్యనారాయణ , మారుతీరావు అన్నపూర్ణ, సోనం, రాధ వీళ్లతో కలిసి నటించాను. వీళ్లతో ప్రతి సీన్, ప్రతి సాంగ్, ప్రతి యాక్షన్, హార్స్ రైడింగ్, ఇవన్నీ హైలైట్స్. ఈ సినిమాలోని అన్ని సాంగ్స్ సూపర్ డూపర్ హిట్ అయ్యాయి. రాజ్ కోటి అంత మంచి సాంగ్స్ ఇచ్చారు. జపం జపం జపం కొంగ జపం పాట నా ఫేవరేట్ సాంగ్. ప్రభుదేవా చక్కటి కొరియోగ్రఫీ చేశాడు. తన స్టైల్ ను ఫాలో అయ్యాను. ఈ సినిమాను రి రిలీజ్ చేస్తున్నారు. ఈ సినిమాను తప్పకుండా ఎంజాయ్ చేస్తారు. థియేటర్స్ లో ఈ నెల 21 చూడండి. అన్నారు.ఈ ప్రెస్ మీట్ లో నిర్మాత కైకాల నాగేశ్వర రావు , డైరెక్టర్ మురళీమోహన్ రావు, రైటర్ సత్యానంద్, మ్యూజిక్ డైరెక్టర్ కోటి , రైటర్ పరుచూరి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

## నాగ చైతన్య కొత్త సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్ రిలీజ్



యువ సామ్రాట్ నాగ చైతన్య నెవర్ బిఫోర్ మిథికల్ థ్రిల్లర్ ఎన్ సి 24 థ్రిల్ చేయబోతున్నారు. ఈ చిత్రానికి విరూపాక్షతో సంచలన విజయాన్ని అందుకున్న కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర సుకుమార్ రైటింగ్స్ ప్రతిష్టాత్మక బ్యానర్లపై ప్రసాద్, సుకుమార్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్నారు. లాపతా లేడీస్ ఫేమ్ శ్రీవాస్తవ కీలక పాత్ర పోషిస్తున్నారు. సినిమా మేకర్స్ తాజాగా విడుదల చేసిన స్ట్రైకింగ్ ఇమర్సివ్ మేకింగ్ వీడియో సినిమా భారీ స్కేల్, విజన్, అంబిషన్ను చూపించింది. విడుదలైన వెంటనే ఈ గ్లిమ్స్ ఇంటర్నెట్లో హాట్ టాపిక్గా మారింది. సినిమా కోసం జరుగుతున్న కృషి, క్రియేటివ్ వర్క్ అద్భుతంగా కనిపిస్తోంది. వీడియోలో నాగ చైతన్య ఫిజికల్, యాక్షన్ ట్రైనింగ్ కట్టిపడేసింది. ఇంటర్నేషనల్ యాక్షన్ కొరియోగ్రాఫర్ జుజి మాస్టర్ పర్యవేక్షణలో ఆయన చేసిన ట్రైనింగ్, పాత్ర కోసం తీసుకున్న ట్రాన్స్ఫర్మేషన్ అద్భుతంగా వున్నాయి.అజనీష్ లోకనాథ్ అందించిన బ్యాక్గ్రౌండ్ స్కోర్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. నవంబర్ 23న నాగ చైతన్య బర్త్ డే సందర్భంగా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ను విడుదల చేస్తున్నట్లు టీమ్ అధికారికంగా ప్రకటించింది. ఈ అప్డేట్ ఇప్పటికే అత్యంత ఆసక్తిగా ఎదురు చూస్తున్న రివీల్స్లో ఒకటిగా మారింది.ప్రస్తుతం హైదరాబాదులో యాక్షన్ షెడ్యూల్ జరుగుతోంది. అందులో ప్రధాన నటీనటులు పాల్గొంటున్నారు



## ఘనంగా 'రాజు వెడ్స్ రాంబాయి' ప్రీ రిలీజ్

అఖిల్ రాజ్, తేజస్విని జంటగా నటిస్తున్న సినిమా 'రాజు వెడ్స్ రాంబాయి'. ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్స్ ప్రొడక్షన్ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రాన్ని డా.నాగేశ్వరరావు పూజారి సమర్పణలో డోలాముఖి సుబల్టర్న ఫిలింస్, మాన్ సూన్స్ సంస్థ బ్యానర్స్‌పై వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి నిర్మిస్తున్నారు. సాయిలు కంపాటి దర్శకత్వం వహిస్తున్నారు. నవంబర్ 21న 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమాను వంశీ నందిపాటి ఎంటర్ టైన్‌మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్‌పై థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొస్తున్నారు. బుధవారం సాయంత్రం ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ ను సక్సెస్ ఫుల్ హీరో కిరణ్ అబ్బవరం అతిథిగా హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నటుడు శివాజీ మాట్లాడుతూ ప్రేక్షకుల్ని ఆలోచింపజేసే చిత్రమిది. ఇదొక మట్టికథ. ఇలాంటి రియలిస్టిక్ మూవీ చేయాలంటే ధైర్యం కావాలి. ఇలాంటి సినిమా చేసినందుకు ఈటీవీ విన్ వారిని అభినందిస్తున్నా. మలయాళంలో అయితే 'రాజు వెడ్స్ రాంబాయి' లాంటి మూవీస్ ఏడాది పాటు ఆదరణ పొందుతాయి. దర్శకుడు అంత సహజంగా, ప్రేక్షకుల మనసును తాకేలా రూపొందించారు. తెలుగులో ఇప్పుడిప్పుడే ఆ ట్రెండ్ మొదలైంది. నిజాయితీగా కథను నమ్మి తీసిన ఏ సినిమా మోసం చేయదు. ఈ సినిమా మంచి విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నా. అన్నారు. ఈ కార్యక్రమంలో నటి అనిత చౌదరి , సింగర్ అనురాగ్ కులకర్ణి , డైరెక్టర్ తరుణ్ భాస్కర్, నటుడు శివాజీ రాజా, డైరెక్టర్ సాయి మార్తాండ్, నిర్మాత రాహుల్ మోపిదేవి, నిర్మాత వేణు ఊడుగుల, మ్యూజిక్ డైరెక్టర్ సురేష్ బొబ్బిలి , లిరిసిస్ట్ మిట్టపల్లి సురేందర్ , నటుడు చైతన్య జొన్నలగడ్డ, ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి , ఈటీవీ విన్ హెడ్ సాయికృష్ణ, ఈటీవీ విన్ కంటెంట్ హెడ్ నితిన్ , హీరోయిన్ తేజస్వినీ, డైరెక్టర్ సాయిలు కంపాటి , హీరో అఖిల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిలిం ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు వైస్ ప్రెసిడెంట్‌గా భరత్ భూషణ్

సినిమాలపై మక్కువతో 27 సంవత్సరాలుగా సినిమాలు డిస్ట్రిబ్యూషన్ చేస్తూ ఎన్నో విజయవంతమైన సినిమాలను ప్రేక్షకులకు అందిస్తూ వచ్చారు భరత్ భూషణ్. ఈ విధంగా ఎన్నో హిట్ సినిమా లు ఈయన ఖాతాలో ఉన్నాయి. అలాగే భరత్ ఇన్ఫ్రా అనే కంపెనీ స్థాపించి తద్వారా ఎంతోమందికి ఉద్యోగ అవకాశాలు అందించారు. ఈ విధంగా చిత్ర పరిశ్రమకు ఆయన వంతు అండగా నిలబడి తెలుగు ఫిలిం ఛాంబర్ ప్రెసిడెంట్ గా చేస్తూ తనదైన శైలిలో అటు పరిశ్రమ తరపున ప్రభుత్వానికి అలాగే ఇటు చిత్ర పరిశ్రమలో ఉన్న చిన్న సమస్యల నుండి పెద్ద సమస్యల వరకు ప్రతి చోట ఆయన కలగజేసుకుంటూ ప్రతి సమస్యను తీరుస్తూ వచ్చారు. కార్మికులకు, డిస్ట్రిబ్యూటర్లకు, నిర్మాతలకు ఎటువంటి సమస్య వచ్చినా న్యాయపరమైన చర్యలు తీసుకుని అందరికీ మంచి చేస్తూ వచ్చారు. ప్రస్తుతం ఫిలిం ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు పి భరత్ భూషణ్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకోబడ్డారు. దానికి గాను భూషణ్ అందరికీ ధన్యవాదాలు తెలిపారు.



## మూకీ సినిమా చేయాలనుంది

— హీరో అల్లరి నరేష్ —



హీరో అల్లరి నరేష్ అప్ కమింగ్ థ్రిల్లర్ '12A రైల్వే కాలనీ' విడుదల సందర్భంగా హీరో అల్లరి నరేష్ విలేకరులతో చిట్ చాట్ నిర్వహించారు. ఇది నాకు 63వ రిలీజ్. ఈసారి చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాం. చాలా మంచి టీంతో పనిచేశాం. టుమారో ఈజ్ మైడే అనే పాజిటివ్ ఫీలింగ్ ఉంది. ఒక కొత్త జానర్ చేద్దామనే ఉద్దేశంతో ఉన్నాను. యదార్థంగా జరిగిన సంఘటన ఆధారంగా తీసిన సినిమా ఇది. హైదరాబాదులో ఆ సంఘటన జరిగింది. దాన్ని సినిమాకు తగ్గట్టుగా చాలా అద్భుతమైన స్క్రీన్ ప్లేతో చేయడం జరిగింది. స్క్రీన్ ప్లే చాలా డిఫరెంట్ గా ఉంటుంది. ఎక్కడో మొదలైన సీన్‌కి చివర్లో కనెక్షన్ ఉంటుంది. అలాగే ఈ సినిమాలో ఒక మూడు నాలుగు కథలు సమాంతరంగా జరుగుతుంటాయి. చాలా మైండ్ గేమ్ ఉంటుంది. 12A అనే ఇంట్లో జరిగే కథ. ఒక రైల్వే కాలనీ బ్యాక్ డ్రాప్‌లో జరిగే ఇది. కామాక్షి వాళ్ల నాన్నగారు మా నాన్నగారి దగ్గర వర్క్ చేశారు. తను ఇంటర్ చదివేటప్పుడు నాసినిమాల షూటింగ్‌కి వచ్చేవారు. ఇంతకుముందు నా మారేడుమిల్లి సినిమాలో చేసింది. ఈ సినిమాకి ఒక మిడిల్ క్లాస్, పక్కింటి అమ్మాయిలా కనిపించే హీరోయిన్ కావాలి. అనిల్‌తో కామాక్షి పొలిమేర సినిమా చేసినప్పటికీ కూడా ఈ సినిమా కోసం ప్రత్యేకంగా ఫోటో షూట్ చేశాము. తను తెలుగమ్మాయి. భాష పరంగా ఎలాంటి అడ్డంకి ఉండదు. చాలా మంచి ఆర్టిస్టు. తను యాక్టింగ్ తో పాటు డైరెక్షన్ డిపార్ట్మెంట్‌లో కూడా పనిచేసింది అనిల్, కామాక్షి, నాని వీళ్లంతా మంచి ఫ్రెండ్స్. తను రైటింగ్ డిపార్ట్మెంట్‌లో కూడా ఉంటుంది. మల్టీ టాలెంటెడ్. నాకు డైరెక్షన్ చేయాలని ఎప్పటినుంచో ఉంది. కానీ దానికి చాలా సమయం కావాలి. ఒక సినిమా డైరెక్షన్ చేస్తాను. అది డిడిఎల్జె లాగా గుర్తుండిపోయే సినిమా కావాలనేది నా కోరిక. నాకు ఒక హారర్ సినిమా చేయాలనుంది. అలాగే ఒక మూకీ సినిమా చేయాలనుంది. డైలాగ్ లేకుండా నవ్వించాలి అలాంటి స్టోరీ ఎప్పటికైనా ఒకటి చేయాలని ఉంది. ఆల్కహాల్ జనవరిలో రిలీజ్ ఉంటుంది. హాస్య, అన్నపూర్ణ బ్యానర్లో ఒక సినిమా ఈ నెల ప్రారంభం కాబోతోంది. జనవరి నుంచి మరో కొత్త సినిమా స్టార్ట్ కాబోతుంది. ఈ రెండు కూడా మంచి కామెడీ సినిమాలు

## సిబిఐ కోర్టుకు హాజరైన ఏపి మాజీ సిఎం వైఎస్ జగన్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వైఎస్ఆర్ సిపి అధినేత, ఎపి మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇటీవల కోర్టు అనుమతితో విదేశీ పర్యటనకు వెళ్లి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం నాంపల్లి సిబిఐ కోర్టులో ఆయన హాజరయ్యారు. జగన్ రాక నేపథ్యంతో హైదరాబాద్ నాంపల్లి కోర్టు వద్ద పోలీసులు భారీగా భద్రత ఏర్పాటు చేశారు. కోర్టుకు వచ్చే రెండు మార్గాలను ఆధీనంలోకి తీసుకుని.. న్యాయవాదులకు మాత్రమే లోనికి అనుమతించారు. 'హాజరును కోర్టు రికార్డు చేసింది. ప్రస్తుతానికైతే ఆయన మళ్లీ కోర్టుకు రావాల్సిన అవసరం లేదని జగన్ తరపు లాయర్ మీడియాకు తెలిపారు. కోర్టు ప్రక్రియ పూర్తి కావడంతో ఆయన అక్కడి నుంచి నేరుగా లోటస్‌పాండ్‌లోని నివాసానికి చేరుకొని, తల్లి విజయమ్మతో భేటీ అయ్యారు. ఆపై పర్యటన ముగించుకుని తిరుగు పయనమయ్యారు.

**భారీగా తరలివచ్చిన అభిమానులు..**

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాకతో హైదరాబాద్‌లో కోలాహలం నెలకొంది. బేగంపేట ఎయిర్‌పోర్టు వద్దకు భారీగా చేరుకున్న అభిమానులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. దారి వెంట ఆయనతో ముందుకు కదులుతూ జై జగన్ నినాదాలతో హోరెత్తించారు.

## నిరంతర పోరాటాలు

(మొదటి పేజీ తరువాయి)

100 సంవత్సరాలుగా ప్రజా ఉద్యమాలు చేస్తున్న ఏకైక పార్టీ సిపిఐ అన్నారు. కమ్యూనిస్టులు అందరూ ఒక పార్టీగా ఏర్పడి, లౌకిక భావజాలం ఉన్న పార్టీలన్నీ ఐక్యంగా బిజెపిని ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. పెట్టుబడిదారీ దేశాలు మూడో ప్రపంచ దేశాలతో రాజకీయాలు చేస్తున్నాయన్నారు. ప్రపంచంలో, దేశంలో సమర్థవంతంగా నడుస్తున్నాయి కమ్యూనిస్టు ప్రభుత్వాలే అని, ప్రజా సమస్యల పరిష్కారంలో అవి సమర్థవంతంగా పనిచేస్తున్న విషయాన్ని ప్రజలు గుర్తించారన్నారు. బీహార్ ఎన్నికల్లో బిజెపి అనేక జిమ్మిక్కులు చేసినప్పటికీ అధికారం చేపట్టేందుకు స్థానాలు వచ్చాయి కానీ, ప్రజాబలం ప్రతిపక్షాలకే దక్కిందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 10 సంవత్సరాలుగా అధికారంలో ఉన్నా ఒక్క ప్రభుత్వ రంగ సంస్థను కూడా ఏర్పాటు చేయలేదని విమర్శించారు. నష్టాల్లో ఉన్నాయంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పడం, కార్పొరేట్ వ్యక్తులకు అప్పులు రద్దు చేయడం చేస్తూ పెట్టుబడిదారీ వర్గానికి న్యాయం చేస్తుందన్నారు. బిజెపి పార్టీ ప్రభుత్వం ప్రమాదకరమైందని, దానిని లౌకిక శక్తులన్నీ ఐకమత్యంతో ఎదుర్కోవాలన్నారు.

**పేదవాళ్ళ మౌలిక సమస్యలు అట్లానే ఉన్నాయి : బాలనరసింహ, సత్యం**

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 సంవత్సరాలు పూర్తయినప్పటికీ పేదవాళ్ళ మౌలిక సమస్యలు అట్లానే ఉన్నాయని ఎమ్మెల్సీ, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ అన్నారు. బిజెపి కార్పొరేట్ అనుకూల విధానాల వలన దేశ సంపద కొన్నివర్గాల వద్దనే కేంద్రీకృతమైందన్నారు.

విద్య, వైద్యం, గృహవసతి లాంటి సమస్యలు పేదలు ఈ నాటికీ ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇస్తున్న ఉచిత బియ్యంపైనే అనేక కుటుంబాలు ఆధారపడ్డాయని ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయన్నారు. పౌరహక్కులు అందుబాటులో ఉండడం లేదని, నియంతృత్వ విధానాలతో ప్రభుత్వాలు నడుస్తున్నాయని, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారన్నారు. సిపిఐ ఏర్పాటు నుండి ప్రజాసమస్యలే లక్ష్యంగా ఉద్యమిస్తున్నామని, ఆనాటి వారసత్వాన్ని ఈనాటి ప్రజలు నిలబెట్టాలన్నారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభతో దేశవ్యాప్తంగా కమ్యూనిస్టులకు ఒక ప్రేరణ కలిగించేలా బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. మొదట ప్రచార జాతకు జాతీయ మహిళా సమాఖ్య, సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో బోనాలతో ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరం మల్లేశ్వరి, జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, కొప్పోజు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సిఎంగా నితీశ్ ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

ఎల్‌జెపి (ఆర్‌వి) నుండి ఇద్దరు, హెచ్‌ఎఎం నుంచి ఒకరు, ఆర్ఎల్ఎం నుంచి ఒకరు ఉన్నారు. గత ప్రభుత్వంలో డిప్యూటీ సిఎంలుగా ఉన్న సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హా, ఎన్నికల తర్వాత బిజెపి శాసనసభాపక్ష నాయకుడిగా, ఉప నాయకుడుగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అనేక ఎన్‌డిఎ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, సీనియర్ సంకీర్ణ నాయకులు హాజరయ్యారు. బుధవారం రాత్రి పాట్నాకు చేరుకున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బిజెపి జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాష్ నడ్డా వేదికపై ఉన్నవారిలో ఉన్నారు. టిడిపి అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యోగి ఆదిత్యనాథ్ (ఉత్తరప్రదేశ్), హిమంత బిశ్వ శర్మ (అసోం), దేవేంద్ర ఫడ్నవీస్ (మహారాష్ట్ర), మోహన్ యాదవ్ (మధ్యప్రదేశ్), రేఖ గుప్తా (ఢిల్లీ) హాజరయ్యారు. 89 మంది సభ్యులతో బిజెపి బిహార్ అసెంబ్లీలో ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించింది. దీంతో అందరూ ఊహించినట్లుగా కొత్తగా ప్రమాణ స్వీకారం చేసిన మంత్రివర్గంలో 14 మంది మంత్రులలో ఆ పార్టీ సింహభాగంలో ఉంది. చౌదరి, సిన్హాతో పాటు, ప్రమాణ స్వీకారం చేసిన ఇతర బిజెపి నాయకుల్లో మంగళ్ పాండే, నితిన్ నబిన్, సురేంద్ర ప్రసాద్ మెహతా కూడా ఉన్నారు. వీరందరూ గత ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్నవారే. పార్టీ 'ఒక వ్యక్తి, ఒక పదవి' విధానానికి అనుగుణంగా దాదాపు రెండు సంవత్సరాల క్రితం మంత్రివర్గం నుండి రాజీనామా చేసిన రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు దిలీప్ జైస్వాల్, కొంతకాలం విరామం తర్వాత తిరిగి వచ్చిన మరో మంత్రి నారాయణ ప్రసాద్ తిరిగి మంత్రివర్గంలోకి వచ్చారు. మొదటిసారి మంత్రి పదవిని పొందనున్న ఇతర బిజెపి నాయకుల్లో అరుణ్ శంకర్ ప్రసాద్, డాక్టర్ ప్రమోద్ కుమార్, లఖేంద్ర కుమార్ రౌషన్, సంజయ్ సింగ్ టైగర్, రామ నిషాద్ ఉన్నారు. గత సంవత్సరం పాటలీపుత్ర లోక్‌సభ స్థానం నుండి ఓడిపోయిన మాజీ కేంద్ర మంత్రి, అసెంబ్లీ ఎన్నికల్లో దానాపూర్ నుండి గెలుపొందగా ఆయన కూడా మంత్రివర్గంలో చోటు దక్కింది. ఇక జెడి(యు) సభ్యుల్లో న్న వారిలో అందరూ గత ప్రభుత్వంలో మంత్రులే. వారిలో 243 మంది సభ్యులున్న అసెంబ్లీలో 202 సీట్లు గెలుచుకున్న ఎన్‌డిఎలోని ఏకైక ముస్లిం ఎమ్మెల్యే జామా ఖాన్ ఉన్నారు. ఇతరుల్లో బిజేంద్ర యాదవ్, శ్రావణ్ కుమార్, విజయ్ కుమార్ చౌదరి, లేషి సింగ్, మదన్ సాహ్నీ, సునీల్ కుమార్, అశోక్ చౌదరి ఉన్నారు. హెచ్‌ఎఎం నుండి మాంఝీ కుమారుడు, పార్టీ అధ్యక్షుడు సంతోష్ సుమన్, ఎల్‌జెపిఆర్‌వి మంత్రులలో దివంగత రామ్ విలాస్ పాశ్వాన్ సహచరుడు బఖ్రీకి చెందిన సంజయ్ కుమార్ పాశ్వాన్, మహువాలో తేజ్ ప్రతాప్ యాదవ్‌ను ఓడించిన సంజయ్ కుమార్ సింగ్ ఉన్నారు. సిఎంతో పాటు దిలీప్ జైస్వాల్, డాక్టర్ ప్రమోద్ కుమార్, అశోక్ చౌదరి, సంతోష్ సుమన్ రాష్ట్ర శాసన మండలి సభ్యులు. మంత్రివర్గంలో ఐదుగురు దళితులు ఉన్నారు. బిజెపి, ఎల్‌జెపిఆర్‌వి, హెచ్‌ఎఎం నుంచి ఒక్కొక్కరు ఉండగా, జెడియు నుంచి ఇద్దరు ఉన్నారు. ఎనిమిది మంది మంత్రులు అగ్ర కులాలకు చెందినవారు కాగా, వీరిలో నలుగురు రాజ్‌పుత్‌లు ఉన్నారు. ముగ్గురు యాదవులకు కూడా స్థానం కల్పించారు. ముఖ్యమంత్రితో సహా రాష్ట్ర మంత్రివర్గానికి అనుమతించబడిన గరిష్ట మంత్రుల సంఖ్య 36.

## నేటికీ అందని ఉచిత విద్య, వైద్యం

(మొదటి పేజీ తరువాయి)

తరుణంలో ఆధునిక సాంకేతికను చేతబట్టుకొని ఉపాధి పొందటం ఎంత వరకు సాధ్యమని ప్రశ్నించారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్మల్ జిల్లా బాసర నుండి ఖమ్మం వరకు చేపట్టిన ప్రచార జాతాలు నిర్మల్, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల మీదుగా గురువారం మేడ్చల్ జిల్లాలోని షాపూర్‌నగర్ నుంచి యాప్రాల్ చేరుకొని జవహర్‌నగర్, ఇసిఐఎల్, మేడిపల్లి, ఘట్‌కేసర్ మీదుగా కొనసాగింది. ఈ సందర్భంగా పశ్య పద్మ మాట్లాడుతూ దేశంలో 30 కోట్ల మంది నిరుద్యోగులుగా ఉండగా, ప్రతి ఏటా మరో 13 లక్షల మంది అదనంగా ఈ జాబితాలో చేరుతున్నారన్నారు. దశాబ్ద కాలానికి పైబడి దేశాన్ని ఏలుతున్న బిజెపి ప్రభుత్వం ఏటా 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ఇప్పటికీ నిలబెట్టుకోలేక పోయిందన్నారు. మరో పక్క విదేశీ పెట్టుబడుల పేరిట నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందన్న కేంద్ర ప్రభుత్వం పదే పదే చేస్తున్న ప్రచారంలో ఏ మాత్రం నిజం లేదని అన్నారు.గ్రామీణ ఉపాధి పథకాన్ని కేంద్రం నీరుగార్చిందని, గ్రామాల్లో లక్షలాది మందికి ఈ పథకం వల్ల లబ్ధి చేకూరటం లేదని అన్నారు. యుఎస్ఎ, చైనా, కొరియాలాంటి దేశాల్లో ఆధునిక టెక్నాలజీ 85 శాతం వరకు ప్రభుత్వాలు అందిస్తుంటే మన దేశంలో మాత్రం కేవలం 1.7 శాతంగా ఉందని ఆమె గుర్తుచేశారు. విద్యార్థులు, నిరుద్యోగుల పట్ల పాలకుల నిర్లక్ష్య పూరిత విధానాలు మారాలని, యువతకు ఎప్పటికప్పుడు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేసారు. ఇసిఐఎల్ చౌరాస్తాలో ప్రచార జాతకు నాయకత్వం వహిస్తున్న పశ్యపద్మ, వలి ఉల్లా ఖాద్రి, ఉప్పలయ్య, నరేంద్రప్రసాద్‌లకు పార్టీ శ్రేణులతో పూలమాలలు, ఎర్ర కండువాలతో స్వాగతం పలికిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్ బోస్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో కమ్యూనిస్టులు పురోగమిస్తుండగా, ఇటీవల జరిగిన అనేక రాష్ట్రాల ఎన్నికల్లో బిజెపిని ఓడించటంలో కాంగ్రెస్ చతికిల బడిందని అన్నారు. మన దేశంలో మావోయిస్టులు తుపాకి గొట్టం ద్వారానే రాజ్యాధికారం అన్న తమ పంథాను వీడి ప్రజా ఉద్యమాల్లో కమ్యూనిస్టులతో కలిసిరావాలని ఆయన పిలుపిచ్చారు. భారత దేశంలో కమ్యూనిస్టు పార్టీ అనేక సంఘాలను నిర్మాణం చేసిందని, విద్యార్థి, యువజ, మహిళా, కార్మిక, కర్షక, మేధావి వర్గాలతో ప్రతి ఒక్కరి సమస్యల పరిష్కారానికి వెన్నటి నిలుస్తోందన్నారు. దేశానికి, సమాజ సేవకు సిపిఐ చేసిన త్యాగాలవి తరగని చరిత్ర అన్నారు. పెట్టుబడిదార్లకు వంత పాడుతూ సామాన్య జనానికి అడుగడుగునా తీరని అన్యాయానికి ఒడిగడుతున్న పాలకులను బోస్ ఈ సందర్భంగా హెచ్చరించారు. ఇసిఐఎల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు జి. దామోదర్‌రెడ్డి, సాయిలు గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్ రావు, ధర్మేంద్ర, సత్య ప్రసాద శంకర్, రచ్చ కిషన్, నర్సింహ, సిపిఐ ఉప్పల్ నియోజకవర్గ నేతలు నారా నర్సింహా, బాబురావు, సాంబశివరావు, జాన్, మిరియాల సాయిలు, స్వరూప, రాజేశ్వరి, ఏఐవైఎఫ్ నేతలు గిరిబాబు, వికాస్, నదీమ్, మహేష్, అజీమ్, సమీర్, శాబాజ్, షోయబ్‌లతో పాటు విద్యార్థినీ విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యాప్రాల్‌లో ప్రచార జాతకు సిపిఐ జిల్లా సమితి సభ్యులు సిహెచ్ దశరథ్, కార్యదర్శి, యాదయ్య గౌడ్, జిల్లా సమితి సభ్యులు కాసర్ల నాగరాజు, ఎ.అశోక్, బి.యాదగిరి, ఎస్.కె అజీజ్, సయ్యద్ యూసూఫ్, జె.వెంకటరమణ, రొయ్యల గిరిజ తదితరులు స్వాగతం పలికారు. కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

## పాలకుల కుట్రలు

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. సిపిఐ పార్టీ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తల పెట్టిన బస్సు యాత్ర గురువారం వరంగల్ జిల్లా నర్సంపేట నుంచి మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రానికి చేరుకుంది. ఈసందర్భంగా రాష్ట్ర సహాయకార్యదర్శి తక్కలపల్లి శ్రీనువాస్ రావు మాట్లాడు తూ ఎర్ర జెండాతోనే పేద ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని 100 సంవత్సరాలుగా పేద ప్రజల కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్నామని అ న్నారు. చర్చలకు సిద్ధమని మావోయిస్టులు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా బూటకపు ఎన్కౌంటర్లు చేస్తున్నారని అన్నారు. కమ్యూనిస్టు లు బలంగా ఉంటేనే సమాజంలో ప్రజలకు రక్షణ ఉంటుందని, రానున్న రో జులో కమ్యూనిస్టులకే భవిష్యత్తు ఉంటుందని, ప్రజలు చట్ట సభల్లో కమ్యూనిస్టులు బలంగా ఉండాలని కోరుకుంటున్నారని ఆయన గుర్తు చేశారు. దేశం లో మతోన్మాదాన్ని తరమికొట్టడానికి ఇదే సరైన సమయమని సమ సమాజ ని ర్మాణం కోసం కమ్యూనిస్టులంతా ఏకం కావాలని అన్నారు.సిపిఐ వందేళ్ళ ఉత్సవాల జాతీయ స్థాయి ముగింపు సభ డిసెంబర్ 26 న ఖమ్మంలో లక్షలాది మందితో భారి బహిరంగ సభ జరగనుందని దీనికి పెద్ద ఎత్తున రావాలని పిలుపునిచ్చారు.

**బూటకపు ఎన్‌కౌంటర్లతో మావోయిస్టులను చంపుతున్నారు : చాడ**

బూటకపు ఎన్కౌంటర్లతో మావోయిస్టులను చంపుతూ ప్రజలను భయోందోళను గురి చేస్తునారని పేద ప్రజల పట్ల లేని మక్కువ కేంద్ర ప్రభుత్వానికి బడా బాబుల పట్ల ఉందని సిపిఐ జాతీయ నేత చాడ వెంకటరెడ్డి అన్నారు. పేద బడుగు బలహిన వర్గాల కోసం ఎర్ర జెండా ఎప్పుడు ఎగురుతూనే ఉండాలని ఎర్రజెండా ఉంటేనే పేద ప్రజలు సుభిక్షంగా ఉంటారని అన్నారు. ఎక్కడ ఏ సమస్య వచ్చినా మొట్టమొదట ప్రత్యక్షం అయ్యేది సిపిఐ పార్టీ అని ఎంతో మంది పేదలకు భూములను పంచిన ఘనత సిపిఐ పార్టీలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా మండల నాయకలు శంకర్ విజయ్‌సారది మండలకన్వీర్ మాలోత్ రవీందర్ చోప్పరి శేఖర్ మడత నారాయణ ఎర్రోజు కరుణాకర్ దాసరి సాయిలు తదితరులు పాల్గోన్నారు.






Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com